ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఆగష్టు 2026
₹ 20

సుబోధ

శ్రీరామకృష్ణులు : కేవలం పండితులుగా ఉండి భగవంతుని పట్ల భక్తి లేనట్లయితే, అటువంటివారి పలుకులు అర్థరహితాలు. సమాధ్యాయి అనే ఒక పండితుడు 'భగవంతుడు రసహీనుడు, మీరు మీ ప్రేమ భక్తిరసంతో తడిపి ఆయనను సరసుణ్ణి చేయండి' అన్నాడు. చూశారా! వేదాలు ఎవరిని రసస్వరూపుడని పేర్కొంటున్నాయో, ఆయనను రసహీనుడని అనటమా! భగవంతుడు అసలు ఎటువంటివాడో ఆ పండితుడు కాస్త కూడా తెలుసుకోలేదన్న విషయం దీన్నిబట్టి తెలుస్తోంది. అందుకే ఈ అర్థరహిత ప్రలాపం. 'మా మామగారి ఇంట్లో గోశాల నిండా గుర్రాలే!' అన్నాడొకడు. దీన్నిబట్టి అతడి మామ వద్ద గుర్రాలే లేవని గ్రహించవచ్చు. ఎందుకంటే, గోశాలలో గుర్రాలు ఉండవు కదా! (అంతా నవ్వారు)

ఐశ్వర్యం, కీర్తి, పదవులవల్ల కొందరు అహంకార పూరితులవుతారు. ఇవన్నీ కేవలం ఒకటి రెండు రోజులకు మాత్రమే! ఏదీ మన వెంట రాదు.

మనిషికి తాను సంపన్నుడననే గర్వం పనికిరాదు. 'నేను ధనవంతుణ్ణి' అని నువ్వు భావిస్తే నీకంటే ధనవంతుడు ఇంకొకడు ఉన్నాడు, అతడికంటే గొప్ప ధనవంతుడు మరొకడు ఉన్నాడు. చీకటి పడగానే మిణుగురు పురుగు బయటకు వస్తుంది. ఈ ప్రపంచానికే తాను వెలుగునిస్తున్నానని భావిస్తుంది. అయితే, కాసేపట్లో నక్షత్రాలు ఉదయించగానే ఆ మిణుగురు పురుగు అహంకారం అణగిపోతుంది. అప్పుడు తామే ఈ ప్రపంచానికి వెలుగునిస్తున్నామని నక్షత్రాలు భావిస్తాయి. కొంతసేపటికి చంద్రుడు ఉదయిస్తాడు. అప్పుడు నక్షత్రాలు లజ్జతో కుంచించుకుపోతాయి. తరువాత చంద్రుడు, 'నా వెలుగువల్ల ఈ ప్రపంచమే ప్రకాశిస్తోంది. నేనే ఈ ప్రపంచానికి వెలుగును ప్రసాదించేవాడను' అని తలపోస్తాడు. ఇలా తలపోస్తూ ఉన్నప్పుడే అరుణోదయం అవుతుంది, సూర్యుడు ఉదయిస్తాడు. అంతే, చంద్రుడు వెలవెలబోతాడు. కాసేపటికి చంద్రుణ్ణి చూడను కూడా చూడలేము. సంపన్నులు వీటన్నిటినీ కాస్త యోచించి చూస్తే, తమకు ధనం ఉందన్న అహంకారం కలుగదు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@rkmath.org

సంపాదకులు
స్వామి సీతేశానంద

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం : 83 సంచిక : 8
ఆగష్టు 2026

సూక్తి సౌరభం

**పట్టి విడువరాదు పదిలక్షలకునైన
పెట్టి చెప్పరాదు పేదకైన
వెట్టి గొలువరాదు విభుడెట్టి ఘనుడైన
విశ్వదాభిరామ వినురవేమ!**

“ఓ వేమా! చేపట్టిన సత్కార్యాన్ని పదిలక్షలు వస్తాయన్నా విడిచిపెట్టకూడదు. పేదవానికైనా సాయంచేసి, ‘నీకు ఫలానా చేశాన’ని చెప్పకూడదు. యజమాని ఎంత గొప్పవాడైనా వెట్టిచాకిరీ చేయకూడదు.”

•

**దర్శనే స్పర్శనేవాపి
శ్రవణే భాషణేఽపి వా।
యదిద్రవ్యత్యంతరంగః
స స్నేహ ఇతి కథ్యతే॥**

“చూడటం వల్ల, తాకటం వల్ల, వినటం వల్ల, మాట్లాడుకోవటం వల్ల, ఏ కారణంగానైతే మనస్సు ద్రవిస్తుందో దాన్నే స్నేహం అంటారు.”



**విశుద్ధవిజ్ఞానఘనస్వరూపం
విజ్ఞానవిశ్రాణనబద్ధదీక్షమ్।
దయానిధిం దేహభృతాం శరణ్యం
దేవం హయగ్రీవమహం ప్రపద్యే॥**

మూర్తీభవించిన విశుద్ధ విజ్ఞాన స్వరూపుడూ, సర్వులకూ ఆ విజ్ఞానాన్ని ప్రసాదించడమే దీక్షగా కలవాడూ, కరుణాసముద్రుడూ, దేహాన్ని ధరించిన వారందరికీ (సమస్త జీవులకు) పరమాశ్రయుడూ అయిన శ్రీ హయగ్రీవుణ్ణి నేను శరణువేడుతున్నాను.

(వేదాంతదేశికకృత శ్రీ హయగ్రీవస్తోత్రమ్ నుండి)

ఆగష్టు 28న ‘హయగ్రీవ జయంతి’

శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది.
నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు
'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధనదానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం.

రూ.2,500/-, ఆపైన విరాళాలిచ్చిన దాతల పేర్లు పత్రికలో ప్రచురించబడును.

(రూ.5,000/-, ఆపైన విరాళాలు మాత్రమే శాశ్వతనిధిగా పరిగణింపబడును.)

'శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వతనిధి' విరాళాలను
ఆన్‌లైన్‌లో https://rkmath.org/donate ద్వారా చెల్లించవచ్చు.

	దాత పేరు ఊరు	రూ.
మహారాజ పోషకులు	శ్రీ ఎమ్. సర్వా రెడ్డి, బసవాపురం గ్రామం, ఉంచాల పోస్ట్, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్	1,01,116
మహారాజ పోషకులు	ఒక పాఠకురాలు, కాకినాడ (తండ్రిగారి జ్ఞాపకార్థం)	50,000
మహారాజ పోషకులు	శ్రీమతి కనకదుర్గమ్మ, తెనాలి, గుంటూరు జిల్లా	25,000
మహారాజ పోషకులు	శ్రీమతి అల్లంశెట్టి భారత లక్ష్మి, కాకతీయ నగర్, నాచల్ నగర్, హైదరాబాద్	10,116
మహారాజ పోషకులు	శ్రీ ఎస్. సత్యనారాయణ, బి.సి.కాలనీ, నాగులవరం గ్రామం, అర్ధవీడు(మం), ప్రకాశం జిల్లా	10,000
మహారాజ పోషకులు	శ్రీమతి కె. లక్ష్మీప్రసన్న, వసంత్ నగర్, హైదరాబాద్	10,000
మహారాజ పోషకులు	శ్రీమతి ఎమ్.పి.ఎస్. మాధవి, ప్రగతీ నగర్, హైదరాబాద్ (పుట్టినరోజు సందర్భంగా)	10,000
మహారాజ పోషకులు	శ్రీమతి కన్నెదారి పద్మజ, శేరిలింగంపల్లి, నల్లగండ్ల, హైదరాబాద్ (భర్త శ్రీ యలమంచిలి అజయ్ గారి పుట్టినరోజు సందర్భంగా)	10,000
మహారాజ పోషకులు	శ్రీ జమ్మలమడక దివాకర్, రోజర్స్ సర్కిల్, డులూత్, అమెరికా	10,000
రాజ పోషకులు	శ్రీ గాజుల గోపాల్, డోన్, నంద్యాల జిల్లా (తల్లితండ్రులు కీ॥శే॥ గోవిందమ్మ & సుంకయ్య గార్ల జ్ఞాపకార్థం)	5,116
రాజ పోషకులు	ఒక పాఠకురాలు, గుంతకల్, అనంతపురం జిల్లా	5,000
పోషకులు	శ్రీ కె. భీమా గౌడ్, బరాఫ్ బాగ్ కాలనీ, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్ (తండ్రి కీ॥శే॥ అల్లాదుర్గం వెంకా గౌడ్ గారి జ్ఞాపకార్థం)	2,501
పోషకులు	శ్రీ సోలిపురం విజయసేనారెడ్డి, ఎస్.ఆర్. నగర్, హైదరాబాద్	2,500
పోషకులు	శ్రీ అలుగుబెల్లి కిశోర్ రెడ్డి, జువ్విగూడెం, నార్కెట్‌పల్లి, నల్గొండ జిల్లా	2,500

పత్రిక ఆర్థిక స్థిరత్వం కోసం ఐదు కోట్ల రూపాయల శాశ్వతనిధిని ఏర్పాటు చేయాల్సివుంది. ఉదారహృదయులైన భక్తులు, మిత్రులు, పాఠకులు, శ్రేయోభిలాషుల నుండి విరాళాలను కోరుతున్నాం. మా విన్నపానికి స్పందించి ఇప్పటివరకు రూ. 1,34,82,898/- లను విరాళంగా ఇచ్చారు. దాతలందరికీ మా కృతజ్ఞతలు.

శాశ్వత నిధికి ఇచ్చే విరాళాలకు సెక్షన్ 80జి కింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

పండుగలు - పర్వదినాలు

ఆగష్టు - 2026

09 ఆదివారం : ఏకాదశి
10 సోమవారం : స్వామి రామకృష్ణానంద జయంతి
23 ఆదివారం : ఏకాదశి
28 శుక్రవారం : స్వామి నిరంజనానంద జయంతి

సెప్టెంబర్ - 2026

04 శుక్రవారం : శ్రీకృష్ణ జన్మాష్టమి
07 సోమవారం : ఏకాదశి
10 గురువారం : స్వామి అద్వైతానంద జయంతి
14 సోమవారం : వినాయక చవితి
22 మంగళవారం: ఏకాదశి

లోపలి పేజీల్లో...

06 సంపాదకీయం
వివేకానందుడే మన మిత్రుడైతే...

08 ఆత్మసమర్పణకు నిలువుటద్దం!

09 వరలక్ష్మీవ్రత అంతరార్థం!

10 పలికెడిది భాగవతం
విష్ణువు యదుకులమున ఏ లీల మెలగె?

12 శాశ్వతత్వానికి సింహద్వారం

14 అన్నమయ్య పదామృతం
పంచేంద్రియములనే పట్టణ స్వాములాల...

16 అద్భుత వాక్కులు

18 భాగవత ఆణిముత్యాలు
నిజమైన స్వాతంత్ర్యం

20 చరిత్ర విస్మరించిన వీరవనిత
'వీరమంగై' వేలు నాచియార్

21 ధీరవాణి
మానవజాతి శ్రేయస్సుకై పాటుపడండి!

22 మన ఇచ్ఛాశక్తికి స్వేచ్ఛ ఉందా?

25 లోకరీతి... విదురనీతి!
వారిని గౌరవించినప్పుడే...

26 చేతులు కట్టుకు కూర్చునేకంటే...

28 మనం దేశభక్తులమేనా?

30 మన ఆలోచన మారాలి!

34 శ్రీరామకృష్ణుల క్షేత్ర దివ్యత్వ గ్రహణశక్తి

36 నవభారత నిర్మాణం - ఆధ్యాత్మిక స్ఫూర్తి

38 బొమ్మల కథ
ప్రాణస్నేహితులు

42 నేటి బేతాళ ప్రశ్నలు
బ్రహ్మదేవుడికి అయిదు ముఖాలా?

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

పత్రికచందాను ఆన్‌లైన్‌లో
www.sriramakrishnaprabha.org ద్వారా చెల్లించవచ్చు.

QR code

చందా వివరాలు	భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	: రూ. 20	-
సంవత్సర చందా	: రూ. 220	రూ. 3,000
మూడు సంవత్సరాలకు	: రూ. 640	-
ఐదు సంవత్సరాలకు	: రూ. 1,000	-
పది సంవత్సరాలకు	: రూ. 2,000	-
ఇరవై సంవత్సరాలకు	: రూ. 4,000	-

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, చెక్కుల్లో
Ramakrishna Math, Hyderabad అనీ;
మనియార్డర్లలో **Sri Ramakrishna Prabha,**
Ramakrishna Math, Hyderabad అనీ రాయాలి.

పంపవలసిన చిరునామా :
Sri Ramakrishna Prabha,
Ramakrishna Math, Domalguda,
Hyderabad - 500029. Cell: 8801849494
E-mail : sriramakrishnaprabha@rkmath.org

శ్రీరామకృష్ణ ప్రభ - డిజిటల్ ప్రతి కూడా లభిస్తుంది. కావలసినవారు చందాను ఆన్‌లైన్‌లో www.sriramakrishnaprabha.org ద్వారా చెల్లించవచ్చు.
డిజిటల్ ప్రతి - సంవత్సర చందా రూ. 150/-

వివేకానందుడే మన మిత్రుడైతే...



మనిషి సంఘజీవి. నిరంతరం పురోగతికై ప్రయత్నిస్తుంటాడు. కుటుంబ సభ్యులతో లేదా బయటి వ్యక్తులతో సామరస్యంగా, స్నేహపూర్వకంగా ఉన్నప్పుడే ఇది సాధ్యం. అలా మనిషి తాను ఎంచుకున్న సాంగత్య ప్రభావంతోనే జీవితంలో అన్నివిధాలా ఎదుగుతాడు. కష్టకాలంలో అదే సాంగత్యం అతనికి ఓదార్పును, ధైర్యాన్ని ఇస్తుంది. చాలా సందర్భాలలో కుటుంబంలోని వ్యక్తులతో కంటే స్నేహితులతోనే ఎక్కువ సాన్నిహిత్యం ఉంటుంది. అది ఎంతో అవసరం కూడా! అయితే, అత్యంత వేగంగా పరుగులు తీస్తున్న నేటి ఆధునిక యుగంలో బాంధవ్యాలు అలసిపోతున్నాయి. సాంగత్యాలు కరవవుతున్నాయి. కష్టాలను పంచుకొనేవారో, కనీసం వినేవారో కనపడటంలేదు. ఈ ఆధునిక యుగపు కుదుపులను తట్టుకోలేక, నేడు స్నేహబంధాలు కూడా అల్పాయుష్షువి అయిపోతున్నాయి. నిజమైన స్నేహితుడు దొరకడం కూడా గగనమవుతుంది. కానీ, జీవితంలో స్నేహితుడి స్థానం స్నేహితుడిదే!

ఎవరు నిజమైన స్నేహితుడు?

స్నేహానికి భాష, ప్రాంత, వయో భేదాలు లేవు. '*A friend in need is a friend indeed*' అని సామెత. అంటే, ఆపదలో ఆదుకునేవాడే నిజమైన స్నేహితుడు. మన పూర్వీకులు స్నేహం మరియు స్నేహితుని లక్షణాల గురించి చక్కగా వివరించారు. సంతానం లేని గృహం ఎలా ఉంటుందో, మిత్రుడు లేనివాడి జీవితం కూడా అలానే ఉంటుందని స్నేహం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. 'ఉత్సవే వ్యసనే చైవ దుర్భిక్షే రాష్ట్రవిప్లవే, రాజద్వారే శ్మశానే చ యస్తిష్ఠతి స బాంధవః – ఆనందంలో, దుఃఖంలో, కరవులో, దేశంలో సంభవించే విపత్తులో, రాజద్వారంలో, శ్మశానంలో తోడుగా నిలచేవాడే నిజమైన బంధువు', 'చెడు పనులకు పోకుండా నివారించడం, మంచి పనులకు ప్రోత్సహించడం, దాచవలసిన దాన్ని దాచడం, సద్గుణాలను వెల్లడించడం, ఆపత్కాలంలో విడిచిపెట్టకుండటం, అవసర సమయంలో చేయూతనివ్వడం మంచి మిత్రుడి లక్షణాలు' అని స్నేహితుడు ఎలా ఉండాలో తెలిపారు. ఒక విధంగా చెప్పాలంటే, ప్రతిఫలం ఆశించకుండా ప్రేమించేవాడు, సాయం చేసేవాడే నిజమైన స్నేహితుడు. అలాంటి స్నేహితులు లభించడం అరుదు. లభిస్తే మాత్రం జీవితం ధన్యం! అలాంటి స్నేహంతో ముక్తి కూడా పొందవచ్చంటారు స్వామి వివేకానంద.

ఇలాంటి స్నేహితుడు లభిస్తే...

ఒకానొక బాలుడు తన మిత్రులకు చిన్న కష్టం వచ్చినా, దానిని పరిష్కరించడం తన ప్రథమ కర్తవ్యంగా భావించేవాడు. అతడొకసారి మిత్రులతో కలసి ఒక కోటను సందర్శించడానికి వెళ్ళాడు. వారిలో ఒకడు ఒళ్ళునొప్పులు, జ్వరంతో బాధపడుతూ కదలలేక కూర్చున్నాడు. తక్కినవారు ఎగతాళిగా నవ్వుతూ, అతణ్ణి విడిచిపెట్టి ముందుకు వెళ్ళిపోయారు. కానీ, అతని మిత్రుడైన ఈ బాలుడు మాత్రం శుశ్రూషలు చేసి, బండి మాట్లాడి ఇంటి వద్ద దిగబెట్టాడు.

మరోసారి ఆ బాలుడు మిత్రులతో కలసి జంతు ప్రదర్శనశాలకు వెళ్ళాడు. తిరిగి వస్తున్నప్పుడు వారు ఎక్కిన పడవలో మిత్రుడొకడు వాంతి చేసుకున్నాడు. పడవవారు శుభ్రం చేయమన్నారు. ఆ పిల్లలు రెట్టింపు డబ్బు ఇస్తామన్నా పడవవారు ససేమిరా అన్నారు. అప్పుడు ఆ బాలుడు నెమ్మదిగా తప్పించుకొని, కాస్త దూరంలో ఉన్న పోలీసులను పిలుచుకువచ్చాడు. పోలీసులను చూడగానే పడవవారు పిల్లల్ని విడిచిపెట్టారు. పిల్లలంతా ఆ బాలమిత్రుణ్ణి అభినందించారు.

ఇంకో సందర్భంలో ఆ బాలుడు తన మిత్రుడితో కలసి తిరునాళ్ళకు వెళ్ళాడు. అక్కడి జనసందోహంలో మిత్రుడు తప్పిపోయాడు. అది గమనించిన ఆ బాలుడు వెనక్కి తిరిగి

చూసేసరికి, వాయువేగంతో వస్తున్న గుర్రపుబండి కనిపించింది. మిత్రుడు మరికొన్ని క్షణాలలో ఆ బండి కింద పడి నలిగిపోబోతున్నాడు. ఇక ఆ బాలుడు క్షణం కూడా ఆలస్యం చేయలేదు. తాను కొనుక్కున్న బొమ్మను చంకలోపెట్టుకొని, పరుగున వెళ్ళి అతణ్ణి పట్టుకొనిలాగి పక్కకు దొర్లాడు. అలా ఆ మిత్రుడి ప్రాణాలు కాపాడాడు.

ఆ బాలుడిప్పుడు యువకుడు. అతను చదివే కళాశాల పేద విద్యార్థులకు పరీక్ష రుసుము, బోధనా రుసుములను మినహాయించేది. ఆ యువకుడి మిత్రుడైన హరిదాస్ చాలా పేదవాడు. కళాశాల నిర్వహణాధికారితో మాట్లాడి రుసుములు మినహాయించే ఏర్పాటు చేస్తానని ఆ యువకుడు హరిదాస్ కు మాట ఇచ్చాడు. అయితే, ఆ అధికారిని అభ్యర్థించగా అతడు ఫీజు మినహాయింపుకు ఒప్పుకోలేదు. పైగా, 'నీ సిఫారసులు నాకు అక్కరలేదు. నువ్వు నీ పని చూసుకో. ఫీజు చెల్లించకుండా హరిదాస్ పరీక్షలు వ్రాయలేడు, అంతే!' అని నిష్కర్షగా చెప్పేశాడు. ఈ విషయం తెలిసి హరిదాస్ కుమిలిపోయాడు. అప్పుడు ఆ యువకుడు మిత్రుణ్ణి ఓదారుస్తూ, 'బాధపడకు మిత్రమా! ఎలాగైనా సరే, ఇందుకు నేనొక మార్గం కనిపెడతాను, ధైర్యంగా ఉండు' అని భరోసా ఇచ్చాడు.

ఆరోజు కళాశాల విడిచిపెట్టగానే ఆ యువకుడు ఇంటికి వెళ్ళకుండా ఊరికి కాస్త దూరంలో గల నిర్జన ప్రదేశానికి వెళ్ళాడు. మత్తుపదార్థాలు లభించే చోటు అది. చీకటిపడ్డాక ఆ అధికారికి అక్కడికి వెళ్ళడం అలవాటు. ఆరోజు హఠాత్తుగా ఆ యువకుడు అక్కడ ఆ అధికారి ముందు ప్రత్యక్షమయ్యాడు. హడలిపోయిన అతడు, తన ఈ దురలవాటు గురించి ఎవరితోనూ చెప్పవద్దని ఆ యువకుడిని ప్రాధేయపడ్డాడు. అదే అదనుగా ఆ యువకుడు తన మిత్రుడైన హరిదాస్ ఫీజును మినహాయించమని అడిగాడు. ఆ అధికారి మనస్సాక్షిని మేల్కొలిపి, న్యాయమైన తన అభ్యర్థనను అంగీకరింపజేశాడు. మర్నాడు ఉదయమే ఆ యువకుడు, హరిదాస్ ఇంటికి వెళ్ళి గతరాత్రి జరిగిందంతా వివరించాడు. ఇక ఆ మిత్రుడి ఆనందానికి అవధుల్లేవు.

ఇలా ఆ యువకుడి జీవితంలో ఎన్నో సంఘటనలు. అతణ్ణి మిత్రునిగా పొందినవారు తమను అదృష్టవంతులుగా భావించుకునేవారు. అతడు మరెవరో కాదు, **స్వామి వివేకానందయే!**

అశరీరవాణియైన మిత్రుడు!

'Show me your friends, and I'll tell you who you are – నీ స్నేహితులెవరో చెప్పు, నువ్వేమిటో చెబుతాను' అని సామెత. ఒకవేళ జీవితంలో అలాంటి మంచి మిత్రులు లభించకపోయినా కలవరపడనక్కరలేదు. స్వామి వివేకానందను మీ ఆత్మీయ మిత్రునిగా స్వీకరించవచ్చు. అందుకు ఆయన సదా సంసిద్ధమై ఉంటారు. ఉన్నతమైనవారితో స్నేహమెప్పుడూ ఉన్నతంగానే ఉంటుంది. నిజంగా ఆయనను స్నేహితుడిగా భావించినవారికి తక్కినవారంతా సన్నిహితులు, స్నేహితులైపోతారు. ఒక స్నేహితుడిలో ఉండవలసిన ప్రేమ, ఔదార్యం, ఎంతకైనా తెగించి సాయంచేసే గుణం స్వామి వివేకానందలో సహజసిద్ధంగానే నెలకొన్నాయి. పైన తెలిపిన సంఘటనల ద్వారా ఇది తెలుస్తోంది.

భౌతికంగా ఉన్నప్పుడే కాదు, నేటికీ ఆయన అశరీరవాణిగా ఎంతోమందికి ధైర్యాన్నిస్తున్నారు, ఓదార్పును ఒసగుతున్నారు, సహాయం చేస్తున్నారు. ఎందుకంటే, 'మరణానంతరం కూడా మీకు బాసటగా ఉంటాను' అన్నారాయన! ఇదెలా సాధ్యం? శక్తిపుంజాల్లాంటి ఆయన వచనాలను పదే పదే మననం చేసుకోవడంతోనే ఆయన మన మనస్సులలోకి ప్రవేశిస్తారు. జీవితంలోని అంతులేని కష్టాలలో, కడగండ్లలో దిక్కుతోచని మనకు మార్గం చూపుతారు. ఆయన మన దౌర్బల్యాలను లెక్కచేయక, మనల్ని మనలాగే స్వీకరించి ప్రేమించే స్నేహితుడు.

మన లోటుపాట్లను, తప్పొప్పులను ఎత్తిచూపి, మనల్ని చిన్నబుచ్చే వ్యక్తికాదాయన. మన దివ్యత్వాన్ని ఎరుకపరచి మనపై మనకు గౌరవం కలిగేటట్లు చేసే వ్యక్తి ఆయన. మన ప్రతి అడుగులోనూ మన వెంట నడిచే ఆప్తమిత్రుడు స్వామి వివేకానంద.

అంతేకాదు, అంతులేని దుఃఖ పరంపరలతో కూడిన ఈ సంసారాన్ని తరింపజేయగల శక్తిసంపన్నులాయన. సాధారణ స్నేహితులు మన కష్టాలను పంచుకోవచ్చు. కానీ మహాత్ములు మన జీవితాన్నే పరివర్తనం చేయగలరు. కాబట్టి, దేశ ప్రాంత లింగ వయో భేదాలకు అతీతంగా ఎవరైనా ఆయనతో స్నేహం చేయవచ్చు. ఆ స్నేహానికి పరిచయం అవసరం లేదు. హృదయం చాలు. విశ్వాసం చాలు. అలాంటి మిత్రుణ్ణి పొందినవాడు ఎన్నటికీ ఒంటరి కాడు. ❖

ఆత్మసమర్పణకు నిలువుటద్దం!

స్వామి వివేకానంద తన సోదర సన్న్యాసి అయినప్పటికీ, ఆయన పట్ల స్వామి రామకృష్ణానందకు అమిత ప్రేమ, అచంచలభక్తి! స్వామీజీ ఆజ్ఞననుసరించి స్వామి రామకృష్ణానంద మద్రాసులో రామకృష్ణ మఠాన్ని నెలకొల్పారు. అక్కడ ఆధ్యాత్మిక ఉపన్యాసాలిస్తూ ప్రజలను ఉత్తేజపరిచేవారు. ఒక మండు వేసవిరోజు తన తరగతుల నిర్వహణ ముగించుకొని మఠానికి తిరిగివచ్చారు. తీవ్రమైన శారీరకశ్రమను, ఆపై వేసవి తాపాన్ని తట్టుకోలేక రెండు పిడికిళ్ళూ బిగించి, ఎవరిమీదో కలబడుతున్నట్లు అగుపించారు. అప్పుడిలా మాట్లాడసాగారు : 'నీ గురించే నేను ఇన్ని కష్టాలుపడుతున్నాను. ఎంత బాధను అనుభవిస్తున్నానో నీకు తెలుసా?' ఆ మరుక్షణమే నేలపై సాష్టాంగపడి, తన ముఖాన్ని నేలకేసి రుద్దుకుంటూ, 'లేదు సోదరా! లేదు. నన్ను క్షమించు. నన్ను మన్నించు. నువ్వు చేసిందంతా సరిగ్గానే ఉంది. అదంతా మంచిదే!' అంటూ కన్నీళ్ళు కార్చారు. కాసేపటికి ఆయన ముఖం ఒక విధమైన దివ్యానందంతో వెల్లివిరిసింది. ఈ ఆత్మీయ కలహమంతా ఆయనను మద్రాసుకు పంపించిన స్వామి వివేకానందతోనే!

మరోసారి స్వామి రామకృష్ణానంద తన ఉపన్యాస పర్యటన ముగించుకొని మఠానికి తిరిగివచ్చి, స్వామి వివేకానంద చిత్రపటం ముందు తల వంచి ఈవిధంగా ప్రార్థించారు : 'నా ప్రియ సోదరా! నిజానికి నువ్వు శ్రీరామకృష్ణుల అధికార ప్రతినిధివి. గురుదేవుల దివ్యసందేశాన్ని ఈ ప్రాంతంలో ప్రచారం చేయడానికి నువ్వే నన్ను ఇక్కడకు పంపావు. నేను నీ ఆజ్ఞలనే పాటిస్తున్నాను. నాలో ఏవిధమైన గర్వమూ, అహంకారమూ తలెత్తకుండా; పేరుప్రఖ్యాతుల పట్ల నా మనస్సు వ్యామోహం చెందకుండా చూడమని నిన్ను వేడుకుంటున్నాను. నువ్వు నా మీద మోపిన బాధ్యతలన్నీ నిజానికి నీవే! నేను గురుదేవుల చేతిలో పనిముట్టుగా ఉంటూ, ఆయన కార్యాన్ని సక్రమంగా నిర్వర్తించేటట్లు నన్ను ఆశీర్వదించు. ఫలితాలన్నింటినీ గురుదేవులకే సమర్పించేటట్లు నన్ను అనుగ్రహించు. నన్ను ఎల్లప్పుడూ సక్రమమైన మార్గంలో నువ్వే నడిపించాలి.' పరిపూర్ణ ఆత్మసమర్పణకు, స్వామీజీ నిర్దేశించిన కార్యంపట్ల గల అంకితభావానికి స్వామి రామకృష్ణానంద ఒక అత్యద్భుత ఉదాహరణ! ❖

(ఆగష్టు 10న శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు
స్వామి రామకృష్ణానంద మహరాజ్ జయంతి)

సత్యమే శ్వాసగా.. సేవయే ఉపాసనగా...

శ్రీరామకృష్ణులు స్వామి నిరంజనానందను ఎంతో ఆప్యాయంగా 'నా నిరంజనుడిలో లేశమాత్రమైనా మలినం లేద'ని శ్లాఘించేవారు. స్వామి నిరంజనానంద ఉపన్యాసాలు ఇవ్వకపోయినా, ఆయన వినిర్మల జీవితమే భావి సన్న్యాసులకు నిలువెత్తు ఆదర్శం.

సత్యం అంటే ఆయనకు ప్రాణం. ఆయన గొప్ప సత్యసంధుడు. ఇతరులను కూడా సత్యాన్ని బలంగా అంటిపెట్టుకొని జీవించమని ప్రోత్సహించేవారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోనివారిని ఆయన ఏమాత్రం లెక్కచేసేవారు కాదు. ఆయన గొప్ప ధైర్యశాలి. ఎవ్వరికీ భయపడేవారు కాదు. భయమెరుగని ధైర్యశాలురను ఎంతగానో మెచ్చుకునేవారు. అంతేగాక, స్వామి నిరంజనానంద చాలా ఉదారహృదయులు. సాయం కోరినవారి అవసరాల పట్ల, ఏవిధమైన సంశయమూ లేకుండా శ్రద్ధ వహించేవారు. ఆయన ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, కసరత్తు చేసేవారు. తమ శరీరాలను దృఢంగా, చురుకుగా ఉంచుకోమని యువకులను ప్రోత్సహించేవారు. స్వామి వివేకానంద ప్రతిపాదించిన సేవాధర్మం పట్ల స్వామి నిరంజనానందకు ఎనలేని విశ్వాసం. మానవులను సాక్షాత్తూ మాధవుని ప్రతిరూపాలుగా భావించి, వారిని సేవించాలని బోధించేవారు. సన్న్యాసం స్వీకరించమని ఆయన యువకులను ప్రోత్సహించేవారు. అయితే, ఆ మార్గం అత్యంత కఠినమైనదని కూడా వారిని హెచ్చరించేవారు.

అనంతమైన ఆ పరమాత్మయే శ్రీరామకృష్ణులుగా మానవరూపంలో అవతరించారనీ, శ్రీరామకృష్ణులను శరణుజొచ్చిన వారెవరైనా సరే తమ జీవితంలో దేన్ని గురించీ దిగులు చెందాల్సిన పనిలేదనీ ఆయన ప్రగాఢ విశ్వాసం. అదేవిధంగా శారదాదేవి పట్ల కూడా ఆయనకు గౌరవాభిమానాలు మెండు. అమ్మ అనుగ్రహం ఉంటే తాను ఏ కార్యాన్నైనా సునాయాసంగా నెరవేర్చగలనని దృఢంగా నమ్మేవారు. స్వామి నిరంజనానంద ఇలా అనేవారు : 'శ్రీరామకృష్ణులను త్రికరణశుద్ధిగా సేవించాలి. ఆయన సజీవంగా, చైతన్యవంతంగా ఉన్నారు. ఆయన మనకు అత్యంత ఆప్తులని భావించి సేవించండి. ఇదే అత్యున్నతమైన ఉపాసన!' ❖

(ఆగష్టు 28న శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు
స్వామి నిరంజనానంద మహరాజ్ జయంతి)

వరలక్ష్మీవ్రత అంతరార్థం!

– డాక్టర్ ఎస్. అనంతలక్ష్మి

శ్రావణమాసం దేవతలందరికీ ప్రీతిపాత్రమైనది. శ్రావణ సోమవారాలు శివునికి, మంగళవారాలు గౌరీదేవికి, శుక్రవారాలు లక్ష్మీదేవికి, శనివారాలు వేంకటేశ్వరునికి ప్రత్యేకపూజలు చేస్తారు. శుక్రవారం చేసే పూజలను అందుకొనే లక్ష్మి వరలక్ష్మి. ఆమె అనుగ్రహం పొందడానికి చేసే వ్రతమే వరలక్ష్మీవ్రతం! వ్రతం అంటే నియమబద్ధమైన ప్రవర్తన లేక నడవడిక. వరలక్ష్మీవ్రతం అంటే పరమమైన లక్ష్మిని పొందడానికి తమ ప్రవర్తనను తీర్చిదిద్దుకోవటం అన్నమాట! ఆ ప్రవర్తన ఏవిధంగా ఉండాలన్నది వ్రతకథ తెలియజేస్తుంది. చేసే పూజపైన విశ్వాసం మరింతగా దృఢపడటానికి వ్రతకథలు సహకరిస్తాయి.

వరలక్ష్మీవ్రతాన్ని శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారంనాడు చేయమని వరలక్ష్మీదేవియే ఆదేశించింది. ఒకవేళ ఎవరికైనా ఆరోజు ఏ కారణంగానైనా వీలుకాకపోతే, పూర్ణిమనాడు కానీ, తరువాతి శుక్రవారంనాడు కానీ, ఆ నెలలోని ఏ శుక్రవారంనాడైనా సరే చేసుకోవచ్చు.



ఈ వ్రత విశిష్టత అంతా కథలోనే ఉంది. మగధ దేశంలోని కుండినం అనే నగరంలో చారుమతి అనే బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె ఉన్నదానితో తృప్తి చెందుతూ, అత్త మామలను భక్తిశ్రద్ధలతో సేవిస్తూ, భర్తను దైవంగా భావిస్తూ, మితభాషియై ఉండేది. ఆమె సత్ప్రవర్తనకు మెచ్చి, వరలక్ష్మీదేవి కలలో కనిపించి, 'నేను వరలక్ష్మీదేవిని, నిన్ను అనుగ్రహించదలచాను. శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నన్ను పూజిస్తే సకల సౌభాగ్యాలనూ ప్రసాదిస్తాను' అని చెప్పింది.

వరలక్ష్మీదేవి తనకు కలలో సెలవిచ్చిన విధంగా శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చిన శుక్రవారం అన్ని ఏర్పాట్లు చేసి, నగరంలో ఉన్న అన్ని వర్ణాల స్త్రీలను తన ఇంటికి ఆహ్వానించి భక్తిపూర్వకంగా పూజ చేసింది. పూజానంతరం మొదటి ప్రదక్షిణకు ఆ స్త్రీలందరి పాదాలకు అందెలు వచ్చాయి. రెండవ ప్రదక్షిణకు సర్వాభరణాలు కలిగాయి. మూడవ ప్రదక్షిణకు వారి భర్తలు వారిని తీసుకొని వెళ్ళడానికి వాహనాలు తీసుకొని వచ్చారు. వారు చారుమతినీ, వరలక్ష్మీదేవినీ వేనోళ్ళ కీర్తించారు. ప్రతి సంవత్సరం వరలక్ష్మీవ్రతం జరుపుకుంటూ సకల సంపదలతో తులతూగారు. ఇదీ వ్రతకథ. కానీ దీని అంతరార్థం మాత్రం చాలా గొప్పది.

వరలక్ష్మీదేవి అనుగ్రహించిన స్త్రీ పేరు చారుమతి. అంటే, మంచిబుద్ధిగలది అని అర్థం. మితభాషి. మితభాషణం ఎవరికైనా అలంకారమే! గయ్యాళితనం ఎవరికీ శ్రేయస్కరం కాదు. మంచిబుద్ధి కలది కనుకనే అత్తమామలను, భర్తను భక్తిశ్రద్ధలతో సేవించుకున్నది. ఈమె అసలైన సద్బుద్ధి కనపడేది అందరినీ తనతో పాటు వ్రతం చేసుకోవడానికి పిలవడంలోనే! వరలక్ష్మి పూజ చేయమన్నది చారుమతిని ఒక్కదానినే! కానీ, ఇంకెవరికీ చెప్పవద్దనలేదు. కనుక తనకు కలగబోయే మేలు అందరికీ కలగాలని ఆశపడింది 'చారుమతి'. పైగా, ఇటువంటి వ్రతాలకు వర్ణభేదం లేదు. అమ్మను పూజించడానికి అందరూ అర్హులే! ఇది గుర్తించింది కనుక ఆమె 'చారుమతి'. సామూహికంగా చేసే వ్రతాలు ఎక్కువ ఫలితాన్నిస్తాయనే సామాజికస్పృహ కలిగిన ఆదర్శ మహిళామణి చారుమతి.

ఈ సద్గుణాలలో కొన్నింటినైనా అలవరచుకుంటే వ్రతం చేసిన ఫలితం పూర్తిగా దక్కుతుంది. ఇది అలవాటు చేయడానికే పూజ పూర్తయ్యాక వాయనం ఇచ్చేటప్పుడు మంత్రాలను తెలుగులోనే చెప్పిస్తారు – 'ఇస్తినమ్మ వాయనం', 'పుచ్చుకొంటినమ్మ వాయనం' అంటూ! 'నా వాయనం పుచ్చుకున్న వారెవరు?' అని అడిగితే 'నేనే, వరలక్ష్మీదేవిని' అని సమాధానం. ఈ కార్యక్రమం వల్ల సాటి మహిళను తన ఆరాధ్యదైవంగా చూడటం అభ్యాసమవుతుంది. పరస్పరం సుహృద్భావంతో ఉంటారు.

వ్రతం చేసినవారికి వచ్చిన ఫలితం ఆభరణాలు, సకల భోగభాగ్యాలు లభించడం మాత్రమేనా? అసలైనది, ఏ స్త్రీ అయినా కోరుకొనేది తన భర్త ప్రేమాభిమానాలు. వారికి అవి లభించాయి. వరలక్ష్మీదేవిని నిష్ఠగా పూజిస్తే, ఆమె అనుగ్రహం వల్ల వచ్చే ఫలమిది. ఆమె అనుగ్రహం పొందాలంటే అందరూ 'చారుమతులు'గా మారాలి. అత్తమామలను నిరాదరిస్తూ, వారిని ఏ వృద్ధాశ్రమంలోనో పెట్టి, గయ్యాళితనంతో అందరితో పోట్లాడుతూ, ఎంత ఉన్నా సంతృప్తి లేకపోతే ఎన్ని పూజలు చేస్తే మాత్రం ఏం లాభం?

ఒక్క వ్రతంలో వ్యక్తిగత, కుటుంబ, సామాజిక ప్రయోజనాలను ఎలా ఇమిడ్చారో కదా మన మహర్షులు! ❖ **(ఆగస్టు 21న 'వరలక్ష్మీవ్రతం')**

నీ శక్తిమేరకు భగవత్ ప్రార్థనలో గడుపు. పారమార్థిక సాధనలలోని మహత్వం ఏమిటో తెలుసా? భోగాసక్తిని కలిగించే ఇంద్రియాల శక్తిని అవి అణచివేస్తాయి. - దివ్యజనని శ్రీ శారదాదేవి

విష్ణువు యదుకులమున ఏ లీల మెలగె?

– స్వామి జ్ఞానదానంద

మునిశ్రేష్ఠుడైన శుకమహర్షి భక్తిపారవశ్యంలో పాండవుల మనుమడైన పరీక్షిత్తు మహారాజుకు భాగవత పురాణాన్ని వినిపిస్తూ ఉన్నాడు. ఆ పరంపరలో పూర్ణపురుషుడైన శ్రీకృష్ణపరమాత్ముడి మధుర కథాగానం చేస్తూ మరింత పారవశ్యానికి లోనయ్యాడు. వ్యాసమహర్షి సంస్కృత భాగవతంలో వర్ణించిన ఆ కథాక్రమాన్ని పోతన్న తెలుగులో పరమరమ్యంగా అనువదించాడు. 'హరికి నందగోకుల విహారికి...' అంటూ కృష్ణప్రీతిని అభివ్యక్తం చేశాడు. ముఖ్యంగా భాగవతాంతర్గతంగా శ్రీకృష్ణలీలల్ని వర్ణించిన దశమస్కంధ ఘట్టాల్లో తన కవిత్వపటిమను పతాకస్థాయికి తీసుకువెళ్ళాడు. భక్తిలో భావుకతను రంగరించి భాగవతులను ఆనందడోలికల్లో ఓలలాడించాడు. అందుకే, శ్రీమద్భాగవతంలోని అన్ని స్కంధాలకు కృష్ణలీలలతో కూడిన ఈ దశమస్కంధం హృదయస్థానమని పౌరాణికులు భావిస్తారు. 'ముఖారవిన్దం దశమం ప్రఫుల్లమ్' అంటే, భగవంతుడి వికసిత ముఖారవిందమే దశమస్కంధమని చెబుతారు. శ్రీకృష్ణ సర్వస్వమైన ఈ స్కంధాన్ని పఠించినా, ఆలకించినా పరమాత్మ దర్శన అనుభూతి కలుగుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

శ్రీకృష్ణుడు త్రిమూర్తులకు అతీతుడైనవాడనీ, పరబ్రహ్మ స్వరూపుడనీ కొందరు ఆధ్యాత్మికవేత్తల ప్రగాఢ భావన. దేవదేవుడు, దేవకీపుత్రుడు అయిన ఆ శ్రీకృష్ణభగవానుడి లీలలు మధురాలు, శ్రవణసుభగాలు, పాపహరాలు. ఆ మహాభాగ్యాన్ని పొందిన తొలి శ్రోత పరీక్షిత్తు తొలుత శుకమహర్షిని...

'శీలము గల యదుకులమున
నేలా పుట్టెను మహాత్ముఁడీశుఁడు విష్ణం?
దే లీల మెలఁగె? నెయ్యే
వేళల నేమేమి సేసె? వివరింపు తగన్.

– మహాత్ముడు, ఈశ్వరుడు అయిన విష్ణువు శీలవంతమైన యదువంశంలో ఎందుకు పుట్టాల్సి వచ్చింది? అలా పుట్టి ఏవిధంగా ప్రవర్తించాడు? ఏయే వేళల్లో ఏమేమి పనులు చేశాడు? ఈ విషయాల్ని చక్కగా వివరించమ'ని వేడుకున్నాడు.

పదవస్కంధం పరమౌషధం...: ఉపనిషత్తులు పరమాత్ముణ్ణి 'రసో వై సః' అంటే రసస్వరూపుడని కీర్తించాయి. అందుకే, ఆ స్వామి బాల్యలీలలతో కూడిన భాగవతంలోని దశమస్కంధం హాస్య, కరుణ, భయానకం తదితర నవరసాల సమాహారం. ఆ భావనతోనే భాగవత పురాణాన్ని 'కృష్ణభక్తి రసస్వరూప శ్రీభాగవత' అని 'శ్రీచైతన్య చరితామృతం' కీర్తించింది. ఈ భక్తిసారస్వతం వేదశాస్త్రం కంటే ఘన మాహాత్మ్యం కలదని కొనియాడింది. బాల్యలీలల్లో హాస్యరసం, చాణూర ముష్టిక కంసాది సంహారాల్లో వీరరసం, రాసలీలల్లో శృంగారరసం... ఇలా అన్ని రసాలూ కలగలిసిన మధురకథ కృష్ణకథ. మానసిక ఉల్లాసానికే కాదు మానవజీవితం తరించటానికి కూడా తోడ్పడే దివ్యగాథ. ఒక్కమాటలో చెప్పాలంటే సంసారమనే వ్యాధికి శ్రీకృష్ణకథాశ్రవణం దివ్యౌషధం. అందుకే పరీక్షిత్తు...

"భవములకు మందు, చిత్త
శ్రవణానందము, ముముక్షుజన పదము, హరి
స్తవము పశుఘ్నుఁడు దక్కను
జెవులకుఁదని వయ్యె ననెడి చెనఁటియుఁ గలఁడే.

– శ్రీహరియైన విష్ణువు స్తోత్రం సంసారబాధలకు ఔషధం. చెవులకూ, మనస్సుకూ ఆనందం కలిగిస్తుంది. మోక్షమర్థించే జనులకు కోరదగిన స్థానం. అటువంటి హరిస్తోత్రం విని 'ఇంక

చాలు!' అనే మూర్ఖుడు ఎవడైనా ఉంటాడా?" అని పులకిత గాత్రుడై ఆనందాన్ని వ్యక్తం చేశాడు. కృష్ణకథ జగత్తును మరిపించటమే కాదు, జగన్నాథుడికి చేరువ చేస్తుంది. సాంసారిక బంధాన్ని తెంచి సర్వేశ్వరునితో సంబంధాన్ని పెంచుతుంది.

తెప్పలా తరింపజేస్తూ...: భగవంతుడు బంధువై అండగా ఉంటే ఏ ఇతర బలగమూ మనకు అవసరం లేదు. పాండవుల విషయంలో అదే నిరూపితమైంది. కృష్ణభగవానుడు సకల బలాలూ తానై వారిని ధర్మయుద్ధంలో గెలిపించుకున్నాడు. 'అయిదుగురు పాండవులు నూరుమంది కౌరవులపై ఎలా గెలిచారు?' అని లోకమంతా ఆశ్చర్యపోయేలా చేశాడు. పరీక్షిత్తు కూడా అలాంటి సంభ్రమాశ్చర్యాలతోనే శుకమునిని...

'మా పెద్దలు మును వేల్పులు
నోపని భీష్మాది కురుకులోత్తమ సేనా
కూపారము నే కోలము
ప్రాపున లంఘించి రొక్క బాలపదముగాన్.

– భీష్మాది కురువీరులతో నిండిన కౌరవసైన్యం దేవతలైనా గెలవలేనిది. అలాంటి కౌరవసేనా సముద్రాన్ని మా పెద్దలైన పాండవులు, పసిపిల్లవాని అడుగును దాటగలిగినంత సులభంగా దాటగలిగారు కదా! ఏ నావ సహాయంతో అలా దాటగలిగారు?' అని ప్రశ్నించాడు. కృష్ణావతారం సామాన్యమైంది కాదు. అన్ని అవతారాల్లోకెల్లా సంపూర్ణమైందీ, సర్వాంగ సుందరమైందీ, పరిపూర్ణమైందీ, దివ్యతేజోవిరాజితమైందీ ఈ కృష్ణావతారమని పండితోత్తముల భావన. శ్రీకృష్ణపరమాత్మ తన అవతార లీలల్లో భాగంగా రెండు బాధ్యతలను చేపట్టాడు. ఒకటి సంహార క్రియ. రెండు బోధాంశ. ఏకకాలంలో రెండు పాత్రల్ని పోషించాడు. 'గీతగోవిందం' కావ్యాన్ని రచించిన భక్తజయదేవుడు మురళీకృష్ణుడి మాహాత్మ్యాన్ని బహుధా స్తుతించాడు.

'వేదానుద్ధరతే జగన్నివహతే భూగోళం ఉద్బిభ్రతే
దైత్యం దారయతే బలిం ఛలయతే క్షత్రక్షయం కుర్వతే।
పౌలస్త్యం జయతే హలం కలయతే కారుణ్యమాతన్వతే
మ్లేచ్ఛాన్ మూర్ఛయతే దశాకృతి కృతే కృష్ణాయ తుభ్యం నమః॥'

అంటూ సంకీర్తించాడు. వేదాలను ఉద్ధరించి, భూమిని మోసి, భూమండలాన్ని పైకెత్తి, హిరణ్యకశిపుణ్ణి సంహరించి, బలిచక్రవర్తిని యుక్తితో జయించి, క్షత్రియులను దునుమాడి, రావణుని తలలు తుంచి, నాగేటిని ధరించి, అహింసను బోధించి, మ్లేచ్ఛులను చంపబోయే దశావతారధారివైన శ్రీకృష్ణా నీకు నమస్కారం' అని ప్రస్తుతించాడు. ఆ దేవకీపుత్రుడిని దశావతారాల్లో ఒకరిగా కాకుండా, ఆ అన్ని అవతారాలనూ ధరించిన దైవశిఖామణి శ్రీకృష్ణుడని శ్లాఘించాడు.

ఆయన అంతర్యామి...: తన జన్మకర్మల తత్త్వాన్ని తెలుసుకున్నవాడు జన్మరాహిత్యాన్ని పొందుతాడని స్వయంగా శ్రీకృష్ణుడే అర్జునుడికి విస్పష్టం చేశాడు. పార్థుడు ఉపాసన ఫలంగా కృష్ణ సాన్నిధ్యమనే వరాన్ని పొందాడు. ఆ వరఫలంగా జ్ఞానేచ్ఛతో స్వయంగా ఆ పరంధాముడి నుంచే ఆ తత్త్వాన్ని తెలుసుకొని తరించాడు. ఆయన మనుమడు పరీక్షిత్తు కూడా ఆ జిజ్ఞాసతోనే శుకమహర్షిని...

'కలసి పురుషమూర్తి కాలరూపములను,
లోకజనుల వెలిని లోన నుండి
జన్మ మృత్యువులను సంసారముక్తుల
నిచ్చు నతని చరితమెల్లఁ జెపుమ!

– పురుషోత్తముడైన విష్ణువు పురుషరూపంలోనూ, కాలరూపంలోనూ లోకంలోని జీవులందరి లోపలా, వెలుపలా కూడా ఉంటాడు. అలా ఉండి జననమరణాలనూ, సంసార బంధాలనూ, మోక్షాన్నీ ప్రసాదిస్తాడు. అటువంటి పురుషోత్తముని చరిత్ర చెప్పాలని మనవి!' అని అర్థించాడు.

సర్వసంగపరిత్యాగులనే కాదు సంసారంలో మగ్నమైనా ఆర్తితో తనను ఆరాధించే సామాన్యులనూ ఆదుకునే ఆపద్బాంధవుడు ఆ ఆలకాపరి. ఆ స్వామిని ఆశ్రయిస్తే సర్వసంశయాలూ తీరిపోతాయి. ఆ భావనతోనే "ఆయనకు అన్నీ సాధ్యమే! నిరాకారుడూ, సాకారుడు కూడా ఆయనే! స్వరాట్, విరాట్‌లు రెండూ ఆయనే! బ్రహ్మమూ ఆయనే! శక్తి కూడా ఆయనే!" అనేవారు భగవాన్ శ్రీరామకృష్ణులు. కృష్ణచరితంపై పరీక్షిత్తు ఆసక్తిని, ఆరాటాన్ని అర్థం చేసుకున్న శుకమహర్షి అతనికి ఆ నందనందనుని పుణ్యగాథను సంపూర్ణంగా వినిపించేందుకు సిద్ధమయ్యాడు. అంతేకాదు, విష్ణుకథాశ్రవణ మహిమను మననం చేసుకుంటూ...

శ్రీకృష్ణుడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు అతీతుడు. పరబ్రహ్మస్వరూపుడు. నవరసాలూ మూర్తీభవించిన పూర్ణపురుషుడు. యదువంశంలో జన్మించి తన దివ్య లీలలతో ఆ పరివారానికి పరమపదాన్ని ప్రసాదించాడు. కృష్ణమయమైన శ్రీమద్భాగవత దశమస్కంధం సాక్షాత్తూ ఆ అవతారమూర్తికి అక్షరరూపం. ఆ పురాణ గాథను పఠించినా, ఆలకించినా మన జన్మలు ధన్యాతిధన్యం.

'విష్ణుకథారతుఁడగు నరు
విష్ణుకథల్ చెప్పు నరుని వినుచుండు నరున్
విష్ణుకథా సంప్రశ్నము
విష్ణుపదీ జలము భంగి విమలులఁ జేయున్.

– విష్ణువు పాదాల నుంచి పుట్టిన గంగాజలంలా విష్ణుకథా ప్రసంగం కూడా విష్ణుకథలపై ఆసక్తి గలవారినీ, ఆ కథలు చెప్పేవారినీ, వినేవారినీ, చెప్పమని అడిగేవారినీ పునీతులను చేస్తుంది' అని ఉద్ఘాటించాడు. ❖

శరీరానికి కష్టం కలుగుతుందనీ, దుఃఖం అనుభవించాల్సి వస్తుందనీ భయపడి
కర్మలను త్యజించేవాడిది రాజస త్యాగం. అట్టివాడు త్యాగఫలాన్ని పొందలేడు. - శ్రీకృష్ణుడు

శాశ్వతత్వానికి సింహద్వారం

ఆకాశపు హద్దులు దాటివున్న సీమలేవైనా ఉన్నాయా? అనే ఉత్సుకత, అన్వేషణ మన నిత్యజీవితంలో తరచూ అనుభవానికి వస్తూ ఉంటాయి. కంటికి కనిపించే ఈ ఆకాశాన్ని దాటి మనం చూడలేం. కానీ, దానికి ఆవల ఇంకా అనంతమైన ఆవరణ ఏదో ఉందని మనకు తెలుసు. అది మనల్ని అమితంగా ఆకర్షిస్తోంది కూడా! మనకు తెలిసిన దానికి, లభించిన దానికి అతీతంగా సాగించే ఈ అన్వేషణే మతానికి కూడా ప్రాతిపదిక. మనం నిత్యజీవితంలో తెలిసిగానీ, తెలియకగానీ ఈ అనంతత్వం, శాశ్వతత్వాలకై ఆరాటపడుతుంటాం.

మన స్వప్నాలు, ఊహలు నిజమైనవి కావు. కానీ, బాహ్యంలో మన కంటికి కనిపిస్తున్న ఈ భౌతిక వస్తుసముదాయమే ఆ స్వప్నాలకు పునాది. మనం ఏమి ఆలోచిస్తున్నామో మనకు స్పష్టంగా తెలిసినప్పటికీ, దానిని ఇతరులకు తెలియజెప్పటానికి చాలాసార్లు భాష కరువవుతుంది. దీనినిబట్టి మనం పరిమిత వ్యక్త ప్రపంచం, అనంత అవ్యక్త ప్రపంచాలకు చెందినవారమని తెలుస్తోంది. ఈ వ్యక్తావ్యక్త ప్రపంచాలు మన అవగాహన అనే కేంద్రంపై ఆధారపడి ఉంటాయి.

గాఢనిద్రలో మనం అవ్యక్త ప్రపంచంలో అడుగుపెడతాం. ఆ సమయంలో మనకు తెలియకుండానే మనదైన అనంతత్వాన్ని తాకుతాం. మనం గ్రాహ్యం చేసుకోలేనంత సహజసిద్ధంగా ఈ అనుభవం కలుగుతుంది. మళ్ళీ మనం కళ్ళు నులుముకుంటూ లేవగానే బాహ్యప్రపంచంతో ఏకమైపోతాం. కానీ, మనం మన యథార్థ స్వరూపాన్ని కోల్పోయామన్న ఎరుకయే ఉండదు. ఈవిధంగా మనలో ప్రతి ఒక్కరం ఈ రెండు విధాలైన చైతన్య స్థాయుల్లో, అంటే వ్యక్తావ్యక్త స్థాయుల్లో ఊగిసలాడుతున్నాం.

కంటికి కనిపించే సాక్ష్యాలను బట్టి జీవితాన్ని అర్థం చేసుకోవటం కానీ, ఒక నిశ్చయానికి రావటం కానీ తగదు. భౌతిక ఇంద్రియాల ద్వారా పొందిన జ్ఞానం స్వతహాగా భౌతికమే కదా! కనుక దానికి హద్దులుంటాయి. వాస్తవికత యొక్క వేరే కోణాలను కూడా పరిగణనలోనికి తీసుకున్నప్పుడే సంపూర్ణ జ్ఞానం కలుగుతుంది. అలా అన్ని కోణాల నుండి సేకరించిన అంశాలను క్రోడీకరించి, విశ్లేషణ చేయగల మేధస్సు మనకున్నప్పుడే జీవితంలోని ప్రతి అనుభవాన్ని సమగ్రంగా అర్థం చేసుకోగల్గుతాం. సుసంపన్నమైన, లోతైన ఈ అవగాహనయే జీవితం యొక్క యథార్థ స్వభావాన్ని సుస్పష్టం చేస్తుంది. అంతేగాక, మన స్వీయ చరిత్రను మనం నిష్పక్షపాతంగా చూడగలుగుతాం.



ఉదాహరణకు ప్రాచీనకాలం నుండీ, పురాణాలు మరియు ఇతర మూలాల ద్వారా మనకు వివరించబడుతున్న ప్రతి కథకు రెండు పార్శ్వాలున్నాయి. మొదటిది అనుభవపూర్వకం, రెండవది భావాతీతం! అటువంటి కథ అర్థం కావాలంటే, ఈ రెండు పార్శ్వాలూ అనుసంధానమైనచోట మాత్రమే అది సాధ్యమవుతుంది.

అదేవిధంగా మానవ చరిత్రను కూడా ఈ రెండు పార్శ్వాల నుండే అవగాహన చేసుకోవలసి ఉంటుంది. ఆవిధమైన అధ్యయనం గతాన్ని అవగాహన చేసుకుంటూ, మరింత మెరుగైన భవిష్యత్తువైపు పయనించేందుకు మనకు ఉపకరిస్తుంది. చరిత్రను మనం కేవలం కొన్ని భౌతిక సాక్ష్యాల ఆధారంగా ఏర్పడ్డ సమాచారంగా స్వీకరించినప్పుడు, అంతర్గతంగా ఆ అనుభవాలలో దాగివున్న నైతిక, సామాజిక పాఠాలను

కోల్పోతాం. అంతేగాక, కవి చాతుర్యంతో భావోద్వేగాలతో అల్లిన కథలపై ఆధారపడితే కొన్ని మూఢనమ్మకాలకు బలి అవుతాం. కనుక మనం పైన ఉదహరించిన రెండు పార్శ్వాల కలయికను ఆశ్రయించక తప్పదు.

ఒకసారి ఒక శిష్యుడు విగ్రహారాధన ప్రామాణికతను గురించి స్వామి బ్రహ్మానందను అడిగాడు. అందుకాయన అతణ్ణి ఇలా ప్రశ్నించారు: 'పదార్థజ్ఞానం ఎక్కడ అంతమై, ఆత్మజ్ఞానం ఎక్కడ ప్రారంభమవుతుందో నీవు చెప్పగలవా?' జడం మరియు చైతన్యముల సూక్ష్మమైన కలయిక వద్ద ఆ సంగమ బిందువు ఉంటుంది.

ఆత్మ అనంతం కనుకనే మన అంతరాత్మలోని కోరిక ఆ అనంతాన్ని చేరటం! ఛాందోగ్యోపనిషత్తులో నారదునితో సనత్కుమారుడు ఇలా అంటాడు: 'ఏది అనంతమైనదో అదే ఆనందానికి వనరు. పరిమితత్వంలో ఆనందం ఉండదు. అనంతత్వంలోనే ఆనందం ఉంది. కానీ, ఈ అనంతత్వాన్ని అర్థం చేసుకోవటానికి నిరంతరం ప్రయత్నించాలి.'

మన జీవనగమ్యం అంతిమ సత్యాన్ని కనుగొనటం! కానీ ఇంద్రియాలతోనూ, విషయభోగాలతోనూ మమేకమై ఆనందం కోసమైన మన వెదుకులాట దారి తప్పి, ప్రాపంచికతకు పరిమితమైపోయింది. ఈ భావన మనస్సును విచ్ఛిన్నం చేసి, అపరిశుభ్రం చేసివేసింది. అందుచేత మన మనస్సులలో ఆ అనంత బ్రహ్మానందం ప్రతిఫలించడం లేదు. మూఢత్వం, సంకుచిత మనస్తత్వ ధోరణులు మనస్సును స్వార్థపూరితమైన గుర్తింపునకై ప్రాకులాడేలా చేస్తాయి.



మనస్సును అంతర్ముఖం చేసి, శాశ్వతత్వపు ఆనందాన్ని చవిచూసేలా చేసేందుకు సింహద్వారం వంటి ఒక మార్గం కావాల్సివుంది. మహోన్నతమైన ఆ పరబ్రహ్మ తత్త్వం మన ఎడల దయతో ఆయా కాలాలకు అనుగుణంగా అట్టి సింహద్వారం వంటి మహనీయులను సృజిస్తూనే ఉంది. వారు లౌకికమైన ఈ భౌతిక ప్రపంచాన్ని, దానికి ఆవలనున్న అనంత సత్యాన్ని అనుభూతికి తెచ్చుకున్నవారని చెప్పవచ్చు. అటువంటి మహనీయులే శ్రీరామకృష్ణులు!

గురుదేవులు శ్రీరామకృష్ణులు స్వయంగా ఇచ్చిన ఈ ఉదాహరణను చూద్దాం:

“ఒకవ్యక్తి ఒక ఎత్తైన గోడకు ఇవతలివైపు నిలబడి వున్నాడనుకోండి. గోడకు ఇవతల, ఆవలవైపు కూడా అనంతమైన ఆవరణలు ఉన్నాయి. ఆ గోడకు ఒక రంధ్రం ఉంటే దానిద్వారా గోడకు ఆవలివైపు ఉన్నదంతా ఆ వ్యక్తి చూడగల్గుతాడు. ఆ రంధ్రం పెద్దదైతే, దానిగుండా అతడు అవతలివైపునకు పోగలడు కూడా! అవతారపురుషులు లేదా ఈశ్వరకోటుల అహంకారం ఆ రంధ్రంగల గోడ వంటిది. వారు గోడకు ఇవతలివైపున ఉన్నప్పటికీ, అవతలివైపున ఉన్న అనంతమైన ఆవరణను కూడా చూడగలరు.”

'బ్రహ్మము నెరిగినవాడు బ్రహ్మమే' అని ఉపనిషత్తులు పలుకుతున్నాయి. శ్రీరామకృష్ణులను గూర్చి రచించిన ఒక ప్రార్థనా గీతంలో స్వామి వివేకానంద ఆయనను 'చిద్ఘనకాయ్' అని సంబోధిస్తారు. అంటే, ఏవిధమైన భౌతిక పదార్థంతో పనిలేకుండా స్వచ్ఛమైన పరిపూర్ణ సచ్చిదానందమే శరీరంగా కలవారని అర్థం. ఆ స్వచ్ఛమైన అనంత చైతన్య రూపాన్ని ధ్యానించండి అంటారు స్వామీజీ. 'శుద్ధ బుద్ధి, శుద్ధ మనస్సు, శుద్ధ ఆత్మ–మూడూ ఒక్కటే!' అని శ్రీరామకృష్ణులు కూడా వచించారు. అందుచేత మనం మన చర్మ చక్షువులతో చూస్తున్న శ్రీరామకృష్ణుల రూపం పరబ్రహ్మమే తప్ప మరొకటి కాదు. దానిపై ధ్యానం చేసేకొద్దీ, మన మనోబుద్ధులు పవిత్రమై బాహ్యాంతరాలలో ఉన్న మహాసత్యం అనుభవమవుతుంది. తన ద్వారా ప్రతి వస్తువు వెనుకగల అనంతత్వ, శాశ్వతత్వాలను మనం చూడగలమని శ్రీరామకృష్ణులు సూచించారు. శ్రీరామకృష్ణుల దివ్యత్వం అలాంటిది!

శాశ్వతత్వానికి చేరేందుకు మరొక రహదారి కూడా ఉంది. 'శివజ్ఞానే జీవసేవ' అనే మూలసూత్రం మనల్ని పరమాత్మ వద్దకు చేరుస్తుందని శ్రీరామకృష్ణులే వచించారు. మానవులందరూ భగవంతుని ప్రతిరూపాలని భావిస్తూ, వారికి సేవచేయటం వలన మన మనస్సులు పవిత్రమై, ఈ వ్యక్తావ్యక్త ప్రపంచంలోని ఆనందపూర్ణమైన సత్యాన్ని అనుభవానికి తెచ్చుకోగలుగుతాం. ❖

ఆంగ్లమూలం : స్వామి దివ్యకృపానంద
అనువాదం : త్రివిక్రమానంద

ఓ దేవా! ఆధ్యాత్మిక సాధనలో మానవాళికి సహాయమొనర్చడానికి అవతరించిన అవతారమూర్తివి నీవు. మానవుల దుఃఖాలను తొలగించడానికి కరుణే రూపుదాల్చిన దైవం నీవు. - స్వామి వివేకానంద

పంచేంద్రియములన

ఈ ప్రపంచం ఒక మహావిపణి... ప్రతి మనిషీ ఓ వర్తకుడు... శరీరమనే నావనెక్కి బయలుదేరుతాడు... సంసారమనే సాగరంపై ప్రయాణిస్తాడు... పాపపుణ్యాలనే సరుకులను వెంట తెచ్చుకుంటాడు... వ్యామోహమనే రేవులో దిగుతాడు... పంచేంద్రియాలనే పట్టణ ప్రభువులతో బేరసారాలు సాగిస్తాడు... బేరం కుదిరి సరుకులు అమ్ముడుపోగానే (కర్మభారం దించుకోగానే) స్వస్థలానికి వెళ్ళిపోతాడు.

ఈ లోకంలో మనిషి బతుకంతా వ్యాపారమే! ఇంద్రియ లావాదేవీలతో కూడుకున్నదే! మానవ సంబంధాలన్నీ లాభనష్టాలపై ఆధారపడి ఉన్నవే! ప్రతి ఒక్కరం మన కర్మభారాన్ని దించుకోవటానికి వచ్చిన వర్తకులమే! గత జన్మల్లో చేసిన మంచిచెడులను సరుకులుగా మోసుకొని వస్తాం. అయిదు ఇంద్రియాలనే కొనుగోలుదారులతో ఎంత త్వరగా బేరం కుదిరితే అంత త్వరగా మన సరుకులు ఖాళీ అవుతాయి.

నిగూఢమైన ఈ సత్యానికి అన్నమాచార్య అద్భుతమైన తన భావుకతతో సంకీర్తన రూపమిచ్చాడు. **'పంచేంద్రియములనే పట్టణస్వాములాల...'** అంటూ సరికొత్త రీతిలో జీవుడి లౌకిక వ్యవహారాలను నిర్వచించాడు. అన్నమయ్యలో ఓ భక్తుడే కాదు గభీర వేదాంతి, అపూర్వ తాత్త్వికుడు కూడా ఉన్నాడని ఇలాంటి కీర్తనల ద్వారా అర్థమవుతుంది. సంక్లిష్టమైన వేదాంత సత్యాలను కూడా సరళమైన ఉపమానాలతో వివరించటం ఈ పదకవితా పితామహుడి ప్రత్యేకత! ఈ ప్రపంచం మన నిజస్థానం కాదని, త్వరగా బరువులూ బాధ్యతలూ ముగించుకొని మనకూ, మన ఇంద్రియాలకూ ఆధారమైనవాడిని ఆశ్రయించటమే పరమ గమ్యమని చెప్పటమే ఈ కీర్తనలో అన్నమయ్య ప్రబోధం. సద్గురువులు ఎవరైనా ఈ రీతిలోనే మనను మేల్కొలుపుతారు. అందుకే గురుదేవులు శ్రీరామకృష్ణులు “ఏవో కొన్ని వ్యవహారాల్ని చక్కబెట్టుకోవటానికే ఈ ప్రపంచానికి వచ్చామని తెలుసుకోవాలి. మన స్వస్థలం భగవంతుడి సన్నిధేనని గుర్తించాలి. ఆయననే మన కర్తగా భావించాలి” అనేవారు.

దించరో బరువు...

విజ్ఞులు ఎక్కువ కాలం ఈ శరీరాన్ని నిలుపుకోవాలని ఆశపడరు. వివేకవంతులు వ్యర్థమైన ఈ లోకవ్యవహారాలను దీర్ఘకాలం కొనసాగించాలని కోరుకోరు. ఎంత త్వరగా ఈ లౌకిక వ్యవహారాలకు స్వస్తి పలికితే అంత సుఖమని ఆత్రుతపడతారు. ఆ భావనకే అక్షరాకృతినిస్తూ...

పంచేంద్రియములనే పట్టణస్వాములాల
తెంచి బేరమాడుకొని దించరో బరువు... అని సంకీర్తనకు శ్రీకారం చుడుతున్నాడు ఈ సంకీర్తనాచార్యుడు. ఇక్కడ అన్నమయ్య ప్రస్తావించిన పంచేంద్రియాలు చెవులు,ముక్కు, కళ్ళు, నాలుక, చర్మం. ప్రపంచమనే మహా వ్యాపార సామ్రాజ్యానికి పట్టణ ప్రభువులు ఈ జ్ఞానేంద్రియాలు. త్వరగా బేరం ముగించుకొని తన బరువును దించమని వాటికి విజ్ఞప్తి చేస్తున్నాడు ఈ పదకవితా పితామహుడు. దేహసుఖాలపై విపరీతమైన ప్రీతి కలిగినవారు మాత్రమే దేహాన్ని నిలుపుకోవాలని ప్రయత్నిస్తారు. ఎంత త్వరగా ఈ దేహాన్ని వీడితే అంత ప్రశాంతత అని విరాగులు భావిస్తారు. 'కూలికి బరువు మోస్తున్నట్లే జ్ఞాని ఈ దేహాన్ని మోస్తాడు. గమ్యస్థానం వచ్చేది ఎప్పుడా? ఎప్పుడా? అని ఎదురుచూస్తాడే కానీ ఏవో ప్రయత్నాలు చేసి ఇంకా మోయాలనుకోడు' అన్నారు రమణులు.

పుణ్యపాపాలే సరకులు...

అన్నమాచార్య పంచేంద్రియాలను పట్టణ ప్రభువులతోనూ, పాంచభౌతికమైన ఈ శరీరాన్ని దూరతీరాల నుంచి వచ్చే వర్తకుడి ఓడతోనూ పోల్చాడు. ఆ ఓడలో పాపపుణ్యాలనే సరకులను మోసుకొస్తాడని వర్ణించాడు. అన్నింటికన్నా సరికొత్తగా ప్రపంచవ్యామోహాన్ని బూతురేవని నిర్వచించాడు. ఈ చక్కని ఉపమానాలతో కీర్తన చరణాన్ని...

తగిన సంసారసముద్రములోనఁ దిరిగాడి
బిగువుదేహపుటోడ బేహారివాఁడ
జగతిఁ బుణ్యపాపపు సరకులు దెచ్చినాఁడ
దిగితి బూతురేవునఁ దీరుచరో సుంకము... అంటూ కొనసాగించాడు. 'బేహారి' అంటే వ్యాపారి అని అర్థం. 'ఈ శరీరమనే నావనెక్కి సంసారమనే సముద్రంలో తిరుగాడుతున్న వర్తకుణ్ణి! పాపపుణ్యాలనే సరకుల్ని తెచ్చి, వ్యామోహమనే రేవులో దిగాను. తగిన మూల్యం చెల్లించి నా బరువును దించండి' అంటూ ఇంద్రియాలనే పట్టణ ప్రభువులను వేడుకుంటూ, పరోక్షంగా అన్నమయ్య మనలోని

జీవుడి ఆవేదనకు అక్షరాకృతినిచ్చాడు. అంతర్ముఖులై ఆలోచిస్తే ఆత్మ ఈ శరీరాన్ని బందిఖానాగానే భావిస్తుంది. దాని నుంచి విడివడి పరమాత్మలో లీనమయ్యేందుకు తహతహలాడుతుంది. అందుకే, 'కో వాఽస్తి ఘోరో నరకః స్వదేహః - ఘోరమైన నరకమేదంటే ఈ శరీరమే' అంటోంది మన సనాతన ధర్మం.

కోరికలే తెరచాపలు..

తరువాతి చరణంలో తాళ్ళపాక అన్నమయ్య శరీరమనే ఓడకు సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలే తెడ్డులని, కోరికలే తెరచాపలని ఆసక్తికరంగా కీర్తనను కొనసాగిస్తూ...

అదరి గుణత్రయములనేటి తెడ్డుల చేత
నడుమ నిన్నాళ్ళదాఁకా నడపినాఁడ
కడుఁజంచలములనే గాలిచాప లెత్తినాఁడ
వెడమాయపు సరకు వెలకియ్యరో... అని ఇంద్రియాలను అర్థిస్తున్నాడు. 'అదరి' అంటే అతిశయించి, 'వెడ' అంటే అల్పం, తుచ్ఛం, వ్యర్థం అనే అర్థాలున్నాయి. సంసారమనే సముద్రంలో దేహమనే నావను త్రిగుణాలు తెడ్డులై ముందుకు నడిపిస్తున్నాయని, ఆశలే తెరచాపలై రెపరెపలాడుతున్నాయని అభివర్ణిస్తూన్నాడు. మాయలో పడి వ్యర్థమైన సరకుల్ని తెచ్చానని, ఎంతో కొంత వెలకట్టి వాటి భారాన్ని దించమని ఇంద్రియాలకు విన్నవించుకుంటున్నాడు. భక్త కబీర్ కూడా ఓ కవితలో జీవుడిని బాటసారితో పోలుస్తాడు. 'తెరువరీ! నిదురింతువేల? నీ మూటకు దొంగలు చుట్టినారు. వేగు పొడిచింది. మేలుకొమ్ము. దారి మంచిది కాదు' అంటూ మేల్కొలుపు పాడతాడు. ఇంద్రియాలను దొంగలతో పోల్చుతూ, ఈ సంసారమనే తోవ అంత మేలైంది కాదని, తమస్సును వీడి త్వరగా జాగృతం కమ్మని ప్రబోధిస్తాడు.



పట్టణ స్వాములాల...

- శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

పంచేంద్రియములనే పట్టణస్వాములాల
తెంచి బేర మాడుకొని దించరో బరువు ॥

తగిన సంసారసముద్రములోనఁ దిరిగాడి
బిగువుదేహపుటోడ బేహారివాఁడ
జగతిఁ బుణ్యపాపపు సరకులు దెచ్చినాఁడ
దిగితి బూతురేవునఁ దీరుచరో సుంకము ॥

అదరి గుణత్రయములనేటి తెడ్డుల చేత
నడుమ నిన్నాళ్ళదాఁకా నడపినాఁడ
కడుఁజంచలములనే గాలిచాప లెత్తినాఁడ
వెడమాయపుసరకు వెలకియ్యరో ॥

ఆతుమయనేటికంభ మంతరాత్ముఁడెక్కి యుండి
నీతితో మమ్ముఁగాచుక నిలుచున్నాడు
ఆతఁడే శ్రీవేంకటేశుఁడటు మాకు మీకుఁ గర్త
ఘాతమాని ఇఁక మాకు కడుగుణమియ్యరో ॥

శ్రీవేంకటేశుడే కర్త...

'జనన మరణ భరిత సంసార జలధిని భక్తుడీదగలడు, పరుడు మునుగు' అంటాడు తిరువళ్ళువార్. భగవంతుడే మనకు భర్త, కర్త అని తెలిసినవారు అలా అనాయాసంగా జీవననావలో ముందుకు సాగిపోతారు. కీర్తన తుదిచరణంలో అన్నమయ్య ఆత్మ, పరమాత్మల సంబంధానికి అపురూపమైన పోలిక చెప్పాడు. దేహమనే పడవకు స్తంభం ఆత్మ అనీ, ఆ కంబానికి ఆధారమై ఉన్నవాడు అంతర్యామియైన పరమాత్మ అనీ వివరించాడు. ఆ పరమాత్మే శ్రీనివాసుడై మాకూ, మీకూ కర్తగా నిలుస్తున్నాడని ఇంద్రియాలకు విన్నవించుకుంటున్నాడు. మమ్మల్ని దెబ్బతీయాలని అనుకోక, మాకు మేలు కలిగేలా చూడండి అని ప్రాధేయపడుతున్నాడు.

'ఆతుమయనేటికంభ మంతరాత్ముఁడెక్కి యుండి
నీతితో మమ్ముగాచుక నిలుచున్నాడు
అతఁడే శ్రీవేంకటేశుఁడటు మాకు మీకుఁ గర్త
ఘాతమాని ఇఁక మాకు కడుగుణమియ్యరో...' అంటూ కీర్తనకు ముగింపు పలుకుతున్నాడు. 'కంభము' అంటే స్తంభము, 'ఘాత' అంటే దెబ్బ అని అర్థాలు. ❖

దేన్ని సాక్షాత్కరించుకుంటే ఇక చూడదగినది ఏదీ ఉండదో, దేనితో ఏకరూపమైతే ఇక మరుజన్మ ఉండదో, దేన్ని తెలుసుకుంటే ఇక తెలియదగింది ఏదీ ఉండదో అదే బ్రహ్మం. - ఆదిశంకరాచార్యులు



అద్భుత వాక్కులు

ప్రపంచానికి తెలియకుండా నిశ్చలంగా, నిరంతరాయంగా భగవంతుని సంసర్గంలో జీవించడమే యోగుల సహజ అభిలాష. శాస్త్రాలు కూడా తెలుపలేని సత్యాలను వారి జీవితాలు మనకు తెలుపుతాయి. వారు ఉపన్యాసాలివ్వరు. కొన్నిసార్లు మౌనంతో, మరికొన్నిసార్లు కొద్ది మాటలతో బోధిస్తారు. రామకృష్ణ సంఘంలో లాటూ మహారాజ్‌గా ప్రసిద్ధిగాంచిన 'స్వామి అద్భుతానంద' ఈ కోవకు చెందుతారు. గ్రామీణ బాలుడైన ఈయన తన గురువైన శ్రీరామకృష్ణుల శిక్షణ, దైవీప్రేరణల వల్ల బ్రహ్మజ్ఞానం పొందారు. "లాటూ, శ్రీరామకృష్ణుల అత్యద్భుత సృష్టి! లేశమాత్రమైనా విద్యాగంధం లేకుండా కేవలం గురుదేవుల స్పర్శతోనే బ్రహ్మజ్ఞానాన్ని పొందాడ"ని స్వామి వివేకానంద ఈయనను ప్రశంసించారు. "వేదవేదాంతాల్లోని మణిపూసల వంటి సత్యాలు ఒకనాటికి నీ పెదవుల నుండి జాలువారతాయి" అని శ్రీరామకృష్ణులు స్వామి అద్భుతానందను గురించి భవిష్యవాణి పలికారు. కాలాంతరంలో ఇది అక్షర సత్యమైంది. ముముక్షువులకు మార్గదర్శకాలుగా నిలిచిన మణిపూసలవంటి స్వామి అద్భుతానంద మాటలను 'అద్భుత వాక్కులు'గా 2025 ఫిబ్రవరి సంచిక నుండి ధారావాహికగా అందిస్తున్నాం.

భగవంతుడే పరిపూర్ణ ఆధారంగా...

భక్తులు తాము స్వయంగా పరిష్కరించుకోగలిగిన అల్పమైన లౌకిక విషయాలకు భగవంతుణ్ణి ఇబ్బందిపెట్టాలనుకోరు. అలాంటి చిన్నచిన్న విషయాల కోసం భగవంతుణ్ణి విసిగించనక్కరలేదని నాకు అనిపిస్తుంది.

మనిషి కోరికలకు అంతం లేదు. భగవంతుడు మనిషికి ఎంత ధనమిచ్చినా, అతని కష్టాలు ఎప్పటికీ సమసిపోవు. అయితే, తన బాధలను గురించి భగవంతునికి విన్నవించుకున్నప్పుడు మాత్రమే మనిషికి ఉపశమనం కలుగుతుంది. చాలామంది 'దేవుడా! దేవుడా!' అని పైపైనే పలవరిస్తారు. కానీ, ఎవరికేమి కావాలో భగవంతుడికి తెలియదా? అందరి అవసరాలూ ఆయనకు తెలుసు. ప్రతిఒక్కరికీ వారి వారి కర్మకు తగినట్లుగానే ప్రసాదిస్తాడాయన! భగవంతునిపై అచంచల విశ్వాసం లేకపోవడం, ఆయనపై సంపూర్ణంగా ఆధారపడకపోవడం వల్లనే మనుషులు ఎన్నో వ్యథలను అనుభవిస్తారు. అలాంటివారితో కలసి ఉండేవారికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయి. వారు తాము బాధపడటమే కాకుండా, తమ చుట్టూ ఉన్నవారిని కూడా బాధలకు గురిచేస్తారు.

మనిషి ఆశాజీవి! కానీ, అతని ఆశలు ఆకాశాన్ని అంటితే మాత్రం తీవ్రమైన దుఃఖాన్ని అనుభవించాల్సి వస్తుంది. అందుకే, తనకు లభించిన దానితో సంతోషంగా ఉంటూ భగవంతుని సంకల్పంపై విశ్వాసం ఉంచాలి. భగవంతుడు అపార కరుణామయుడు. 'నాకంటే భగవంతుడికే ఎక్కువ తెలుసు. కాబట్టి, దయతో ఆయన నాకు దేనిని ప్రసాదిస్తే, దానితోనే సంతృప్తి చెందుతాను' అని ఎవరైతే గ్రహిస్తారో, ఆపై వారికి ఎలాంటి దుఃఖమూ ఉండదు.

వ్యాధులు వచ్చినప్పుడు లేదా జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు చాలామంది మనశ్శాంతిని కోల్పోయి ఆందోళన చెందుతారు. కానీ, అలాంటి సందర్భాలలోనే మరింత సహనం, మనోస్థైర్యం కలిగివుండాలి. ప్రగాఢ భక్తివిశ్వాసాలతో భగవంతుణ్ణి ప్రార్థించాలి. వైద్యుల సూచనల మేరకు వ్యాధిని నయం చేసుకునేందుకు వీలైనంతగా ప్రయత్నించాలి. ఔషధం తప్పక పనిచేస్తుందనేవారు గురుదేవులు. మొక్కలోని ఔషధ గుణం వృథాగా పోతుందా? ఒకవేళ అది వ్యాధిని తగ్గించలేకపోయినా, ఊరకే ఆందోళన చెంది ఏం ప్రయోజనం? అప్పుడిక 'అంతా భగవంతుడి చేతుల్లోనే ఉంది' అని నువ్వు వివేకంతో తెలుసుకోవాలి.

నిజమైన భక్తుడు భగవంతుణ్ణి ఎన్నటికీ ఇబ్బందిపెట్టడు. భగవన్నామాన్ని స్మరిస్తూ, ఆయననే శరణుజొచ్చిన భక్తుడికి భగవంతుడు తప్పక ఆహారం సమకూరుస్తాడు. అలాంటప్పుడు భగవంతునితో ఊరకే వాపోవడమెందుకు? భిక్షగా లభించిన ఆహారాన్ని స్వీకరించి జపధ్యానాలు చేసుకుంటే చాలు! అదనంగా మౌనవ్రతాలు పాటించాల్సిన అవసరం ఏముంది? భగవంతునిపై ఆధారపడని వ్యక్తి జపధ్యానాలు

ఎలా చేయగలడు? సంపూర్ణంగా ఆయనపై ఆధారపడకపోతే ఏమీ సిద్ధించదు.

పవిత్రత మరియు మహోన్నత ఆదర్శం

ఒక వ్యక్తి పవిత్ర జీవనుడిగా ఉంటే, తప్పక అతడు ఏదో ఒకరోజు ఆధ్యాత్మికతా సారాన్ని అనుభూతి చెందుతాడు. శ్రీకృష్ణుడు అర్జునునికి సాక్షాత్కరించినట్లే, సత్యం ఉన్న చోట భగవంతుడు స్వయంగా ప్రకటితమవుతాడు.

ఈ కలియుగంలో మానవ దేహాన్ని ధరించి, కొద్దిగా మాంసం లేదా చేపలు తినడం వల్ల హాని ఏమిటి? పవిత్ర జీవనం గడిపేవారికి దానివల్ల ఏ హానీ కలుగదు. వాటిని తినేవారు ఎంతోమంది 'భగవంతుడా! తండ్రీ!' అంటూ భక్తితో భగవంతుణ్ణి ప్రార్థిస్తుంటారు. కానీ, మాంసాహారాన్ని మానుకున్న చాలామంది అపవిత్ర జీవనం గడుపుతున్నారు. కనుక మొదట పవిత్రంగా ఉండండి. నిర్మల హృదయం గలవారిపైనే భగవంతుడు తన అనుగ్రహాన్ని వర్షిస్తాడు.

సత్రంలో లభించే ఉచిత ఆహారాన్ని (సాధకులు) ప్రతి ఒక్కరూ జీర్ణించుకోగలరా? చాలా సందర్భాలలో అది ప్రతికూల ఫలితాన్నిస్తుంది. ఎందుకంటే, ఆ ఆహారానికి వేలాది కోరికలు సూక్ష్మరూపంలో అంటిపెట్టుకొని ఉంటాయి. తీవ్ర జపధ్యానాలు ఆచరిస్తేనే వాటి ప్రభావం నివారించబడుతుంది.

పరిశుభ్రంగా ఉన్నవారిని చూస్తే గురుదేవులు ఎంతగా ఆనందించేవారో వర్ణించలేం. మురికిగా ఉంటే ఆయనకు అస్సలు ఇష్టముండేది కాదు. మనిషి బాహ్యంలోనూ, అంతరంలోనూ నిర్మలుడై ఉండాలి.

మహాత్ములు ఒక్కొక్కరుగా ఈ లోకం విడిచి వెళ్ళిపోతుండటం చాలా విచారకరం. ఈ ప్రపంచం ఇంకా ఎన్ని విపత్తులను ఎదుర్కోవలసి ఉందో ఎవరు చెప్పగలరు? మహాత్ములు నిష్క్రమించడం లోకానికి నిజంగా అశుభసూచకం. సాధువులు ఒక్కొక్కరూ తమ శరీరాలను విడిచిపెడుతున్నారు. ఎంత భయంకరమైన కాలం దాపురించింది! 'ఈ భూమిపై సాధువులు లేకపోతే, అది వినాశనానికి సంకేతం' అనేవారు గురుదేవులు. సాధువుల ఉనికి ప్రగాఢ ఆధ్యాత్మిక శక్తిని ఉత్పన్నం చేస్తుంది. దుష్టప్రవృత్తి గలవారు ఎన్నటికీ అటువంటి శక్తిసంపన్నులు కాలేరు.

అన్య ధర్మానికి చెందిన వ్యక్తియైనా సరే, ప్రేమతో మీకు ఆహారం సమర్పిస్తే, ఎలాంటి సంకోచం లేకుండా దానిని స్వీకరించవచ్చు. దానివల్ల మీ పవిత్రతకు ఎటువంటి భంగం కలగదని తెలుసుకోండి. భక్తి విశ్వాసాలతో సమర్పించిన ఏ వస్తువైనా సాత్త్వికమే!

(పరమ) సత్యాన్ని తెలుసుకోకుంటే దేన్నీ సాధించనట్లే! ఆ సత్యాన్ని తెలుసుకోవడానికి నిరంతరం ప్రయత్నించండి. సత్యస్వరూపుడైన భగవంతుడు ఉన్నచోట అసూయ నిలువలేదు. సత్యాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేయకపోతే, అది తనను వ్యక్తపరచుకోదు (సత్య సాక్షాత్కారం కాదు). అందుకు బదులుగా అసూయాద్వేషాలు చోటు చేసుకుంటాయి. అసత్యం ఉన్నచోట సంకుచితత్వం ఉంటుంది. సత్యం అభివ్యక్తమైనచోట పరిసర వాతావరణమే మారిపోతుంది.

ఒక కుటుంబంలో ఒక సోదరుడు మరొక సోదరుడికంటే ఎక్కువ సంపాదిస్తున్నాడనుకోండి... అప్పుడు పెద్దవాడు చిన్నవాడితో (లేదా చిన్నవాడు పెద్దవాడితో) 'నువ్వు ఎక్కువ సంపాదించలేకపోతున్నావని ఎందుకు ఆందోళన చెందుతున్నావు? ఈ లోకంలో మనం ఎంత కాలం ఉంటామో ఎవరికి తెలుసు? సంసార జీవితంలో అడుగుపెట్టాం కాబట్టి, మన పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టగలిగితే చాలు' అన్నాడనుకోండి. అలాంటి వ్యక్తియే నిజమైన సోదరుడు.

అలాగే, ఒక ఉత్తమ భార్య తన భర్తతో ఇలా అంటుంది: 'అతడు మీ సొంత సోదరుడు. ఈ లోకంలో మనం ఉండేది కొన్ని రోజులే కదా! పరస్పరం కలసి జీవిద్దాం.' అలాంటి కుటుంబాల్లో కలహాలు చోటు చేసుకోవు. ధర్మం ప్రబలంగా ఉన్నప్పుడు, అపరిచితుల పట్ల కూడా సోదరభావం కలుగుతుంది. అప్పుడు పరస్పర విశ్వాసం, భక్తి, స్వేచ్ఛాభావం మరింత బలపడతాయి. ❖ (సశేషం)

(రామకృష్ణ సంఘ ఆంగ్ల మాసపత్రిక 'ప్రబుద్ధ భారత' నుండి)

తెలుగు అనువాదం :

డాక్టర్ కమల ఎస్. జయరావు

భాగవత ఆణిముత్యాలు

– ప్రవ్రాజిక బోధమయప్రాణ

నిజమైన స్వాతంత్ర్యం

ప్రతి సంవత్సరం మనం ఆగష్టు 15న దేశమంతటా ఎంతో వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని జరుపుకుంటాం. రెండు వందల సంవత్సరాల సుదీర్ఘ, కటిక బానిసత్వం తరువాత భారతావని సాధించిన ఈ రాజకీయ స్వాతంత్ర్యం, ఎన్నో దశాబ్దాలు గడిచినా నేటికీ మన హృదయాలలో నూతన ఆనందాన్ని, జాతీయ భావనను నింపుతోంది. అయితే, ఇది బాహ్య జీవితంలో మనం అనుభవించే రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే! లౌకిక అభ్యుదయానికి ఇది మొదటి మెట్టు అయినప్పటికీ, మానవుడి అంతరంగంలో ఇంకా దాస్యత్వ భావనలు తొలగిపోలేదు. దేశానికి స్వేచ్ఛ వచ్చినా, మనిషి ఇంకా 'ఇంద్రియ దాస్యం' అనే అంతర్గత బానిసత్వంలోనే మగ్గుతున్నాడు. భారతీయ సనాతన సంప్రదాయంలో ఇంద్రియాలను, మనస్సును జయించి ఆత్మసాక్షాత్కారాన్ని పొందినవారినే నిజమైన ముక్తులు లేదా పరమ స్వాతంత్ర్యాన్ని పొందినవారిగా శ్రుతి-స్మృతులు కీర్తిస్తున్నాయి.

ఇంద్రియాలు మరియు మనస్సుల పిడికిలిలో చిక్కుకున్నంత కాలం, ఒకడు బాహ్య ప్రపంచానికి చక్రవర్తి అయినా ఆధ్యాత్మికంగా బానిసతో సమానమే! దీనికి అద్భుతమైన ఉదాహరణ – ప్రపంచాన్నే జయించాలనుకున్న అలెగ్జాండర్ చక్రవర్తి, భారతదేశపు పర్వత ప్రాంతాలలో ఒక దివ్యతేజోమయుడైన దిగంబర సన్న్యాసి ముందు తలవంచిన ఘట్టం. తనతో రాకుంటే శిరశ్ఛేదం చేస్తానని కత్తి ఝుళిపించిన అలెగ్జాండర్‌ను చూసి ఆ సాధువు నిశ్చలంగా నవ్వి, '*నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః*' అంటూ తాను అవినాశియైన ఆత్మస్వరూపుడినని ప్రకటించాడు. అంతేగాక, "నేను కామక్రోధాలను నిగ్రహించాను కాబట్టి అవి నా బానిసలు. నువ్వు కామక్రోధాలకు లోబడి ఉన్నావు కాబట్టి, నువ్వు నా బానిసలకు బానిసవు" అంటూ అలెగ్జాండర్ అహంకారాన్ని అణచివేశాడు.

మనందరం కూడా ఈ కామక్రోధాలకు కొద్దో గొప్పో బానిసలమే! శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో '*ఇంద్రియాణి మనో బుద్ధిః అస్యాధిష్ఠానముచ్యతే*' అంటూ ఈ కామక్రోధాలనే శత్రువులు మన ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే కోటలను ఆక్రమించుకొని కూర్చొన్నాయని హెచ్చరించాడు. కనుక ఈ ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనే కోటలను మనం మన అధీనంలోకి తెచ్చుకోవాలి.

క్యాన్సర్ కణం ఏవిధంగా శరీరమంతా వ్యాపిస్తుందో, అలాగే ఈ ఇంద్రియ బలహీనతలు మనస్సును, బుద్ధిని ఆవరించి వివేకాన్ని కప్పివేస్తాయి. ఫలితంగా మానవుడు తన నిజస్వరూపాన్ని మరచి పశుస్వభావంతో ప్రవర్తిస్తాడు.

శ్రీ శంకరాచార్యుల 'వివేక చూడామణి'లోని ఒక ప్రసిద్ధ శ్లోకం ఇంద్రియ దాసత్వం యొక్క తీవ్రతను ఇలా వివరిస్తుంది:

శబ్దాదిభిః పంచభిరేవ పంచ పంచత్వమాపుః స్వగుణేన బద్ధాః ।
కురంగ మాతంగ పతంగ మీన భృంగా నరః పంచభిరంచితః కిమ్॥

– కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం అనే ఈ ఐదు ఇంద్రియాల్లో ఏదో ఒక ఇంద్రియం బలహీనతకు లోనై లేడి, ఏనుగు, మిడుత, చేప, తుమ్మెద అనే ఈ ఐదు జీవులు పంచత్వాన్ని, అంటే మరణాన్ని పొందుతాయి. ఒక్కో ఇంద్రియ చాపల్యానికే జీవుల గతి అలా ఉంటే, ఈ ఐదు ఇంద్రియాలకూ దాసుడైన మానవుడి ఆధ్యాత్మిక పతనం గురించి వేరే చెప్పవలసిన అవసరం లేదు.



శ్రీమద్భాగవతం ఏకాదశ స్కంధంలో అవధూత-యదు సంవాదంలో అవధూత ఈ ఐదు ప్రాణులను తన 24 గురువులలో భాగంగా పేర్కొంటూ వాటినుండి నేర్చుకున్న పాఠాలను వివరించాడు.

లేడి (శ్రవణేంద్రియం): శ్రావ్యమైన సంగీతానికి ఆకర్షితమై లేడి వేటగాడి వలలో చిక్కి ప్రాణాలు కోల్పోతుంది. కనుక సాధకుడు శ్రవణేంద్రియం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. భగవద్విషయాలు, భజనలు, కీర్తనలను వింటే మనసు భగవంతుని పట్ల ఆకర్షితమవుతుంది, ఫలితంగా పవిత్రమవుతుంది. దానికి బదులుగా ప్రాపంచిక సంగీతానికి లేదా సినిమా పాటలు మొదలైనవాటికి బానిస అయితే ఆధ్యాత్మికంగా భ్రష్టమవుతాడు. ఇక్కడ అవధూత యదుమహారాజుతో ఒక ఉదాహరణ కూడా ఇస్తూ ఇలా అంటున్నాడు: 'హరిణి గర్భం నుంచి జన్మించిన ఋష్యశృంగుడు విషయభోగాలకు సంబంధించిన స్త్రీల నృత్యాలు చూస్తూ, వాద్యగీతాలను వింటూ వారికి వశుడై,

వారి చేతిలో ఆటబొమ్మ అయ్యాడు. ఋష్యశృంగుడంతటి గొప్ప ఋషి పరిస్థితే అలా ఉంటే, ఇక మామూలు సాధకుని పరిస్థితి ఎలా ఉంటుంది, ఆలోచించి చూడు.'

ఋష్యశృంగుని వృత్తాంతం రామాయణ, మహాభారతాల్లో వస్తుంది. ఆయన విభాండక మహర్షి సుతుడు. అడవిలో తండ్రి ఆశ్రమంలో పెరుగుతాడు. బ్రహ్మచర్యం, పవిత్రతల కారణంగా అతడు అద్భుత శక్తులను పొందుతాడు. రోమపాద మహారాజు రాజ్యంలో కరువు తాండవిస్తోంది. పరిపూర్ణ పవిత్రత కలిగిన వ్యక్తిని తీసుకువస్తే రాజ్యంలో వర్షాలు కురుస్తాయని అతనికి పండితులు చెప్పారు. రోమపాదుడు కొంతమంది స్త్రీలను ఋష్యశృంగుని వద్దకు పంపిస్తాడు. అతడు ఇంతకుముందెన్నడూ స్త్రీలను చూడలేదు. అతనికి స్త్రీపురుష భేదం తెలియదు. 'మీరెవరు?' అని వారిని అడిగితే, ఆ స్త్రీలు తాము తపస్వినులం అని చెప్పారు. తనతోపాటు తపస్సు చేసుకోవడానికి ఋష్యశృంగుడు వారిని అనుమతిస్తాడు. వారు ఋష్యశృంగుణ్ణి నృత్యగీతాల ద్వారా ఆకర్షించి అంగరాజ్యానికి తీసుకెళతారు. అక్కడ వానలు కురుస్తాయి. కానీ, ఋష్యశృంగుడు తన తపశ్శక్తిలో కొంతభాగాన్ని కోల్పోతాడు. అంత గొప్ప మహర్షి శ్రవణేంద్రియ బలహీనతకు లోనై స్త్రీల చేతిలో ఆటబొమ్మగా మారిపోయాడు. కనుక శ్రవణేంద్రియ ఆసక్తి పట్ల సాధకుడు జాగరూకుడై ఉండాలని అవధూత మనకు చెబుతున్నాడు.





మిడుత (దర్శనేంద్రియం): మిడుత అగ్నిజ్వాల రూపానికి, కాంతికి ఆకర్షితమై దీపంలో పడి, భస్మమవుతుంది. మానవుడు కూడా క్షణికమైన రూప లావణ్యాలకు, ప్రాపంచిక వస్తువుల మాయకు ఆకర్షితుడై వివేకం కోల్పోయి పతనమవుతున్నాడు. ఐహిక, క్షణిక సుఖావేశాలు పతనహేతువులు అని తెలుసుకోవాలని అవధూత చెబుతున్నాడు.

చేప (రసనేంద్రియం): ఎరకు ఆశపడి చేప గాలానికి చిక్కి ప్రాణాలు పోగొట్టుకుంటుంది. అలాగే, జిహ్వాచాపల్యం గల వ్యక్తి రోగాలపాలై మృత్యుముఖంలో పడతాడు. అవధూత ఇక్కడ అంటున్నాడు: ఇంద్రియాలన్నింటిలో రసనేంద్రియాన్ని (జిహ్వాచాపల్యం) జయించడం అత్యంత కఠినం. దీన్ని జయించినప్పుడే మనిషి జితేంద్రియుడు కాగలడు.

ఏనుగు (స్పర్శేంద్రియం): మగ ఏనుగు ఆడ ఏనుగు యొక్క స్పర్శ వ్యామోహంలో పడి వేటగాళ్ళు తవ్విన గుంటలో బందీ అయి తన మృత్యువును తానే కొనితెచ్చుకుంటుంది. సాధకుడు తరుణి రూపలావణ్యాలకు ఆకర్షితుడై ఆమె దరికి చేరినప్పుడు తన మృత్యువును తానే కొనితెచ్చుకున్నవాడు అవుతాడు. (అదేవిధంగా స్త్రీ అయితే పురుషుని రూపలావణ్యాల మోహంలో పడి వివేకం కోల్పోతుంది).

తుమ్మెద (ఘ్రాణేంద్రియం): తుమ్మెద సువాసనకు ఆకర్షితమై తామరపువ్వులో చేరి, సూర్యాస్తమయానికి అది మూసుకుపోవడంతో అందులోనే చిక్కుకుపోతుంది. తెల్లవారేలోపు ఏనుగు వచ్చి ఆ తామరను తుంచివేయడంతో, ఆ పువ్వుతో పాటు తుమ్మెద కూడా నశిస్తుంది.

మానవుడు ఈ ఐదు ఇంద్రియాలకు దాసత్వం చేస్తుంటాడు. ఈ బలహీనతల నుండి బయటపడటం ఎలా? కేవలం బలవంతపు నిగ్రహం వల్ల ఇది సాధ్యం కాదు. మానవుడికి అంతకంటే ఉన్నతమైన ఆనందాల జాడ తెలిసినప్పుడే ప్రాపంచిక విషయాలు సులభంగా తొలగిపోతాయి. ఉదాహరణకు, శ్రీరంగంలో కామమోహితుడైన యువకుడు ధనుర్దాసు తన భార్య కళ్ళ అందానికే దాసుడయ్యాడు. కానీ, శ్రీరామానుజాచార్యులు అతనికి అంతకంటే అనంత సుందరమైన రంగనాథస్వామి దివ్యనేత్రాలను దర్శింపజేయగానే, అతని జీవితం మారిపోయి పరమ భక్తుడిగా మారాడు. అందుకే, శ్రీరామకృష్ణులు బోధించినట్లు కామక్రోధాదులను అణచడం కాదు, వాటిని భగవంతుని వైపు మళ్ళించాలి. అప్పుడే విషయానందం కాస్తా పరమానందంగా మారుతుంది.

ఈ ఇంద్రియ జయానికి పరమౌషధాన్ని కఠోపనిషత్తు ఒక అద్భుతమైన రథోపమానం ద్వారా అందించింది. మన శరీరమే ఒక రథం, ఆత్మ ఆ రథానికి యజమాని, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు. వివేకవంతుడైన సారథి(బుద్ధి) స్థిరంగా ఉండి మనస్సు అనే పగ్గాన్ని గట్టిగా పట్టుకుంటే, ఇంద్రియాలనే గుర్రాలు అదుపులో ఉండి ప్రయాణం సవ్యంగా సాగుతుంది. అలా కాకుండా బుద్ధి అస్థిరమైతే, గుర్రాలు అదుపుతప్పి జీవితరథం ప్రమాదాల పాలవుతుంది. సాధన ద్వారా బుద్ధిని స్థిరపరచి మనస్సును భగవదర్పితం చేసినప్పుడు ఇంద్రియాలు అదుపులోకి వస్తాయి. అట్టి స్థితిలోనే 'ముక్తిః కరఫలాయతే' – ముక్తి అనేది అరచేతిలో ఉసిరికాయవలె సులభసాధ్యమవుతుంది. కేవలం తాత్కాలికమైన ప్రాపంచిక సుఖాల వెంట పరుగెత్తకుండా, ఇంద్రియ దాసత్వం నుండి విముక్తులమై, మనస్సులో నిజమైన ఆత్మానందాన్ని పొందడమే మానవజీవితానికి పరమార్థం. ◆

ఐకమత్యంతో కలసి పనిచేయండి. ముక్తకంఠంతో మాట్లాడండి. ఏకాభిప్రాయులై ఉండండి.
మీ సంకల్పం ఒక్కటైనదిగా ఉండుగాక! మీ మధ్య అద్భుతమైన సామరస్యం నెలకొనుగాక! - ఋగ్వేదం



చరిత్ర విస్మరించిన వీరవనిత

'వీరమంగై' వేలు నాచియార్

- అనంతమ్

పరాయి పాలనపై సాయుధ పోరాటం అనగానే మనకు ఝాన్సీ లక్ష్మీబాయి స్మరణకు రావడం సహజం. కానీ, ఆమెకంటే ఎన్నో దశాబ్దాల ముందే, దక్షిణ భారతంలో ఆంగ్లేయుల నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచిన శక్తి, శివగంగ సంస్థాన మహారాణి 'వీరమంగై' వేలు నాచియార్. కత్తిపట్టి స్వయంగా రణరంగంలోకి దూకిన ఈ వీరనారి చరిత్ర, సామ్రాజ్యవాద అహంకారాన్ని మట్టికరిపించిన మహా వీరగాథ!

రామ్‌నాడ్ రాజకుటుంబంలో 1730 జనవరి 3న జన్మించిన నాచియార్, కేవలం రాజకుమారిగా అంతఃపుర జీవనానికే పరిమితం కాలేదు. బాల్యం నుంచే తండ్రి ఆమెకు రాజనీతి, యుద్ధ విద్యలలో సంపూర్ణ శిక్షణ ఇప్పించారు. ఫలితంగా కత్తిసాము, గుర్రపుస్వారీ, విలువిద్య వంటి సంప్రదాయ సమరకళలతో పాటు తమిళుల ప్రత్యేక ఆయుధమైన 'వలరి' ప్రయోగంలో ఆమె నిష్ణాతురాలైంది. వీటితో పాటు ఫ్రెంచ్, ఇంగ్లీష్, ఉర్దూ భాషలపై ఆమె సాధించిన పట్టు, రాబోయే రోజుల్లో దౌత్య సంబంధాలను సమర్థవంతంగా నెరపడానికి బలమైన పునాదిగా నిలిచింది. శివగంగ పాలకుడు ముత్తు వడుగనాథర్‌ను వివాహం చేసుకోవడంతో ఆమె జీవితం రాజకీయ పరిణామాల మధ్య కొత్త మలుపు తిరిగింది.

అప్పట్లో దక్షిణాన విస్తరిస్తున్న ఈస్ట్ ఇండియా కంపెనీ, స్థానిక పాలెగాళ్ళ వ్యవస్థను దెబ్బతీయాలని కుటిల యత్నాలు ప్రారంభించింది. ఆర్కాట్ నవాబుతో చేతులు కలిపిన బ్రిటీష్ సైన్యం, కప్పం చెల్లించలేదనే నెపంతో 1772లో కాళయార్‌కోవిల్ ఆలయంలో ప్రార్థనల్లో ఉన్న మహారాజు ముత్తు వడుగనాథర్‌పై అకస్మాత్తుగా దాడి చేసి హతమార్చింది. ఈ దారుణ ఘటనతో సర్వస్వం కోల్పోయిన వేలు నాచియార్ గుండెల్లో స్వాతంత్ర్య జ్వాలలతో కూడిన ప్రతీకారాగ్ని రగిలింది. నమ్మకస్థులైన మరుదుసోదరుల రక్షణలో తన కుమార్తెతో కలసి అడవుల బాట పట్టింది నాచియార్. దిండిగల్ కోటలో ఆశ్రయం పొందిన ఆమె, మైసూరు సుల్తాన్ హైదర్ ఆలీతో సంప్రదింపులు జరిపి, తన దూరదృష్టి, వ్యూహాత్మక నైపుణ్యంతో పదివేల సైనిక బలగాల మద్దతును సాధించింది. తనకోసం ప్రాణాలర్పించిన ఉడైయాల్ స్మృత్యర్థం 'ఉడైయాల్ పడై' పేరుతో మహిళా దళాన్ని కూడా ఏర్పాటు చేసింది. రెండవ ఆంగ్లో-మైసూరు యుద్ధం సందర్భంగా శత్రువుల బలహీనతను ఆసరాగా చేసుకుని దాడికి వ్యూహం రచించింది.

1780 విజయదశమి రోజున, కేవలం స్త్రీలకు మాత్రమే ప్రవేశమున్న రాజరాజేశ్వరి ఆలయంలోకి 'ఉడైయాల్ పడై' మహిళాదళం భక్తుల వేషంలో ఆయుధాలతో ప్రవేశించింది. దళనాయకురాలు కుయిలి, శత్రువులు అక్కడ దాచివుంచిన ఆయుధ సామగ్రిని ధ్వంసం చేయడానికి తనకు తాను నిప్పంటించుకుని ఆయుధాగారంలోకి దూకింది. ఆమె ఆత్మత్యాగం శత్రువులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న నాచియార్ సైన్యం శివగంగను తిరిగి స్వాధీనం చేసుకుంది.

రాజ్యాన్ని పునరుద్ధరించిన తరువాత వేలు నాచియార్ తన కుమార్తె వెల్లాచ్చిని ప్రతినిధిగా నియమించి పాలన సాగించింది. కాలాంతరంలో మరుదుసోదరులతో తలెత్తిన విభేదాలు, రాజకీయ పరిణామాలు ఆమె మనస్సును తీవ్రంగా కలచివేశాయి. ఆ మనోవేదనతో ఆమె 1796 డిసెంబర్ 25న విరూపాక్ష కోటలో కన్నుమూసింది.

ఆమె రగిల్చిన స్వాతంత్ర్య కాంక్ష మరుదుసోదరులు, వీరపాండ్య కట్టబొమ్మన్ వంటి వీరుల నేతృత్వంలో 'పాలెగాళ్ళ ప్రజా తిరుగుబాటు'గా, 'దక్షిణ భారత సమాఖ్య పోరాటం'గా రూపాంతరం చెందింది. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి సుమారు ఎనిమిది దశాబ్దాలకు ముందే జరిగిన ఈ ప్రజా పోరాటానికి ఆద్యురాలు వేలు నాచియార్. సామ్రాజ్యవాద శృంఖలాలను సవాలు చేసిన ఆమె వీరత్వం జానపద స్మృతిపథంలో నేటికీ అమర సంస్మృతిగా వెలుగొందుతోంది. ప్రజల గుండెల్లో 'వీరమంగై' (వీరవనిత)గా ఆమె చిరస్మరణీయురాలిగా నిలిచింది. ❖

మానవజాతి శ్రేయస్సుకై పాటుపడండి!

"ఓ మానవుడా! ఆత్మవిశ్వాసం కలిగివుండు!" భగవంతునిపై విశ్వాసం కలిగే మార్గమిదే! నీవు ద్వైతివి కావచ్చు లేదా అద్వైతివి కావచ్చు; నీకు యోగశాస్త్రంపై లేదా శంకరాచార్యుల సిద్ధాంతంలో నమ్మకం ఉండొచ్చు. నీవు వ్యాస విశ్వామిత్రులలో ఎవరినైనా అనుసరించవచ్చు. కానీ, అది అంత ప్రాధాన్యమైన విషయం కాదు. ఈ విషయంలో భారతీయ దృక్పథం ప్రపంచ దేశాలన్నిటికంటే విభిన్నమైనది. ప్రపంచంలోని ప్రతిదేశంలోనూ, మతంలోనూ ఆత్మశక్తి నిర్లక్ష్యం చేయబడింది. కానీ, భారతీయులమైన మనం ఆత్మను శాశ్వతమైనదిగా భావిస్తాం. శాశ్వతమేగాక, దోషరహితమనీ, పరిపూర్ణత్వం గలదనీ భావిస్తాం. ఈ ఉపనిషద్వాక్యాలనే మనమెల్లప్పుడూ ప్రమాణంగా గ్రహించాలి.



జీవితంలో మీ మహత్తర కర్తవ్యాన్ని విస్మరించకండి. భారతీయులు విదేశీభావాలకు దాసులై మన మతపు ఆయువుపట్లనే పెకలించివేస్తున్నారు. ప్రస్తుతం మనమెందుకింత వెనుకబడివున్నాం? మనలో నూటికి తొంభైతొమ్మిది మంది విదేశీభావ ప్రభావాలకు ఎందుకు లోనై ఉన్నారు? మనం ఇతరజాతులతో తులతూగాలంటే, ఈ దోషాన్ని తొలగించాలి. మనం పురోభివృద్ధి చెందాలంటే పాశ్చాత్యుల నుండి నేర్చుకోవలసిన విషయాలు కూడా ఎన్నో ఉన్నాయి. వారినుండి మనం కళలను, శాస్త్రాలను నేర్చుకోవాలి. భౌతిక ప్రపంచ సంబంధాలైన శాస్త్రాలను మనం వారినుండి నేర్చుకొన్నట్లే, పాశ్చాత్యులు మతాన్ని ఆధ్యాత్మికజ్ఞానాన్ని నేర్చుకొని జీర్ణం చేసుకోవాలంటే మన దగ్గరికి రావలసిందే! హిందూమతస్థులమైన మనం ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువులమని దృఢంగా విశ్వసించాలి.

రాజకీయ హక్కులు మొదలైన వాటి కోసం మనం ఆందోళన చేస్తున్నాం. మంచిదే! హక్కులు, అధికారాలు మొదలైనవి స్నేహభావంచేత మాత్రమే పొందగలం. స్నేహభావమెప్పుడూ సమానుల మధ్యనే సాధ్యం. ఇద్దరిలో ఒకడు యాచకుడైతే వారిమధ్య స్నేహమెలా ఉంటుందో ఊహించండి. పరస్పర సహకారం లేకపోతే మనం గొప్పవారం కాజాలం. కాబట్టి యాచకులుగా కాక ధర్మోపదేశకులుగా పాశ్చాత్యదేశాలకు వెళ్ళండి.

ఇచ్చిపుచ్చుకునే ధర్మాన్ని మన శక్తిమేరకు ఆచరించాలి. ఐహిక జీవితాన్ని సుఖవంతంచేసే మార్గాలను, పద్ధతులను మనం వారినుండి నేర్చుకొన్నప్పుడు శాశ్వతముక్తి పొందే మార్గాలను మనం వారికి ఎందుకు బోధించరాదు? అన్నిటికంటే ముఖ్యంగా మానవజాతి శ్రేయస్సుకై ఎల్లప్పుడూ పాటుపడండి! ప్రతివాడూ మృత్యుముఖంలోకి ప్రవేశించటం నిజం. అయితే, ఈ మహత్తర చారిత్రక సత్యాన్ని గుర్తుంచుకోండి... 'భారతీయ వాఙ్మయంలో మూర్తీభవించి ఉన్న శాశ్వత సత్యాలను గ్రహించడానికి ప్రపంచంలోని అన్ని దేశాలు భరతమాత పాదాలను ఆశ్రయించ వలసిందే! ఆధ్యాత్మికతయే మన భరతజాతి వెన్నెముక!' ❖

ఒక వ్యక్తి ఎంత అత్యధికంగా సంపదను గడించవచ్చో పాశ్చాత్యులు తెలిపితే,
ఒక వ్యక్తి సర్వసంపదలను ఎలా త్యాగం చేయవచ్చో భారతీయులు తెలియజేశారు. - స్వామి వివేకానంద

మన ఇచ్ఛాశక్తికి స్వేచ్ఛ ఉందా?

– ప్రవ్రాజిక త్యాగనిష్ఠప్రాణ



ఏది తినాలనుకుంటే అది తినాలని, దేనిని చూడాలనిపిస్తే దానిని చూడాలని, ఏది చేయాలనుకుంటే అది చేయాలని కోరుకుంటాం. ప్రయత్నం చేస్తాం. సాధిస్తే తృప్తి పొందుతాం. అయితే 'అదే' పదార్థాన్ని తినాలనే, 'అదే' వస్తువును చూడాలనే, 'అదే' పనిని చేయాలనే కోరిక ఎక్కడి నుండి కలుగుతుంది? సంస్కారం నుండి కలుగుతుంది. సంస్కారం ఎక్కడి నుండి వస్తుంది? పదే పదే పునరావృతమైన అలవాట్ల నుండి వస్తుంది. ఈ అలవాట్లు ఎప్పటివి? జన్మ జన్మలవి. ఈ జన్మల పరంపరను నియంత్రిస్తున్నది ఏమిటి? ఒక అదృశ్యశక్తి! 'ఆ' సమయంలో 'అదే' పనిని చేయాలనే ప్రేరణను నియంత్రిస్తున్నది కూడా అదే శక్తి! అందుకే, నిజానికి ఆ శక్తి అధీనంలోనే అన్నీ జరుగుతున్నాయి. ఈ ప్రపంచం మొత్తం ఆ శక్తి పర్యవేక్షణలో కార్యకారణ నియమాలను అనుసరిస్తూ, కాలచక్రంలో నిరంతరం చలిస్తూ ఉన్నది. అందుకే చాలా సందర్భాలలో చేయాలనుకున్నదాని కోసం ప్రయత్నం చేసినా, దాన్ని పొందటంలో విఫలమవుతాం. కొన్ని సందర్భాలలో చేయకూడదనుకున్నదానిని సైతం ఎవరో ప్రేరేపించినట్లు అసహాయంగా చేస్తూ ఉంటాం. మరి మన ఇచ్ఛాశక్తికి నిజమైన స్వేచ్ఛ ఉందా? ఒకవేళ లేకపోతే 'మనకు స్వేచ్ఛ ఉన్నది' అనే భావన ఎలా కలుగుతున్నది, ఎందుకు కలుగుతున్నది? కొంచెం ఆలోచిద్దాం.

ఆర్థర్ షోపెన్‌హార్ అనే జర్మన్ తత్త్వవేత్త, మానవుని ఇచ్ఛాశక్తి గురించి మాట్లాడుతూ, 'మనిషి తాను కోరుకొన్నది చేయగలడు. కానీ, తన కోరికను మాత్రం నిర్ణయించలేడు' అంటారు. 'మనం మన ఇచ్ఛానుసారం ఒక పనిని చేస్తున్నాం అనుకున్నప్పటికీ, నిజానికి ఏదో ఒక శక్తి ప్రేరణతోనే మన ఇచ్ఛాశక్తి ఫలానా సందర్భంలో ఫలానా విధంగా పని చేస్తుంది' అంటారాయన! మనం ఒక విషయాన్ని ఎంపిక చేసుకున్నప్పుడు ఆ ఎంపిక వెనుక ఒక అదృశ్యశక్తి యొక్క ప్రేరణ దాగివుంది. 'ఆ' సమయంలో 'ఆ' విషయాన్నే ఎంపిక చేసుకొనే ప్రేరణ ఎక్కడి నుండి కలుగుతుంది? ఏదైనా కోరిక కానీ, ఆలోచన కానీ 'అదే' సమయంలో కలగాలని నిర్ణయిస్తున్నది ఎవరు? ఈ విషయాలు మన అధీనంలో లేవు. ఆలోచిస్తే ఏదో ఒక బృహత్ ప్రణాళిక ప్రకారం ఈ ప్రపంచం మొత్తం నడుస్తూ ఉంది అన్నది అర్థమవుతుంది. అందుకే 'అంతా లలాట లిఖితం' వంటి మాటలను తరచుగా ఉపయోగిస్తూ ఉంటాం.

మనసు – ఇచ్ఛాశక్తి

ఇచ్ఛాశక్తి అనేది ఆత్మశక్తికి అత్యంత సన్నిహితమైన శక్తి. ప్రాణశక్తి యొక్క అత్యున్నత అభివ్యక్తీకరణ. అది మనసు ద్వారా పని చేస్తుంది. అందువలన సంకల్ప, వికల్పాత్మకమైన మనసు ప్రభావంలో ఉన్నంతవరకు, అస్థిరమైన మానసిక ప్రవృత్తులన్నీ ఇచ్ఛాశక్తిని ప్రభావితం చేస్తాయి. మనసు యొక్క చంచలత్వం, రాగద్వేషాలు, భయాందోళనలు మొదలైన మలినాలు ఇచ్ఛాశక్తిపై పని చేస్తాయి. **మనసులో అచేతన అంశం ఎక్కువయ్యేకొలదీ ఇచ్ఛాశక్తి అచేతన స్థాయిలోనే పని చేస్తుంది. మనసు చైతన్యవంతమయ్యేకొద్దీ ఇచ్ఛాశక్తి స్వతంత్ర స్థాయిలో పని చేస్తుంది.** మన వ్యక్తిత్వంలో ఏ అంశమైనా చైతన్యానికి దగ్గరయ్యేకొలదీ, చైతన్యం యొక్క సత్తాను సంతరించుకుంటుంది. మనసు చంచలత్వం తగ్గేకొలదీ ఆత్మశక్తి దానిపై ప్రతిబింబిస్తుంది. రాగద్వేషాలకు, భయాందోళనలకు దూరమైన అటువంటి నిర్మల మనసుద్వారా ప్రసరించే ఇచ్ఛాశక్తి, నెమ్మది నెమ్మదిగా స్వతంత్రమవుతుంది.

ఇచ్ఛాశక్తి – స్వేచ్ఛ

ఇచ్ఛాశక్తికి ఉన్న పరిమిత స్వేచ్ఛను, శ్రీరామకృష్ణులు ఒక చక్కటి ఉదాహరణ ద్వారా వివరిస్తారు. ఒక ఆవుల కాపరి తన ఆవును గడ్డి మేయడానికి మైదానంలో ఒక రాటకు కట్టాడు. ఆ ఆవు నెమ్మది నెమ్మదిగా, అంచెలంచెలుగా ఆ తాడు పొడుగు ఉన్నంతవరకు ఉన్న గడ్డిని మేయగలుగుతుంది. సువిశాల మైదానంలో లెక్కించడానికి అలవికాని పచ్చిక ఉన్నప్పటికీ ఆ ఆవు స్వేచ్ఛ ఆ తాడు పొడవు ఎంత ఉందో అంత మాత్రమే! ఆ ఆవు తనకిచ్చిన పరిమిత స్వేచ్ఛను చక్కగా ఉపయోగించుకొని క్రమశిక్షణతో ఆ నియమిత ప్రాంతంలో ఉన్న పచ్చికనంతా మేసిన తరువాత, యజమాని కనికరించి తాడు పొడవును కొంచెం పెంచుతాడు. చివరికి తాడును పూర్తిగా విప్పి పూర్తి స్వేచ్ఛను ఇవ్వవచ్చు కూడా! అలాగే, భగవంతుడు మనకు పరిమిత స్వేచ్ఛను ఇచ్చాడు. ఆ స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటే, మరింత స్వేచ్ఛను ప్రసాదిస్తాడు. సద్వినియోగం చేసుకోవడం అంటే మనసు చంచలత్వాన్ని తగ్గించడం! మనసు నిశ్చలమయ్యే కొలదీ

ఆత్మతత్త్వానికి చేరువవుతుంది. ఆత్మసాక్షాత్కారం కలిగిన మనసు మాత్రమే పూర్తిగా స్వతంత్రమవుతుంది. శ్రీరామకృష్ణులు శుద్ధ మనసు, శుద్ధ ఆత్మ ఒక్కటే అని చెప్తారు. అంటే, మనసు నిర్మలమైనపుడు స్వతంత్రత అనే ఆత్మ నైజాన్ని మనసు సొంతం చేసుకుంటుంది. ఈవిధమైన మనసు నుండి జనించిన ఇచ్ఛాశక్తి సర్వస్వతంత్రమవుతుంది.

ఇచ్ఛాశక్తి స్వేచ్ఛకై మనం చేయాల్సింది ఏమిటి?

మనం తీసుకొనే నిర్ణయాలు, చేసే పనులు అనేక సందర్భాలలో నియంత్రణలేని ఆలోచనలపైనా, కోరికలపైనా, భావోద్వేగాలపైనా ఆధారపడి ఉంటాయి. రాగ ద్వేష భయాలకు, కోరికలకు దూరమైన మనసులో జనించిన ఇచ్ఛాశక్తి మాత్రమే అనన్య శక్తిసామర్థ్యాలను ప్రదర్శించగలుగుతుంది. సరైన సమయంలో సరైన నిర్ణయాలను తీసుకోగలుగుతుంది. జీవిత గమనాన్ని సరైన మార్గంలో తీర్చిదిద్దుతుంది. అందువలన మనం చేయాల్సింది ఏమిటి? మనసు యొక్క అచేతన అంశాన్ని క్రమేణా తగ్గించుకోవాలి. మనసును స్వప్రయత్నంతో సచేతనం చేసుకోవాలి. పరిశుద్ధం చేసుకోవాలి. మనసును ఒక పద్ధతిలో పరిశుద్ధం చేసుకోవడం ద్వారా మనిషి భావాలు, ఆలోచనలు, చేతలు అన్నీ క్రమశిక్షణను పొందుతాయి. ఈవిధంగా క్రమేణా ఇచ్ఛాశక్తి అపరిమిత శక్తిసంపన్నంగా మారుతుంది. మానసిక క్రమశిక్షణ ద్వారానే ఇది సాధ్యమవుతుంది. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో మనసును ఏవిధంగా నియంత్రించాలో బోధించారు.

సంకల్పప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః ।
మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥
శనై శ్శనై రుపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా ।
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥

– కోరిక అనే బీజానికి (అప్రయత్నంగా) ఇచ్ఛాశక్తి అనుసంధానం కావడం వలన జనించే సంకల్పాలను అన్నింటినీ సమూలంగా నాశనం చేస్తూ, బుద్ధితో అనుసంధానం అయిన ఇచ్ఛాశక్తి ద్వారా మనసేంద్రియాలను నియంత్రిస్తూ, ఏకాగ్ర చిత్తంతో మనసును స్థిరంగా ఆత్మయందు నిలపాలి. ఇక్కడ ధృతి అంటే ఇచ్ఛాశక్తి. సాత్త్విక, రాజసిక మరియు తామసిక ధృతి అనే మూడు రకాలుగా ధృతిని భగవద్గీత వర్ణించింది.

ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియక్రియాః ।
యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ ॥

– ఏ ఇచ్ఛాశక్తి ద్వారా మనసు, ప్రాణం, ఇంద్రియాలను నియంత్రించి అనన్య యోగసాధనకు ఏ ధృతి సహకరిస్తుందో అది సాత్త్వికధృతి. ఈ సాత్త్వికధృతి ద్వారానే మానవచరిత్రలో మహోన్నత కార్యాలు సిద్ధిస్తాయి.

'ప్రాణశక్తి యొక్క మహోన్నత అభివ్యక్తి మానవుని ఇచ్ఛాశక్తి' అంటారు స్వామి వివేకానంద. మనిషి సర్వస్వతంత్రుడు కావాలంటే తన భావాలు, ఆలోచనలు, చేష్టలు మూడింటికీ క్రమశిక్షణను ఇవ్వాలి. మానవ వ్యక్తిత్వంలో ముఖ్యమైన ఈ మూడు అంశాలను సత్యాన్వేషణకై నియోగించాలి. భావాలు పరిపక్వమై భగవంతునిపై భక్తినీ, ఆలోచనలు పరిపక్వమై సంపూర్ణ జ్ఞానాన్నీ, చేష్టలు పరిపక్వమై నిస్వార్థతనూ, పరోపకారాన్నీ సంతరించుకోవాలి. వీటినే భక్తి, జ్ఞాన, కర్మ యోగాలు అంటారు. ఈ మూడు యోగాలకు మూలం మానసిక క్రమశిక్షణ, వ్యక్తిగత ప్రక్షాళన. దీనినే రాజయోగం అంటారు. ఈ నాలుగు యోగాలను సమన్వయము చేసిన వారి ఇచ్ఛాశక్తి అనన్య శక్తిసామర్థ్యాలను ప్రదర్శించి, మానవాళి ప్రగతికి బాటలు వేస్తుంది.

ముగింపు

వాస్తవానికి జీవితంలో అన్నీ భగవదేచ్ఛతో జరుగుతున్నప్పటికీ, మనిషి సుఖదుఃఖ ద్వంద్వాల ప్రభావంలో ఉన్నంతవరకు ఇచ్ఛాశక్తికి స్వేచ్ఛ ఉన్నట్లు అనిపిస్తుంది. ఆ స్వేచ్ఛ అనే అపోహ మనిషి పరిణామం చెందడానికి దైవం ఏర్పాటు చేసినది. మానసిక పరిధుల మధ్య మనం సతమతమవుతున్నంతకాలం స్వప్రయత్నం చేస్తూనే ఉండాలి. ఈ ప్రయత్నంలో మనం అలసినపుడు, మానసిక శోధన ద్వారా మానసిక ప్రక్షాళన జరిగినపుడు ఏదో ఒక శుభక్షణంలో మనకు జ్ఞానోదయం కలుగుతుంది. అప్పుడు మాత్రమే అంతా భగవదేచ్ఛతో జరుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది.

శ్రీరామకృష్ణులు దీనికి ఒక చక్కని ఉదాహరణను ఇస్తారు. ఒక ఇంటి అరుగుపై నిద్రిస్తున్న ఒక నేతవాని దగ్గర, ఒక దొంగ తాను దొంగిలించిన ధనం మూటను పెట్టి వెళ్ళిపోతాడు. పోలీసులు నేతవాణ్ణి దొంగగా భావించి, అతనిని బంధించి న్యాయస్థానానికి తీసుకొనిపోయి దండించడం మొదలుపెడతారు. ఈలోపు ఒక వ్యక్తి పరుగున వచ్చి నేతవాడు నిర్దోషి అని న్యాయస్థానంలో వెల్లడిస్తాడు. అతణ్ణి అంతవరకు చితకబాదినవాళ్ళు పశ్చాత్తాపపడి అతనికి పాలు ఇస్తారు. ఆశ్చర్యపోయిన న్యాయమూర్తి అసలు ఏమి జరిగిందని నేతవాణ్ణి ప్రశ్నించినపుడు అతడు ఎవరినీ నిందించకుండా, "నేను రామేచ్ఛతో అక్కడ పడుకున్నాను. రామేచ్ఛతో ఒక దొంగ వచ్చి నా వద్ద ఒక మూట పెట్టి పారిపోయాడు. రామేచ్ఛతో నన్ను పోలీసులు ఇక్కడికి తీసుకొని వచ్చి కొట్టారు. రామేచ్ఛతో నాకు పాలు ఇచ్చారు" అని చెప్తాడు. ఇది అత్యున్నత స్థితి. ఈ స్థితి వచ్చే వరకు మనం స్వప్రయత్నం చేయాలి. ఇచ్ఛాశక్తి అసలు శక్తిని బహిర్గతం చేయడానికి మనసును సదా ప్రక్షాళనం చేసుకుంటూ ముందుకు సాగాలి. ❖

Om Namo Bhagavate Ramakrishnaya

భగవాన్ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయ నిర్మాణానికై విజ్ఞప్తి

రామకృష్ణ మిషన్ ఆశ్రమం, మొరాబాడి, రాంచీ, ఝార్ఖండ్ - 834008
ఈమెయిల్: ranchi.morabadi@rkmm.org www.rkmranchi.org

ప్రియమైన భక్తులు మరియు శ్రేయోభిలాషులకు నమస్కారములు!

1927లో స్థాపించబడిన మొరాబాడి రామకృష్ణ మిషన్ ఆశ్రమం గత 100 ఏళ్ళుగా ఆధ్యాత్మిక, విద్య, వైద్య, వ్యవసాయం మొదలైన కార్యక్రమాల ద్వారా సమాజానికి ఎనలేని సేవలందిస్తోంది.

ఈ ఆశ్రమం స్థాపించి సుమారు వంద సంవత్సరాలు (1927-2027) కావడంతో శ్రీరామకృష్ణుల ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. కాబట్టి, పెరుగుతున్న భక్తులు మరియు శ్రేయోభిలాషుల అవసరాల దృష్ట్యా విశాలమైన ఆలయం అవసరమై ఉంది. అందు నిమిత్తం 02.11.2025న శ్రీమత్ స్వామి సుబోధానందజీ మహరాజ్ తిథిపూజ రోజున శ్రీరామకృష్ణుల 'విశ్వజనీన దేవాలయ' నిర్మాణ కార్యం ప్రారంభమైంది.

నూతన ఆలయ విశేషాలు

- ఇది తూర్పు భారతదేశ వాస్తుశిల్ప సంప్రదాయాల స్ఫూర్తితో నిర్మించబడుతున్న 'నవరత్న' శైలి ఆలయం.
- 55 అడుగుల వెడల్పుగల, స్తంభాలు లేని ప్రార్థనామందిరం (26.64 మీ. x 17 మీ.)
- మెట్లతో పాటు ర్యాంప్ మరియు లిఫ్ట్ సౌకర్యాల ఏర్పాటు.
- ఆలయం రెండు అంతస్తులతో, మొత్తం 1,070 మంది (550+520) కూర్చునే సామర్థ్యం కలిగి ఉంటుంది.
- మొదటి అంతస్తు ధ్యానం, పూజ మరియు ఆధ్యాత్మిక సమావేశాల కోసం; గ్రౌండ్ ఫ్లోర్ 'వివేకానంద సాంస్కృతిక మందిరం' మరియు ఆశ్రమ వివిధ కార్యకలాపాల కోసం.
- ఆలయ (G+1) విస్తీర్ణం సుమారు 20,000 చదరపు అడుగులు.

ఈ ఆలయ నిర్మాణ అంచనా వ్యయం సుమారు 10 కోట్ల రూపాయలు.

మీరిచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80G కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. అన్ని విరాళాలు కృతజ్ఞతతో స్వీకరించబడతాయి మరియు వాటికి రసీదు ఇవ్వబడుతుంది.

రూ. 10,000/- లేదా అంతకంటే ఎక్కువ విరాళం ఇచ్చే భక్తులకు 'శ్రీరామకృష్ణుల ఆశీస్సులు'గా ఒక ధ్రువీకరణ పత్రం అందజేయబడుతుంది. రూ. 1,00,000/- లేదా అంతకంటే ఎక్కువ విరాళం ఇచ్చే దాతల పేర్లు లేదా వారి బంధువుల పేర్లు ఆలయ శిలాఫలకంపై చెక్కబడతాయి మరియు వారికి జ్ఞాపిక బహూకరించబడుతుంది.

విదేశాలకు చెందిన దాతలు FCRA బ్యాంక్ వివరాల కోసం మాకు ఈమెయిల్ చేయవలసిందిగా కోరుతున్నాం.

గమనిక: ఆన్‌లైన్ ద్వారా విరాళం పంపిన తర్వాత, మా అకౌంటింగ్ అవసరాల కోసం దాతలు తమ పేరు, చిరునామా, పాన్ నెంబర్, విరాళ మొత్తం, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడి మరియు దేని నిమిత్తం ఇచ్చారో పేర్కొంటూ మాకు ఈమెయిల్ లేదా ఉత్తరం ద్వారా తెలియజేయవలసిందిగా కోరుతున్నాం.

ఈ పవిత్ర కార్యానికి మీరు అందించే సహకారం ఎంత చిన్నదైనప్పటికీ, రాబోయే తరాలకు ఒక ఆధ్యాత్మిక నిలయాన్ని నిర్మించడంలో సహాయపడుతుంది. ఈ 'మహాయజ్ఞం'లో భాగస్వాములు కావాలని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం.

ధన్యవాదాలు!

భగవత్సేవలో...
స్వామి భవేశానంద

ఈ క్రింది అకౌంట్ వివరాలు భారతదేశంలోని దాతలకు మాత్రమే.

మమ్మల్ని సంప్రదించండి:
9835158707
8252910732

Account Name:	Ramakrishna Mission Ashrama
Account Number:	50200081665283
Bank & Branch:	HDFC Bank, Morabadi, Ranchi
IFSC Code:	HDFC0007443
Donation Link:	https://bit.ly/Donation-RKMA

లోకరీతి...విదురనీతి!

- చైతన్య

పంచమవేదంగా కీర్తించబడే మహాభారతంలో ఆణిముత్యం లాంటి ఘట్టం 'విదురనీతి'. మానవ నడవడికను తీర్చిదిద్దే ఎన్నో అమృతవాక్కుల్ని విదురుడు ధృతరాష్ట్రుడికి వినిపించాడు. తన అన్నకు ఆత్మపరిశీలన చేసుకునే అవకాశాన్ని కల్పించాడు. సౌశీల్యానికి నిలువుటద్దమైన విదురుడు ఆనాడు చెప్పిన నైతిక విలువలు, ధర్మసూక్ష్మాలు నేటికీ ఆచరణీయమే! లోకరీతిని ప్రస్తావిస్తూ సన్మార్గాన్ని నిర్దేశించే ఈ 'విదురనీతి' ప్రతి ఒక్కరికీ శిరోధార్యమే! అలాంటి గ్రంథ పేటికలో ఓ ఆణిముత్యం ఈ పద్యం. ధర్మమూర్తి అయిన విదురుడు అన్న ధృతరాష్ట్రుడికి గృహస్థుడి కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ...

వారిని గౌరవించినప్పుడే...

'ఏలినవానిని దైవము
నాలిని బంధులను సముచితారాధన సం
శీలతఁ బ్రీతులఁ జేయని
పాలసుఁడా ఫలము లాసపడు మనుజేంద్రా!

– రాజా! రాజునూ, దైవాన్నీ, భార్యనూ, బంధువులనూ తగినరీతిలో గౌరవించి సంతోషింపజేయని మూఢుడు ఏ సత్ఫలితాలు ఆశించగలడు?' అని విస్పష్టం చేస్తున్నాడు. 'పాలసుడు' అంటే మూర్ఖుడు.

లౌకికజీవనంలో విజయవంతంగా ముందుకు సాగాలి అనుకునేవారు ఎలా వ్యవహరించాలో పరోక్షంగా విదురుడు ఈ పసిడి పలుకుల ద్వారా తెలియజేశాడు. ఆయన చెప్పిన హితవాక్యాల్లో మొదటి రెండు మానవుడి బాహ్యపరిధికి, తరువాతి రెండు ఆంతరంగిక పరిధికి సంబంధించినవి. ప్రాపంచికంగా, పారమార్థికంగా మనిషి పురోగతి సాధించాలంటే... సామాజిక బాధ్యతల్ని, ఆంతరంగిక సాధనల్ని సమాంతరంగా నిర్వర్తించాలని విదురుడు అన్యాపదేశంగా ఈ మాటల్లో ప్రస్ఫుటం చేస్తున్నాడు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తూ, సంఘజీవిగా తన కర్తవ్యాల్ని సక్రమంగా నిర్వర్తించని వ్యక్తిని మూర్ఖుడిగా నిర్వచిస్తున్నాడు.

రాజు... దైవం...

ఏలినవానిని అంటే మనల్ని పరిపాలించేవారిని, లోకాన్ని ఏలే దైవాన్ని... ఇద్దరినీ సంతోషపరిచే రీతిలో నడచుకోవాలని విదురుడు సూచిస్తున్నాడు. రాజును గౌరవించడాన్ని మన ఆధునిక సమాజానికి అన్వయించుకుంటే ప్రభుత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించటం! ఆ నియమాలకు అనుగుణంగా జీవనాన్ని గడపటం ప్రతి పౌరుడి ప్రథమ కర్తవ్యం. హక్కుల కన్నా ముందు బాధ్యతలపై దృష్టిపెట్టడం ముఖ్యం. అలాగే మన పనులకు పటిమనిచ్చేది పరమాత్మ శక్తి అని మరచిపోకూడదు. ఇక దైవాన్ని సంతోషపరచటమంటే, ధార్మిక జీవనాన్ని గడపటం. 'ధర్మోల్లంఘన దైవోల్లంఘన' అంటోంది మన సనాతన ధర్మం. ధర్మబద్ధంగా జీవించేవారికే దైవబలం అండగా ఉంటుంది. అందుకే, 'ధార్మికుణ్ణి భగవంతుడు ఎన్నడూ, ఏ స్థితిలోనూ అవమానం పాలు కానివ్వడు. అతడు అందరిలోనూ గెలుస్తాడు' అనేవారు శ్రీరామకృష్ణులు.



భాగస్వామి...బంధుగణం

గృహిణి సంతోషంగా ఉంటే గృహం సంతోషంగా ఉంటుంది. ఆ భావనతోనే విదురుడు ఇంటి యజమాని అయిన భర్త, భార్యను సంతోషంగా ఉంచాలని సూచిస్తున్నాడు. భర్త జీవితాన్ని సార్థకం చేసేది, అతని ఆనందానికి ఆధారభూతురాలయ్యేది భార్యేనంటోంది మన సనాతన ధర్మం. అంతేకాదు...

'స్త్రియో దేవాః స్త్రియః పుణ్యాః స్త్రియ ఏవ విభూషణమ్ ।
స్త్రీ ద్వేషో నైవ కర్తవ్య స్తాసు నిన్దాం ప్రహారకమ్ ॥

– స్త్రీలు దేవతాసమానులు. పుణ్యమూర్తులు. సమాజానికి అలంకారాలు. వారిని ఎన్నడూ ద్వేషించడం, దూషించడం, దండించడం తగదు' అని పునరుద్ఘాటించింది. మహిళామణులు కూడా ఆ గౌరవాన్ని కాపాడుకునేలా మసలుకోవాలని హితవు పలికింది. దంపతులైనవారు అన్యోన్యంగా ఉన్నప్పుడే ఇల్లు ప్రశాంత నిలయమవుతుంది. అలాగే అతిథి, బంధుసేవ గృహస్థులకు పుణ్యాన్ని ప్రసాదిస్తుంది. అలా కాకుండా 'బంధువులు ఎవరి ఇంటి నుంచి ఆశాభంగంతో వెళ్ళిపోతారో వారికి తమ పాపం ఇచ్చి వారి పుణ్యం తీసుకొని మరలుతారు' అంటాడు భృగు మహర్షి ❖

తల్లితండ్రులు, వృద్ధులు, గురువులు, సాధువులు, భార్యాబిడ్డలు... మొదలైనవారిని ఆదుకొని రక్షించనివాడు బ్రతికి ఉన్నా చచ్చినవాడితో సమానం. - శ్రీకృష్ణుడు

చేతులు కట్టుకు కూర్చునేకంటే...

– అమిరపు నటరాజన్

ఒక మూర్ఖుడు ఎవడో తాబేలును చంపబోతున్నాడట! వాడు దాని డిప్ప మీద ఎంత గట్టిగా కొట్టినా దానికి దెబ్బ తగలడం లేదు. ఆ దారిన పోతున్న మరొకడు, 'దాన్ని తిప్పి ఒక్క దెబ్బ కొడితే అదే చస్తుంది! అయినా నాకెందుకులే ఆ పాపం!' అంటూ వెళ్ళిపోయాడట! 'నాకెందుకులే ఆ పాపం' అన్నంతమాత్రాన ఆ తాబేలు చావులో ఆ వ్యక్తి ప్రమేయం లేకుండా పోతుందా?

'పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ, తననెవరూ చూడటం లేదనుకుంటుంది!' అని సామెత. చేస్తున్న పనిని గురించి ఇతరులకు తెలియకుండా ఉండటమనేది చాలామంది లక్ష్యం. అయితే ఇతరులకు తెలిసినా తెలియకపోయినా, చేస్తున్న పనికి ఫలితం ఉండదా? 'నీకు చట్టం గురించి తెలియనంత మాత్రాన, నువ్వు చేసిన నేరం శిక్షార్హం కాకపోదు' అని అంటారు. అంటే, తాను అమాయకుడినని చెప్పినంతమాత్రాన నేరం, నేరం కాకుండా పోదు.



ఒక బ్రాహ్మణుడు ఒక తోటను పెంచి, రాత్రింబవళ్ళు దానిని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉంటున్నాడు. ఒకరోజు, ఒక ఆవు ఆ తోటలో ప్రవేశించి, అతనెంతో ప్రీతితో పోషిస్తూ వచ్చిన ఒక మామిడి అంటును తినేసింది. తనకెంతో ప్రియమైన ఆ మొక్కను ఆవు మేయడం చూసి, బ్రాహ్మణుడు కాలరుద్రుడై ఒక బడితె తీసుకొని దాన్ని బాదాడు. ఆ దెబ్బలకు అది చనిపోయింది. ఆ వార్త నలువైపులా వ్యాపించింది. ఈ బ్రాహ్మణుడు తాను వేదాంతినని చెప్పుకునేవాడు. గోహత్యాపాతకం తనకు చుట్టుకున్నదని ఎవరైనా అంటే చాలు, అతడు ఇలా చెప్పేవాడు: 'లేదు, నేను గోహత్య చెయ్యలేదు. ఆ పని చేసింది నా చెయ్యి. చేతికి అధిష్ఠాన దేవత ఇంద్రుడు. కాబట్టి ఆ గోహత్యాపాతకం ఇంద్రునిదే గాని నాది కాదు!'

స్వర్గంలోని ఇంద్రుడు ఈ మాటలు విన్నాడు. ఆయన ఒక వృద్ధబ్రాహ్మణుడి వేషంలో తోటలో ఉన్న ఈ బ్రాహ్మణుడి దగ్గరకు వచ్చి ఇలా ప్రశ్నించాడు: 'అయ్యా! ఈ తోట ఎవరిదండీ?' బ్రాహ్మణుడు, 'నాది' అన్నాడు. ఇంద్రుడు, 'ఇది ఎంత చక్కని తోట! చాలా నేర్పుగల తోటమాలి మీకు దొరికి ఉంటాడు. చూడండి! మొక్కలను ఎంత సొగసుగా, ఎంత నైపుణ్యంతో నాటాడో!' అన్నాడు. ప్రశంసలు విన్న బ్రాహ్మణుడు, 'తోటమాలిదేమీ లేదండీ! ఇదంతా నా పనే! మొక్కలన్నింటినీ నేనే స్వయంగా పరీక్షించి, స్థలం కూడా నేనే నిర్ణయం చేసి, నేనే పాతించాను' అని గర్వంగా చెప్పాడు. 'అలాగా! చాలా చక్కగా పాతించారే! ఇక్కడ ఈ త్రోవ ఎవరు వేయించారు? చాలా అందంగా నిర్మించారే!' అన్నాడు ఇంద్రుడు. బ్రాహ్మణుడు, 'అంతా నేను చేసిందే!' అని గొప్పగా చెప్పాడు. అప్పుడు ఇంద్రుడు అతణ్ణి ఘాటుగా విమర్శిస్తూ, 'ఈ పనులన్నీ నావేననీ, ఈ తోట ఘనత అంతా నాదేననీ చెప్పుకుంటున్నావు గదా! కానీ, ఆవును చంపిన పాపం మాత్రం ఇంద్రుడికి అంటగట్టడం చాలా అన్యాయం సుమా!' అని పలికాడు.

మనుష్యులు గొప్పవిగా కనిపించే వాటిని తమ ప్రజ్ఞగా చెప్పుకుంటారు. కానీ, తాము చేసే పొరపాట్లకూ, పాపాలకూ కారణాలనూ, బాధ్యతనూ ఇతరుల మీదకో, అది కుదరకపోతే దైవం మీదకో నెడతారు. అందుకే స్వామి వివేకానంద ఇలా అన్నారు: **"మనుష్యులు సాధారణంగా జీవితంలో ఎదురయ్యే కష్టాలకు తోటివారిని నిందిస్తారు. అది కుదరకపోతే, భగవంతుణ్ణి నిందిస్తారు. అది కూడా కుదరకపోతే తమ తలరాత, విధివ్రాత అనే పేరు పెట్టి ఒక భూతాన్ని సృష్టిస్తారు. విధి అంటే ఏమిటి, అది ఎక్కడుంది? మనం ఏది నాటతామో ఆ పంటే తీస్తాం. మన విధివ్రాతను రాసుకునేది మనమే! మన కష్టాలకు వేరెవరినీ నిందించనవసరం లేదు, మన సుఖాలకు వేరెవరినీ పొగడవలసిన పనిలేదు!"**

చాలాసార్లు మనం పనులు చేయడం మానేయడానికి కారణం... వాటి నుంచి వచ్చే ఫలితాలు మనకు నచ్చే విధంగా ఉండవనో, లేకపోతే నలుగురూ మెచ్చుకునే విధంగా ఉండవనో తోచడమే! అర్జునుడు కూడా యుద్ధం చేయటం మానేద్దామనుకోవడానికి కారణం అదే కదా! "బంధువులందరూ చనిపోతారు. వీళ్ళందరినీ చంపితే పాపం కదా! వీళ్ళందరూ తమ లోభం వల్ల తమ బంధువుల్ని (మనల్ని) చంపడానికి సిద్ధంగా ఉన్నారు!! అయినా సరే, మనం కూడా తెలిసి తెలిసి అదే పని చేయడం ఎందుకు? ఇంతమంది చనిపోతే, ప్రపంచంలో నేరాలు, ఘోరాలు పెరిగిపోతాయి! సామాజిక వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతుంది"... ఇలా అర్జునుడు అనేక సాకులు చెప్పుకుంటూపోయాడు. కానీ, వాళ్ళందరూ పరమ దుర్మార్గులు, ఆకతాయిలు. వాళ్ళను చంపకుండా వదిలితే మరి లోకం సుఖంగా ఉంటుందా? మానేద్దామనుకుంటే చాలా? దాని పరిణామాలు ఎలా ఉంటాయో ఆలోచించవద్దా? ఒక క్షత్రియుడిగా, దేశాన్ని పరిపాలించే రాజుగా లోకకంటకులైన వారిని ఉపేక్షించడం సబబేనా?

శాంతి, అహింస అంటూ అటువంటి కొంపచెరుపులను వదిలిపెడితే, దాని పర్యవసానాలు ఎలా ఉంటాయి? 'నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ!' అన్నప్పుడు శతకకారుడు వేళాకోళమాడుతున్నాడన్నది సుస్పష్టం. జీవితంలో అలాంటిది అసలు కుదరదు.

"మీరు చేసే ప్రతీ 'పనికిమాలిన పని'కీ, మీరు ఏదోవొక మూల్యం చెల్లించక తప్పదు. మీరు ఏమీ చేయకుండా కూర్చుంటే, దానికి కూడా మూల్యం చెల్లించక తప్పదు. మీరు ఎంత వెల చెల్లించాలో కూడా మీ చేతుల్లో ఉండదు. చేయడమో, చేయకపోవడమో – ఈ రెంటిలో ఏదో ఒక విషయాన్ని మాత్రమే మీరు ఎంచుకోగలరు, అంతే!" అంటాడు జోర్డాన్ పీటర్సన్ అనే ఆధునిక మనస్తత్వవేత్త.

భగవద్గీతలో చెప్పినట్లు, కర్మ ఏదో, కర్మ కానిదేదో కనిపెట్టడం చాలా కష్టం. కానీ కర్మ చేసినా, కర్మ చేయకపోయినా (అంటే అకర్మకు) కూడా మనిషి తగిన వెల చెల్లించక తప్పదు. ఈ భూమి మీద మనుగడ అనేదే విషం లాంటిదైతే, తప్పుకుని పారిపోవడం వల్లనో, కుక్కినపేనులాగా పడివుండటం వల్లనో దాని నుండి తప్పించుకోలేం. అలాకాక, ఒళ్ళు దగ్గరపెట్టుకుని, ఏది ధర్మమో తెలుసుకుని, దానిని చేయడం ద్వారా జీవితానికి పరమార్థమేమిటో దాన్ని సాధించగలుగుతాం.



భగవద్గీతలో శ్రీకృష్ణుడు... 'న హి
కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥
– ఎవరు కూడా ఒక్క క్షణం కూడా కర్మను ఆచరించకుండా ఉండలేరు. నిజానికి, అన్ని ప్రాణులు తమతమ ప్రకృతి సహజమైన స్వభావాలచేత (త్రిగుణములచేత) ప్రేరణ పొంది కర్మలు చేయవలసి ఉంటుంది' అని ఉపదేశించాడు. కాబట్టి చేతులు ముడుచుకు కూర్చోవడమనేది సమాధానం కాదు.

మనుష్యులకు ఎదగడం ఇష్టం ఉండదు. చాలామంది, 'చిన్నతనమే హాయిగా ఉండేదండీ!' అంటూ ఉంటారు. ఎందుకంటే, చిన్నతనంలో మనం చేసిన పనులకు మనం బాధ్యత వహించవలసిన అవసరం లేదు. చిన్నతనంలో చాలాసార్లు మనం చేసిన పనులకు పర్యవసానాలు ఏమిటో మనకు అర్థం కాదు కూడా! అలా అర్థం కాని అజ్ఞానమే మనకు ఆనందంగా ఉంటుంది. కానీ, అటువంటి 'చిన్ననాటి అజ్ఞానపు స్వర్గం' అంతమైపోవడమే మనం ఆధ్యాత్మికంగానూ, మానసికంగానూ పెద్దవాళ్ళమయ్యామనడానికి చిహ్నం. మరొక కోణంలో చూస్తే, పెద్దవాళ్ళమయ్యామంటే దానికి అర్థం మన జీవితం కొంతకాలానికి ముగిసిపోతుందనీ, చేసిన పనులకు ఖచ్చితంగా ఫలితం వచ్చి తీరుతుందనీ అర్థం చేసుకోవడమే! అర్జునుడు యుద్ధరంగంలో ఈ విషయాన్ని అర్థం చేసుకునే యుద్ధానికి సిద్ధమయ్యాడు.

'హతోవా ప్రాప్స్యసే స్వర్గం, జిత్వావా భోక్ష్యసే మహీమ్!' "మరణిస్తే స్వర్గానికి పోతావు (అంటే, మరింత మంచి జన్మను పొందుతావు), గెలిస్తే ఇప్పుడే రాజ్యలక్ష్మిని చేపడతావు అని చెప్పి, ఏది చేసినా ఏదోవొక కర్మఫలితం తప్పదు! కాబట్టి లేచి నిలబడు. యుద్ధం చెయ్యి!" అని బోధించాడు కృష్ణుడు. "అలాగని యుద్ధం చేయకుండా ఉండిపోతే నీ వ్యక్తిత్వం, శీలం నాశనమవుతాయి. శత్రువులు నిన్ను పిరికివాడవంటూ పరాభవిస్తారు. పరువుగా బ్రతికేవాడికి పరువు పోవడం కంటే మరణమే మేలు కదా! నీ కర్తవ్యాన్ని విడిచి పారిపోవడానికి మించిన పాపం లేదు!" అని కూడా కృష్ణుడు ఉద్బోధించాడు. ఏదైతే తన కర్తవ్యమో, ఆ పని చేసినా, చేయకపోయినా వచ్చే ఫలితానికి తానే నైతిక బాధ్యత వహించాలి. చేతులు ముడుచుకుని కూర్చోవడం వల్ల వచ్చే ఫలితాలు కూడా తప్పకుండా తన నెత్తిమీదే పడతాయన్న జ్ఞానోదయమే అర్జునుడిని యుద్ధరంగంలోకి నడిపించింది.

స్వామి వివేకానంద కేవలం కర్తవ్యం గురించి మాత్రమే మాట్లాడకుండా, దాని ప్రస్తావనలో మనం మాటిమాటికీ నిందించే భగవంతుడి యొక్క పాత్ర ఏమిటో కూడా వివరించారు: "భగవంతుడి యొక్క వెచ్చని సూర్యకాంతి బలవంతుల మీదనే కాక బలహీనుల మీద కూడా పడుతుంది. భగవంతుడి యొక్క హాయిగొలిపే కొండగాలులు సాధువుల మీద ఎంతగా వీస్తాయో, పాపుల మీద కూడా అంతగానే వీస్తాయి. భగవంతుడు అందరికీ ప్రభువు. అందరికీ తండ్రి. కరుణామయుడు. నిష్పక్షపాతి. ఈ ప్రపంచంలోని చిల్లరమల్లర విషయాలన్నిటినీ అవేవో కొంపలు మునిగిపోయే విషయాలలాగా మనం పట్టించుకుంటున్నట్లు భగవంతుడు కూడా పట్టించుకుంటాడనుకుంటున్నారా? అలా అనుకుంటే, భగవంతుని గురించి అది ఎంత దిగజారుడు అవగాహన అయివుంటుందో గమనించండి. మనమందరం ఈ భూమి మీద కుక్కపిల్లల లాగా జీవన్మరణ పోరాటంలో సతమతమవుతూ ఉంటే, భగవంతుడు కూడా అంతే తెలివితక్కువతనంతో మనం చేస్తున్న పనులన్నింటినీ చూసి ఆందోళన చెందుతున్నాడనుకుంటున్నారా? కుక్కపిల్లల ఆటలు, వాటి అరుపులు, కరుపులు ఉత్తుత్తివేనని ఆయనకు తెలియదా? కాబట్టి, భగవంతుడు శిక్షిస్తాడనో, లేకపోతే మనం చేసిన పనులకు మంచి ఫలితాన్ని

(మిగతా 32వ పేజీలో...)

భారతదేశంలో ప్రతివాడూ నాయకుడు కావాలనే ఆశిస్తుంటాడు. సేవకుడిగా ఉండటానికి ఎవడూ ఇచ్ఛగించడు. శాసించడానికి ముందు సేవకుడిగా ఉండటం నేర్చుకోవాలి. - స్వామి వివేకానంద

ఐఏఎస్ లక్ష్యంగా యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే పొలిటికల్ సైన్స్ విద్యార్థులను తరచూ ఓ ప్రశ్న అడుగుతూ ఉంటారు. దేశాభిమానానికి (నేషనలిజమ్), దేశభక్తికి (పేట్రియాటిజమ్) మధ్య భేదం ఏమిటో నిర్వచించమంటారు. దేశాభిమానం, దేశభక్తి... అన్న పదాలు వినటానికి రెండూ ఒకేలా అనిపించినా, నిశితంగా విశ్లేషిస్తే రెండు భావాలకూ ఎంతో వ్యత్యాసముంది. మొదటిది కేవలం మాతృభూమిపై ఉద్రేక ఉద్వేగాలతో కూడిన అభివ్యక్తీకరణ. రెండవది బాధ్యతాయుతమైన స్పందన. దేశాభిమానంలో కించిత్తు స్వాతిశయం, డాంబికం వ్యక్తమవుతాయి. దేశభక్తిలో సాత్త్విక దృక్పథం, వాస్తవిక అవగాహన కనిపిస్తాయి. స్థూలంగా విశ్లేషిస్తే నిజమైన దేశభక్తులకు ఉండాల్సిన ఆరు ప్రధాన లక్షణాలు... 1. *Inclusive love* (కలుపుగోలు ప్రేమపూర్వక స్వభావం), 2. *Critical thought* (విమర్శనాత్మక దృక్పథం), 3. *Civic responsibility* (పౌరసత్వ బాధ్యత), 4. *Respect to others* (ఇతరులను గౌరవించడం), 5. *Value-based* (విలువలతో కూడిన జీవనం) 6. *Non-violent* (అహింస) అని సామాజికవేత్తలు అభిప్రాయపడతారు. ఏ దేశప్రజల్లోనైతే దేశాభిమానం దేశభక్తిగా పరిణతి చెందుతుందో, ఆ సమాజం మాత్రమే పురోభివృద్ధి వైపు పయనిస్తుంది. అందుకే స్వామి వివేకానంద ఓ ప్రసంగంలో ఇలా అన్నారు: "భారతీయులారా! దేశభక్తిని ఆచరణలో చూపండి. త్యాగమే మన జాతి ఆదర్శం. దేశప్రజలకు సేవ చేయటమే నిజమైన దేశభక్తి! కపటం, మోసం, కుతంత్రం, అవినీతి అణుమాత్రం ఉన్నా నీవు దేశభక్తుడవు కావు."

మనం దేశభక్తులమేనా?

– బి. సైదులు

ప్రేమభావన... సద్విమర్శ...: తరతమభేదాలు లేకుండా ప్రతి ఒక్కరితో ప్రేమగా ప్రవర్తించలేని దేశభక్తిలో సత్యం లేదు. కానీ దురదృష్టవశాత్తూ నేడు మనలో చాలామంది అనేక సందర్భాల్లో జాతి, కుల, ప్రాంతీయ భేదాలను సృష్టించుకుంటూ కక్షలూ కార్పణ్యాలతో రగిలిపోతూ ఉంటారు. అవకాశాన్ని కల్పించుకొని మరీ సాటి మనిషిపై ద్వేషమనే విషాన్ని చిమ్ముతూ ఉంటారు. మనం పాఠశాలల్లో ఉదయాన్నే వల్లెవేసిన 'భారతదేశం నా మాతృభూమి... భారతీయులందరూ నా సహోదరులు' అన్న వాక్యాల్ని పాఠ్యపుస్తకాలకే పరిమితం చేస్తూ ఉంటాం. ఇలాంటి దారుణ మనస్తత్వాలతో మనం ఎన్నటికీ దేశభక్తులం కాలేం!

'భిన్నత్వంలో ఏకత్వం' భారతీయ నినాదం. కానీ బాధాకరంగా నేడు మన ధోరణి 'ఏకత్వంలో భిన్నత్వం' అన్నట్లుగా పరిణమించింది. అలాగే, దేశభక్తులకు ఉండాల్సిన మరో గొప్ప లక్షణం ఆత్మవిమర్శ. లోపాలను అంగీకరించి వాటిని సరిదిద్దుకునే విశాల దృక్పథం. తన బావియే సముద్రమనుకునే మండూక మనస్తత్వం నుంచి ఉన్నతంగా ఎదగటం! మనిషి తనలోని బలహీనతల్ని గుర్తుపట్టడం ద్వారానే బలోపేతుడవుతాడు. మితిమీరిన దురభిమానంతో మనలోని దోషాల్ని కూడా సమర్థించుకుంటూ, దానిని దేశభక్తిగా చాటుకోవటం మూర్ఖత్వం. సద్విమర్శను హుందాగా స్వీకరించి ఆత్మపరిశీలన చేసుకోని జాతి పతనం అనివార్యం. అందుకే 'మనసులో ధైర్యం, పొరపాట్లను అంగీకరించే ధీరత్వం, హృదయంలో ప్రేమ ఉన్నవాళ్ళే సమాజాన్ని ముందుకు తీసుకువెళతారు' అనేవారు భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్.

పౌరసత్వ స్పృహ.. పరులపై గౌరవం...: మనదేశానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త స్వామి రామతీర్థ. ఆయన స్వామి వివేకానంద మార్గంలో భారతీయ సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని పాశ్చాత్య దేశాల్లో చాటిచెప్పిన సిసలైన దేశభక్తుడు. వారు ఓసారి జపాన్‌లో పర్యటిస్తున్నప్పుడు అక్కడి ట్రైన్‌లో ప్రయాణించసాగారు. మధ్యలో ఆకలై ఎక్కడైనా పండ్లు దొరుకుతాయేమోనని చూశారు. స్టేషన్‌లో ఆగినప్పుడు ప్లాట్‌ఫాం మీద ఎక్కడా ఫలాలు లభించలేదు. మరో రెండు, మూడు స్టేషన్లలో బండి ఆగినా నిరాశే ఎదురైంది. ఇదంతా తోటి ప్రయాణికుడైన జపాన్ యువకుడు గమనిస్తూ ఉన్నాడు. ఈసారి ఓ స్టేషన్‌లో ట్రైన్ ఆగీ ఆగకముందే ఆ కుర్రాడు రివ్వున స్టేషన్ బయటకు పరుగెత్తాడు. కొన్ని పండ్లు తీసుకొచ్చి స్వామి రామతీర్థకు ఇచ్చాడు. స్వామి రామతీర్థ డబ్బులివ్వబోతుంటే ఆ యువకుడు సున్నితంగా తిరస్కరిస్తూ, 'సార్! డబ్బులు వద్దు. మీరు భారతదేశానికి తిరిగి వెళ్ళాక, జపాన్‌లో కనీసం పండ్లు కూడా లభించలేదని అనకుండా ఉంటే అదే నాకు మీరిచ్చే ప్రతిఫలం' అన్నాడట! ఆ ఉదంతాన్ని స్వామి రామతీర్థ భారతదేశానికి వచ్చాక ఓ సమావేశంలో ప్రస్తావించారు.

'ఆ యువకుడి దేశభక్తికి ముగ్ధుడినైపోయాను. అలాంటి దేశభక్తినే మనం పెంపొందించుకోవలసి ఉంది! దేశభక్తి రెండు రకాలు. మొదటిది రియల్ పేట్రియాటిజమ్. రెండవది లిప్ పేట్రియాటిజమ్. మాటల్లో దేశభక్తిని ప్రకటించటానికి, చేతల్లో దానిని వ్యక్తపరచటానికి ఎంతో తేడా ఉంది' అని వారు అభిప్రాయపడ్డారు. ఆ జపాన్ యువకుడిలా మనలో ఎంతమందిమి దేశగౌరవాన్ని పెంచేలా నడచుకుంటున్నాం? దానికి బదులు చాలా సందర్భాల్లో అవమానకరంగా... మనమే దేశ ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నాం. మన స్వార్థ ప్రయోజనాల కోసం దేశ గౌరవాన్ని పణంగా పెడుతున్నాం. దేశభక్తి అంటే పౌరసత్వ బాధ్యతల్ని పాటించటమేనన్న విషయాన్ని విస్మరిస్తున్నాం. మనం, మన కుటుంబం బాగుంటే చాలు! దేశం ఏమైపోయినా ఫరవాలేదన్నట్లు ఉంటుంది మన వైఖరి. మనం నీతినియమాలు పాటించకుండా, అవినీతి రహిత సమాజాన్ని కాంక్షించడం అత్యాశే అవుతుంది.

విలువలే ఊపిరిగా... అహింసే పరమధర్మంగా...: 'మన దుఃస్థితికి కారణం మనలోని ద్వంద్వ ప్రమాణాలే (డబుల్ స్టాండర్డ్). మనం చెప్పే ధర్మాలకు, ఆచరించే పనులకు సంబంధమే ఉండటం లేదు' అంటారు ఓ ప్రముఖ సాహితీవేత్త. ఆలోచనలు, మాటలు, చేతలు ఏకరీతిలో ఉన్నట్లయితే, అది మనిషిలోని ఆత్మశక్తిని జాగృతం చేస్తుంది. అలాంటి విలువలతో కూడిన మనుషులే దేశానికి బలం, బలగం. మాటలకు, చేతలకు పొంతన లేనివారు దేశభక్తులనిపించుకోవటానికి అర్హులే కారు.

అవి సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలు ఉధృతంగా నడుస్తున్న రోజులు. సబర్మతి ఆశ్రమంలో కూడా విదేశీ వస్త్రాలన్నింటినీ పోగుచేసి మహాత్మాగాంధీ సమక్షంలోనే దహనం చేస్తున్నారు. ఇంతలో గాంధీజీ కుటుంబం నుంచి ఎవరో ఎంతో విలువైన, కళాత్మకమైన ఒక మహారాష్ట్రీ చీరను అక్కడకు తీసుకువచ్చారు. అది గాంధీజీ రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే, కస్తూర్బా గాంధీకి కానుకగా ఇచ్చిన చీర. దాన్ని అల్లుకొని గాంధీజీ దంపతులకు ఎన్నో పవిత్ర జ్ఞాపకాలు ఉన్నాయి. విదేశీ నూలుతో తయారైన ఆ చక్కని చేనేత చీరను భద్రపరచాలా లేక దానిని కూడా అగ్నికి ఆహుతి చేయాలా అని అక్కడి ఓ ఆశ్రమవాసి గాంధీజీని ప్రశ్నించారు. ఆ ప్రశ్న విని మహాత్ముడు చలించిపోవడం అందరికీ కనిపించింది. ఆయన క్షణం పాటు ఆలోచించి, మరుక్షణం ఆ పవిత్ర కళాత్మక కానుకను తన చేతులతో తానే అగ్నికి ఆహుతినిచ్చేశారు. ఒక జాతికి ఆత్మపరిశుభ్రత ఆవశ్యకతను నేర్పవలసి వచ్చినప్పుడు దాని ముందు ఎటువంటి మూల్యమైనా దిగదుడుపేనని నిరూపించారు. అదీ మహాత్ముడి గొప్పతనం!



భరతమాతనే మన అధిష్ఠానదేవతగా పూజిద్దాం. చిత్తశుద్ధి, హృదయపవిత్రతలే ఆ దేవిని పూజించటానికి మనకు ఉండాల్సిన ప్రధాన అర్హతలు. సేవ, త్యాగం లోపించిన దేశభక్తికి అర్థమే లేదు. సామాన్య ప్రజల్ని నిరాదరించటం దేశద్రోహంతో సమానం. జాతిపతనానికి అదీ ఒక కారణం. - స్వామి వివేకానంద

దేశాన్ని ప్రేమిస్తున్నామని చెప్పుకునే వ్యక్తికి ఉండాల్సిన మరో గుణం అహింస. హింస అంటే భౌతికపరమైన దాడి మాత్రమే కాదు, మనసులో క్రూరభావనలు కలిగివుండటమూ, మనిషిని మానసికంగా గాయపరచటమూ హింసే! అది చేతులతో చేసే హింస కన్నా ప్రమాదకరమైనది, పాపభూయిష్ఠమైనది. ఎదుటివారిపై అధికారాన్ని చెలాయించటం, మన మాటే చెల్లాలనే నిరంకుశత్వం, మాటలతో సాటిమనిషిని బాధపెట్టడం మానసిక హింస లక్షణాలు. మనిషిలోని ఆధిపత్య ధోరణికి చిహ్నాలివి. అందుకే, 'నువ్వు మరొకరి ధర్మాన్ని నిర్ణయించడం కన్నా మించిన హింస లేదు. ఎదుటి మనిషి ఇలానే జీవించాలనీ, ఇలానే ఆలోచించాలనీ భావించడం ఆధిపత్య భావజాలం తాలూకు అత్యంత సూక్ష్మరూపం' అంటారు ఓ ప్రముఖ తత్త్వవేత్త.

అపురూపమైన ఈ ఆరుసూత్రాలను ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిద్దాం. ఈ స్వాతంత్ర్య దినోత్సవం నుంచైనా స్వామి రామతీర్థ ప్రబోధించినట్లు మనది 'లిప్ పేట్రియాటిజమ్' కాదని, 'రియల్ పేట్రియాటిజమ్' అని నిరూపిద్దాం! ❖

భారతదేశ ప్రజలకు స్వయం సహాయకత్వం, నైతిక, మేధా సంబంధమైన విద్యను నేర్పకపోతే ప్రపంచంలోని సర్వ సంపత్తీ ఏకమైనా, దేశంలోని ఒక్క గ్రామానికి కూడా సాయపడజాలదు. - స్వామి వివేకానంద

మన ఆలోచన మారాలి!

- స్వామి శితికంఠానంద

విద్యారంగంలో, ముఖ్యంగా పాఠశాల విద్యలో విశేష అనుభవం గడించిన ఒక విద్యాధికుడు మాటల సందర్భంలో, 'మనం విజయానికి సంబంధించి మన నిర్వచనాన్ని మార్చుకోనంతవరకు మన సమాజంలో మార్పురాదు స్వామీజీ!' అన్నారు. అవును కదా! ఈ మాటలో చాలా సత్యం దాగి ఉన్నది. నేడు మనకు విజయానికి నిర్వచనం ఏమిటి? ధనం, సంపద, అధికారం, ఆస్తిపాస్తులు... ఇవే కదా ప్రపంచవ్యాప్తంగా మనుషులు విజయానికి, అభివృద్ధికి ఇచ్చుకునే నిర్వచనాలు. కానీ విజయానికి నిజమైన నిర్వచనం ఏమిటి? శాంతి, ఆనందాలే విజయానికి నిజమైన నిర్వచనాలు. ఏది సాధించినా, మనకేమి లభించినా అంతరంగ శాంతి, ఆనందాలు లేకుంటే అది విజయవంతమైన జీవితం ఎలా అవుతుంది? నేడు నిజమైన శాంతి అతి ఖరీదైన విలాసమైంది!

ఆ మధ్య ప్రపంచవ్యాప్తంగా ఏదేశంలో మనుషులు ఆనందంగా జీవిస్తున్నారని ఒక సంస్థ సర్వే చేసి ఒక పట్టికను తయారుచేసింది. ఆ పట్టికలో వివిధ దేశాలకు ర్యాంకులను కేటాయించారు. ఆధ్యాత్మిక భూమి అయిన భారతదేశానికి చాలా క్రింది స్థాయిని కేటాయించారు. 147 దేశాలలో సర్వే చేసి భారతదేశానికి 116వ స్థానాన్ని ఇచ్చారు. 'ఈ సర్వే నిజం కాదు. వాళ్ళ సర్వే పక్షపాతంతో కూడుకున్నది. అది సమగ్ర సర్వే కాదు. భారతదేశానికి వచ్చేటప్పటికి వాళ్ళు ప్రతిసారీ వివక్ష చూపుతూనే ఉంటారు. మనల్ని తక్కువగా చూపటంలో ఈ అంతర్జాతీయ సంస్థలు ఎప్పుడూ పోటీపడుతూంటాయి. ఇదంతా మన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటానికి వాళ్ళు పన్నే పన్నాగం' అనిపించింది ముందు! తరువాత, 'నిజంగా నేడు మన సమాజం ఆనందంగా ఉందా? ప్రజలు శాంతితో ఉంటున్నారా?' అని ఆలోచించినప్పుడు, 'చాలా అశాంతితో కూడుకున్న సమాజాల్లో మనది కూడా ఒకటి' అనిపించింది. కారణాలు చాలా ఉన్నాయి. ఇంత ఆధ్యాత్మిక భూమి అయివుండి; మనసు రహస్యం, ఆనంద రహస్యం కనుక్కున్న ఋషులు, మునులు ఎంతోమంది పుట్టిన భారతదేశంలో నేడు మనం ఎందుకు ఇంతలా శాంతికి దూరమయ్యాం? ఎందుకు మన జీవితాలు ఇన్ని కష్టాలతో కూడుకుని ఉన్నాయి? మనం ఎక్కడ పొరబడ్డాం? మనం మన సమాజాన్ని శాంతి, సత్యం వెల్లివిరిసే సమాజంగా ఎలా తీర్చిదిద్దుకోవచ్చు? కొద్దిగా ఆలోచిద్దాం!

శాంతి, ఆనందాలకు మూడు సూత్రాలు: మూడు విషయాలను ఆచరిస్తే మనం శాంతి, ఆనందాలతో ఉంటాం అనిపించింది.

మొదటిది, మనం ఇంకొకరిని అనుకరించకూడదు. వ్యక్తులుగానీ, దేశాలుగానీ! రెండవది, మనల్ని మనం ఇతరులతో పోల్చుకోకూడదు. మన ప్రత్యేకతను మనం నిలబెట్టుకోవాలి. ఇక్కడ కూడా వ్యక్తులు, మరియు సమష్టిగా దేశం.

మూడవది, మనం సిరిసంపదలను ప్రదర్శించటం మానుకోవాలి. అలా చేయటానికి సిగ్గుపడాలి కానీ గర్వపడకూడదు. ఎందుకంటే, నిజమైన ఐశ్వర్యం సంస్కారం, సదాచారం, మానవీయ విలువలే కానీ వస్తుసంపద కాదు. అలాగే, అన్ని పనులు సమానంగా గౌరవింపబడాలి. మన హృదయాల్లో కాస్త ప్రేమ దీపం వెలగాలి; ఇతరుల్లో దోషాలు చూడటం మానాలి; ఇవి రెండూ కలసి వెళతాయి. మనిషి నీతిమంతునిగా ఉండాలి. ధనమే జీవిత ధ్యేయం అవకూడదు. ధర్మాన్ని జీవిత ధ్యేయంగా చేసుకోవాలి.

నేడు చదువుకోనివాళ్ళే ఎక్కువగా నీతిమంతులుగా ఉన్నారు. అలాగే, కాయకష్టం చేసుకుని జీవిస్తున్న వారిలో అంత అభద్రతా భావం లేదు. ఈ ఎండాకాలంలో మిగతా నగరాల్లోలాగానే విజయవాడలో కూడా చాలాచోట్ల తాటిముంజలు అమ్మారు. తాటిచెట్లు తక్కువగా ఉండటం, రైతులు ఎక్కువగా

వాటిని నరికివేయటం వలన ఇంతకు ముందులాగా ఎండాకాలంలో తాటిముంజలు అంత విరివిగా లభించటం లేదు. అందుకని వాటికి డిమాండ్ పెరిగి, చాలాచోట్ల వాటిని అమ్ముతున్న వారిదగ్గర క్యూలు కనపడ్డాయి. అంటే, సరఫరా తగ్గటం వలన డిమాండ్ పెరిగింది. దానివలన వస్తువు ధర పెరుగుతుంది. ఇది ఆర్థికశాస్త్రంలో చాలా చిన్న సూత్రం. కానీ ఆశ్చర్యకరంగా వాటి ధర పెరగలేదు. ఎందుకంటే, వాటిని అమ్ముతున్న వాళ్ళందరూ పల్లెటూళ్ళ నుంచి వచ్చినవారు కావటం మరియు ఎక్కువగా చదువుకున్నవారు కాకపోవటమే! 'అదేమిటండీ వారి చదువుకు, ధరకు సంబంధం ఏమిటి?' అని మీరు అడగవచ్చు. వారు డజను తాటిముంజలను కేవలం వందరూపాయలకు అమ్మారు. ఎంతమందికి అమ్మగలిగితే అంతమందికే అమ్మి, తరువాత అయిపోయాయి అని చెప్పారే కానీ ఎక్కడా ఎక్కువ ధరకు అమ్మలేదు. వారిలోని నిజాయతీని చూసి చాలా ముచ్చటేసింది. 'ఎంత స్వచ్ఛమైన జీవితాలు వీరివి!' అనిపించింది. వాళ్ళ హృదయాలు ఇంకా సరళంగా ఉన్నాయి! వ్యాపార దృష్టి వాళ్ళ మనస్సుల్లోకి ఇంకా రాలేదు. చెమటోడ్చి సంపాదించుకోవాలనే ఇంకా తాపత్రయపడుతున్నారు.



నిజానికి ఇందులో ఎంతో శ్రమ ఉంది. తాటిచెట్లు ఎక్కాలి. మళ్ళీ సమీప నగరానికి వాహనంలో తాటికాయలను తీసుకురావాలి. ఎండలో కూర్చొని ముంజలు తీయాలి. ఎంత ప్రయాస! రెట్టింపు ధర పెట్టినా అన్నీ అమ్ముడయ్యేవే! అయినప్పటికీ ధర పెంచి, డబ్బులు ఎక్కువగా సంపాదించుకుందామన్న ఆలోచనే వారికి రాలేదు. వారంతా నిజంగా దేశంలో గుర్తింపు పొందని వీరులు కాదా? వాళ్ళలోని మంచితనాన్ని, నిస్వార్థ, కల్మషరహిత హృదయాన్ని మనం గుర్తిస్తున్నామా? చదువుకున్నవాళ్ళలో ఇలాంటి హృదయసౌందర్యం ఉందా? మనం పాశ్చాత్యులు ప్రవేశపెట్టిన విద్యను నేర్చుకుంటూ విలువలకు తిలోదకాలిస్తూ పూర్తిగా వ్యాపార ధోరణిలో ఆలోచిస్తున్నామా లేదా? ఇంత వ్యాపార ధోరణి మనకు అంత మంచిది కాదేమో! మనలో మానవీయత తగ్గి మనం మనిషిని కూడా ఒక వ్యాపార వస్తువుగా చూడటం నేర్చుకుంటున్నామా? విద్యాధికులుగా చెలామణి అవుతున్న మనం కాస్త ఆత్మపరిశీలన చేసుకోవాలి.

జీవితానుభవం ఉన్నతంగా ఉండాలంటే... మనం అందరం నిజానికి ఏమి కోరుకుంటున్నాం? ఉన్నతమైన జీవితానుభవాన్ని కోరుకుంటున్నాం. మనకు జీవితానుభవం ఎప్పుడు గొప్పగా ఉంటుంది? ద్వంద్వాతీతులమైనప్పుడు! మనం ఎలా ద్వంద్వాతీతులమవగలం? ప్రతిజీవిలోనూ దైవాన్ని చూడగలిగినప్పుడు. సర్వసమదృష్టిని, ఆదరణదృష్టిని ఏర్పరచుకున్నప్పుడు, మనలో అవ్యాజమైన కరుణ, అనురాగం, నిస్వార్థప్రేమ వెల్లివిరిసినప్పుడు మనం ద్వంద్వాలకు అతీతంగా వెళతాం. అప్పుడు మనకు జీవితానుభవం మధురంగా ఉంటుంది. ఐశ్వర్యాన్ని, ఆస్తిపాస్తులను పెంచుకోవడం ద్వారా మనం గొప్ప జీవితానుభవాన్ని పొందలేం. హృదయం ప్రేమతో నిండినప్పుడు మనసు ఎప్పుడూ సకారాత్మక ఆలోచనలతో నిండివుంటుంది. ఆ ఆలోచనలు మనకు ఆనందాన్నిస్తాయి, ఇతరులకూ మేలు చేస్తాయి.

శ్రీరామకృష్ణులను మనం ఉదాహరణగా తీసుకుంటే, ప్రేమతో నిండిన ఆయన హృదయంలో ఎప్పుడూ సదాలోచనలే ఉత్పన్నమయ్యాయి. సదా లోకకళ్యాణానికి ఉపయోగపడే ఉదాత్త భావనాతరంగాలే ఆయన మనోసరస్సులో ఉద్భవించాయి. మనకు జీవితం భారరహితంగా, ఉన్నతంగా ఉండాలంటే హృదయంలో ప్రేమ కావాలి. భగవంతుడు అనంత ప్రేమస్వరూపుడు. అందుకే సాధన చేసి అనంత ప్రేమస్వరూపుడైన భగవంతుడిని ప్రసన్నం చేసుకొని, ఒక ప్రేమ బిందువును పొందమని మనకు మన ఋషులు, మునులు చెబుతున్నారు. స్వామి అభేదానందజీ తాను రచించిన స్తోత్రంలో శ్రీశారదాదేవిని 'ప్రేమైకబిందుం చిరదగ్ధచిత్తే విషించ చిత్తం కురు నః సుశాంతమ్... చిరకాలంగా దహింపబడుతున్న నా చిత్తంలో ఒక ప్రేమబిందువును వర్షింపజేసి, తాపాన్ని తొలగించి, శాంతితో నింపుమమ్మా' అని ప్రార్థిస్తారు.

ప్రతికూల భావోద్వేగాలు శాంతినాశకాలు: అసూయ, భయం, కోపం, ఈర్ష్య, స్పర్ధ, వైషమ్యం... ఇవన్నీ ప్రతికూల ఆలోచనలను ప్రేరేపించి మనసులోని శాంతిని హరిస్తాయి. తొర్రలో పడిన అగ్నికణిక ఏవిధంగా వృక్షాన్ని దహించివేస్తుందో, అలాగే హృదయమనే తొర్రలో ఉన్న ఈ అగ్నికణికలు దేహమనే వృక్షాన్ని లోపలినుంచి దహించివేస్తాయి. అందుకనే మనం ఉన్నతమైన జీవితానుభవం కోసం, చిత్తశాంతిని పెంపొందించుకోవడం కోసం భగవంతుణ్ణి ప్రార్థించాలి. ఆయనే హృదయతరువులో ఉన్న ఈ అగ్నికణికలను ఆర్పివేస్తాడు. అంతేగానీ, ఏదో అనవసర ఆరాటంతో పూర్తిగా దేహంతో మమేకమై ఎవరితోనూ ఇమడలేక, స్వార్థపరత్వంతో ఇంద్రియతుల్య జీవితమే ఆనందాన్ని కొనితెస్తుందని భావిస్తూ మోసపోకూడదు. ప్రేయస్సు మొదట ఎప్పుడూ సుఖకరంగా

తోస్తుంది, కానీ పరిణామ క్రమంలో అది విషతుల్యంగా మారుతుంది. స్వేచ్ఛపేరుతో మనసులో ఉన్న భోగేచ్ఛను నిగ్రహించకుండా, విషయార్థాల వైపు పోనిస్తే మనల్ని మనం మోసం చేసుకుంటున్నట్లే! మనలోని అల్పాలోచనలకు, సుఖాభిలాషకు అడ్డుకట్టవేయటానికి ప్రయత్నం చేయకపోతే మనం మనుషులుగా నిజమైన వికాసాన్ని పొందనట్లే! కట్టుబాటులేని మనసుకు మించిన శత్రువు మనిషికి లేదు. మనం మనసుకు, కోరికలకు పూర్తిగా బానిసలుగా మారకూడదు. బానిసత్వం ఎన్నడూ ఎవరికీ ఆనందాన్ని కొనితేదు.

అయితే, ఈ ఆంతరంగిక బానిసత్వాన్ని, దౌర్బల్యాన్ని చాలామంది గుర్తించటం లేదు. జీవితం అంటే కోరికలకు బానిసగా బ్రతకటమే అనుకుంటున్నారు. మనస్సనే పిశాచం యొక్క కోర్కెలకు చిక్కి, శాంతిలేక మనిషి నేడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ప్రాపంచిక కోరికలతో నిండిన మనసు ఎప్పుడూ మనకు నిజమైన శాంతిని ఇవ్వదు. నేడు మనం చూస్తున్న దౌర్బల్యాలన్నీ మనసు బలహీనమవటం వలన కలుగుతున్నవే! దృఢసంకల్పంతో ఉన్న మనసు మనకు సహాయకారిగా ఉంటుంది. మనసును ఎలా దృఢతరం చేసుకోవాలి? ఆధ్యాత్మిక సాధన ద్వారా, సత్సాంగత్యం ద్వారా, ధార్మిక గ్రంథాలు చదవడం ద్వారా, సేవ ద్వారా మనం ప్రాపంచిక కోరికలను నిగ్రహించి మనసును శక్తిమంతం చేసుకోవచ్చును. మనకు మిత్రునిగా చేసుకోవచ్చును. నేడు మనకు ఎంతసేపూ బాహ్య ప్రపంచ పరిశోధనయే కానీ ఈ ఆంతరంగిక ప్రపంచాన్ని శోధించటం, అధ్యయనం చేయటం జరుగుట లేదు. ఎందుకంటే, ఆధునిక మనిషికి అంత సమయం లేదు. నేడు ఆధ్యాత్మిక విషయాలు, తత్త్వపరమైన విషయాలు చెబుదామంటే జీవితంలో స్థిరపడటంలోనే తలమునకలై ఉన్న మనుషులు ఈ విషయాలను అర్థం చేసుకోగలరా? ఇవి వారికి రుచిస్తాయా?

కానీ, ప్రతిమనిషీ కొంత సమయాన్ని తనను తాను చదువుకోవటానికి కేటాయించుకోవాలి. తద్వారానే మనోవికాసం కలుగుతుంది. మనల్ని మనం ఎంత బాగా అర్థం చేసుకుంటే మన కార్యనైపుణ్యాలు అంత బాగా పెరుగుతాయి. లౌకిక జీవితంలో తొందరగా 'స్థిరపడటానికి' కూడా ఇది గొప్ప దోహదకారి అవుతుంది. బాహ్యప్రపంచానికి మించిన ప్రపంచం ఈ పిండాండంలో ఉంది. ఈ పిండాండాన్ని అర్థం చేసుకుంటే బ్రహ్మాండాన్ని అర్థం చేసుకున్నట్లే! కావున ఆధ్యాత్మికత లేదా స్వాధ్యాయం మనిషి పూర్ణవికాసం చెందటానికి నిజమైన ఉపకారి. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నవారి జీవితాలు అర్థవంతమూ, ఫలవంతమూ అవుతాయి. శుభం భూయాత్! ❖

(...27వ పేజీ తరువాయి)

చేతులు కట్టుకు కూర్చునేకంటే...

ఇస్తాడనో అనుకుంటూ, భగవంతుని మీద నింద వేయడానికి ప్రయత్నించడం కంటే తెలివితక్కువతనం మరొకటి ఉండదు. ఆయన మనల్ని శిక్షించడు, మన్నించడు. ఆయన యొక్క అపారమైన కరుణ అన్ని కాలాలలో, అన్ని సందర్భాలలో, అన్ని పరిస్థితులలో, అన్నిచోట్లా, అందరిమీదా తప్పకుండా ఉంటుంది. దానిని ఎలా వాడుకుంటామన్నది మన మీదనే ఆధారపడి ఉంటుంది. దానిని ఎలా సద్వినియోగపరచుకుంటామన్నది మనమీదే ఆధారపడి ఉంటుంది. ఈ ప్రపంచంలోని బాధలన్నీ మూకుమ్మడిగా మీమీద పడుతున్నాయని మీకు తోచినప్పుడు మిమ్మల్ని మీరే నిందించుకోండి. ఇప్పుడున్న దానికన్నా మెరుగుగా పనిచేయడానికి ప్రయత్నించండి."

"భగవంతుడి కరుణ అనే పవనం నిత్యం వీస్తూనే ఉంటుంది. ఎవరు తమ పడవల మీద తెరచాపలు పైకెత్తుతారో వారి పడవలు ముందుకు పోతాయి. ఎత్తని వారి పడవలు అక్కడే ఉంటాయి. అందులో భగవంతుడి తప్పు ఏముంది?"

జీవితంలో కర్తవ్యం, బాధ్యత అనేవి అత్యంత దుఃఖమయమైన, ఘోరమైన విషయాలు. ఎందుకంటే కృష్ణుడే 'అనిత్యమసుఖం లోకమ్!' అని ఈ ప్రపంచాన్ని నిర్వచించాడు. బాధ్యత నుంచి తప్పుకోలేనని అర్జునుడు గ్రహించడమే అతడి మనసులోని గందరగోళాన్ని తొలగించింది. మరి మనిషి చేయవలసిన పని ఏమిటి? పెనుభూతంలాగా ఎదుట నిలబడి ఉన్న కర్తవ్యాన్ని నడుము బిగించి ఎదుర్కోవడమే మనిషి చేయవలసిన పని! జీవితంలో, 'ఏ బాధలూ ఉండకూడదు, మరణం కూడా ఉండకూడదు!' అనుకోవడం కంటే తెలివితక్కువతనం మరొకటి లేదు కదా! మనిషి తన కర్తవ్యాన్ని యజ్ఞంగా భావించి చెయ్యాలి. యజ్ఞం అంటేనే నిస్వార్థంగా చేసే కార్యం అని అర్థం. మనిషి తనలోని స్వార్థాన్ని పూర్తిగా త్యజించి ఆచరించే ప్రతి పనీ యజ్ఞం అవుతుంది. మనిషి ఆవిధంగా తన కర్తవ్యాన్ని నెరవేర్చినప్పుడు మాత్రమే ఈ ప్రపంచంలో ధర్మం నాలుగు పాదాల మీద నడువగలుగుతుంది. మనం చేసే పని నూరు శాతం అందరికీ, అన్ని విధాలా మంచి చేయడం అనేది ఈ భూప్రపంచంలో ఎన్నటికీ జరుగదు. కాబట్టి, చేతులు కట్టుకు కూర్చునేకంటే, నుయ్యో గొయ్యో... ఎందులోనో ఒక దానిలో దూకక తప్పదు. ❖

రామకృష్ణ మిషన్

రాజమహేంద్రవరం

మానవునిలోని మాధవుడిని సేవించు

సంప్రదించుటకొరకు
+91 6302257754
rajamahendravaram@rkmm.org
స్వామి వివేకానంద రోడ్, రామకృష్ణ-వివేకానంద నగర్,
రాజమహేంద్రవరం - 533105

ధర్మవైద్యశాల నూతన భవన (G +2) నిర్మాణం కోసం విరాళాలకై విన్నపం.

నూతన భవనం (G+2)
ప్రతిపాదిత నమూనా

ప్రస్తుత విభాగం (G+1)
ప్రతిపాదిత ముఖభాగ నమూనా



విషయం: నిధులకై విజ్ఞప్తి - రాజమహేంద్రవరం, గోదావరి బండ్ వద్ద గల రామకృష్ణ మిషన్ ధర్మవైద్యశాల నూతన భవన (G+2) నిర్మాణం

ప్రియ భక్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు,
సాదర నమస్కారములు!

స్వామి వివేకానంద ప్రబోధించిన 'మానవునిలోని మాధవుడిని సేవించు' అనే మహోన్నత సందేశ స్ఫూర్తితో రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్, గోదావరి బండ్ వద్ద ఉన్న ధర్మవైద్యశాల *(Charitable Dispensary)* ద్వారా గత నాలుగు దశాబ్దాలుగా వేలాది మంది పేద ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ, గిరిజన వాసులకు వైద్యసేవలను అందిస్తోంది.

ఈ ధర్మవైద్యశాలయందు వివిధ విభాగాల్లో నిపుణులైన అనేకమంది వైద్యులు తమ సేవలను నిస్వార్థంగా అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఓ.పి.విభాగం, రోగుల నిరీక్షణ హాల్, బి.పి., రక్తపరీక్షలు మరియు ఇతర వైద్యపరీక్షల విభాగాలు 62 సంవత్సరాల పురాతన రేకుల షెడ్‌లో నిర్వహించబడుతున్నాయి.

కాలగమనంలో ఈ రేకుల షెడ్ శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో వర్షపు నీరు లోపలికి చేరడం వలన వైద్యపరికరాలు పాడైపోతున్నాయి. అంతేకాకుండా, రోగులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

అందువల్ల శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్ స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవన (G+2) నిర్మాణం చేపట్టాలని సంకల్పించాం.

ఈ నూతన భవన నిర్మాణం మరియు ఇతర సదుపాయాల కోసం సుమారు 3.5 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా. ఈ మహత్తర సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి మీ అందరి సహకారాన్ని కోరుతున్నాం. మీరిచ్చే విరాళాలు అనేకమంది నిరుపేద ప్రజలకు ఆరోగ్యం మరియు సాంత్వన చేకూర్చగలవు.

ఉదార హృదయులైన భక్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు విరాళాలను అందించి, ఈ సేవాయజ్ఞంలో భాగస్వాములు కావలసిందిగా కోరుతున్నాం.

భగవాన్ శ్రీరామకృష్ణుల ఆశీస్సులు సదా మీపై వర్షించాలని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో...
స్వామి పరిజ్ఞేయానంద
కార్యదర్శి

ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ. 3.5 కోట్లు

విరాళాలు పంపించుటకోసం :

For Indian Donations:
ఖాతా పేరు : Ramakrishna Mission, Rajahmundry
బ్యాంక్ : Union Bank of India
శాఖ : Veerabhadrapuram Branch, Rajahmundry
ఖాతా సంఖ్య: 062610011010917
IFSC కోడ్ : UBIN0806269
విరాళం లింక్ : www.rkmrajahmundry.org/donation
విదేశీ దాతలు బ్యాంక్ వివరాల కోసం దయచేసి ఇ-మెయిల్ ద్వారా సంప్రదించగలరు.

UPI కోసం స్కాన్ చేయండి.

గమనిక : విరాళాలను NEFT/RTGS ద్వారా గానీ; బ్యాంక్ చెక్, డి.డి.ద్వారా గానీ పంపవచ్చు. మీరిచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80జి ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుంది.

విరాళం పంపిన తరువాత దాతపేరు, పూర్తి చిరునామా, PAN,Purpose, మొబైల్‌నంబర్ వివరాలను మాకు ఇ-మెయిల్ ద్వారా తెలుపగలరు.

వివరాలకు : Call or WhatsApp +91 63022 57754
email: rajamahendravaram@rkmm.org

శ్రీరామకృష్ణుల క్షేత్ర దివ్యత్వ గ్రహణశక్తి

- శ్రీమతి గంగవరం శ్రీదేవి



భారతీయ సంస్కృతిలో మనిషి ఆత్మోన్నతికి, చతుష్షష్టి కళల వినియోగానికి, సర్వజన సుఖశాంతికి, ప్రకృతి వైపరీత్యాల నివారణకు, ఆధ్యాత్మిక పరివర్తనకు, ధర్మపరిరక్షణకు, చతుర్విధ పురుషార్థ సాధనకు ఆలయాలు ప్రధాన కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. కలియుగంలో కర్మానుష్ఠానాలు, యజ్ఞయాగాదులు అత్యంత క్లిష్టమవడం వలన వాటి స్థానంలో భగవదర్చన రూపుదిద్దుకొన్నది.

ఆలయాలు, పుణ్యక్షేత్రాల వైశిష్ట్యం!

'ప్ర వః పాన్తమంధసో ధియాయతే మహే శూరాయ విష్ణవే చార్చత॥ - మహాపరాక్రమశాలియైన విష్ణువును ఏకాగ్రబుద్ధితో స్తుతించి, అర్చించండి' అన్న ఋగ్వేద మంత్రం భగవదారాధన ప్రాముఖ్యాన్ని చాటుతుంది. అనంతరకాలంలో ఆగమ శాస్త్రాల నేపథ్యంలో ఆలయాలు, అర్చనలు ఏర్పడి భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని పొందాయి. 'ఆలీయన్తే నిలీయన్తే జనః అత్రేతినిలయః' అని అమరకోశ వ్యాఖ్యానం. అంటే, భక్తజనులు ఎక్కడైతే భగవత్ సాన్నిధ్యాన్ని అనుభవించి భావంలో లీనమవుతున్నారో, ఆ ప్రదేశమే ఆలయమనబడుతోంది. శాస్త్రాలు ఆలయాలను ఐదు రకాలుగా వర్గీకరించాయి.

1. **స్వయంవ్యక్త ఆలయాలు** - భక్తులను అనుగ్రహించడం కోసం భగవంతుడే స్వయంగా ఆవిర్భవించినవి. ఇవి సర్వలోక జనులకు సమృద్ధిని కలిగించే అపార మహిమాన్వితమైనవి.
2. **దివ్య ఆలయాలు** - బ్రహ్మ, ఇంద్రాదులచే ప్రతిష్ఠించబడ్డవి. ఈ ఆలయాలు నూరు యోజనాల వరకు తమ ప్రభావాన్ని చూపగలవు. (యోజనం అంటే 9 మైళ్ళు)
3. **ఆర్ష ఆలయాలు** - ఋషులచే ప్రతిష్ఠించబడ్డవి. ఇవి ఐదు యోజనాల వరకు తమ శక్తిని చూపగలవు.
4. **పురాణ ఆలయాలు** - పురాణాలలో ప్రసిద్ధమైనవి. ఇవి మూడు యోజనాల వరకు ప్రభావం చూపగలవు.
5. **మానుష ఆలయాలు** - మనుషులచే నిర్మించబడ్డవి. ఇవి ఒక యోజనం వరకు తమ శక్తిని చూపగలవు.

ఆగమశాస్త్రాలను అనుసరించి జరిపే పూజావిధానాల ద్వారా అనంత చైతన్య దైవీశక్తిని ఆలయ అర్చామూర్తులు, పరిసరాలు సంతరించుకొంటాయి. అక్కడ ఉచ్చరించే మంత్ర, స్తోత్ర శబ్దతరంగాలు విద్యుదయస్కాంత తరంగాలుగా సూక్ష్మ భావతరంగాలుగా విస్తరించి, ఆలయం ఒక విశ్వశక్తి నిలయం (కాస్మిక్ పవర్ స్టేషన్)గా భాసిస్తుంది. జనులక్కడ ఎంతగా సాధనలు చేస్తే, భగవంతుడక్కడ అంతగా అభివ్యక్తమవుతాడు. ఆ ప్రదేశం ఒక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది.

అటువంటి మానుష (రాణీ రాస్మణి) నిర్మిత దక్షిణేశ్వర భవతారిణి కాళికాలయంలోనే కదా భగవాన్ శ్రీరామకృష్ణులు అసాధారణ సాధనలు సలిపారు! వేల సంవత్సరాల భారతీయ ఋషుల తపోజీవన సంస్కృతిని కేవలం ఒక్క జీవితకాలంలోనే సిద్ధింపజేసుకొన్నారు! ఆ మహత్వపూర్ణ ఆధ్యాత్మిక దివ్యశక్తిని తమ శిష్య ప్రశిష్యుల ద్వారా ప్రసరింపజేస్తున్నారు! దీనికంతటికీ ఆధారం, వేదిక... దక్షిణేశ్వర భవతారిణి కాళికాలయం!

శ్రీరామకృష్ణులు - తీర్థక్షేత్రాల దివ్యత్వం!

శ్రీరామకృష్ణులు తమ వద్దకు వచ్చే జనులందరినీ

తీర్థయాత్రలు, క్షేత్రదర్శనాలు చెయ్యమని ప్రోత్సహించేవారు. ఆయన రెండు విధాల భావభూమికల నుండి సమస్త విషయాలను పరికించి, పరిశీలించేవారు. 1. సాధారణ చైతన్యభూమి 2. ఉన్నత భావభూమి. ఈ ఉన్నత భావభూమి నుండి పరిశీలించినప్పుడు ఏ పుణ్యక్షేత్రంలో ఎంత ఆధ్యాత్మిక శక్తి ఘనీభూతమై ఉందో, సాధకుణ్ణి ఉన్నత భావ భూములకు అధిరోహింపజేయగలిగే శక్తి ఏ క్షేత్రంలో ఎంతమేరకు ఉన్నదో ఆయన గ్రహించగలిగేవారు.

"రూపరసాది భోగ్య వస్తువులపట్ల ఆసక్తిరహితమూ, దేవతలవంటి పావనమూ అయిన శ్రీరామకృష్ణుల మనస్సు ఆ సూక్ష్మాంశాలను కనుగొనగలిగే అద్భుత పరికరం. ఏదైనా పుణ్యక్షేత్రాన్నిగానీ, దేవాలయాన్నిగానీ సందర్శించిన తక్షణం ఆయన మనస్సు ఉన్నత భావభూములనధిరోహించి ఆ స్థలంలో లేదా దేవాలయంలో నెలకొన్న దివ్యత్వ అభివ్యక్తీకరణను ఆయనకు వెల్లడించేది" అంటారు స్వామి శారదానంద.

కాశీ, బృందావనం, నవద్వీప యాత్ర

ప్రళయకాలంలోనూ నిలచివుండే పరమపావన దివ్యక్షేత్రం కాశీ! అటువంటి కాశీక్షేత్రాన్ని శ్రీరామకృష్ణులు, మథుర్ తదితరులతో కలసి సందర్శించారు. యుగయుగాల నుండి విశ్వనాథుణ్ణి ఆరాధిస్తూ వస్తున్న సాధువుల, భక్తుల ఆధ్యాత్మిక భావరాశులు ఒక చోట ప్రోగై ఘనీభవించి ప్రస్తుత కాశీనగర రూపాన్ని సంతరించుకొన్నది. మణికర్ణికా ఘట్టం వద్ద శ్రీరామకృష్ణులకు కలిగిన దర్శనం అనుపమానమైనది. లింగపురాణాంతర్గతమైన 'కాశీఖండం'లో, కాశీలో మరణించే జీవులకు శివుడు ముక్తి ప్రసాదిస్తాడని పేర్కొనబడింది. అది ఏవిధంగానో శ్రీరామకృష్ణులు దర్శించారు. 'పొడగరీ, పింగళవర్ణ జటాధారీ, శ్వేతకాయుడూ అయిన పురుషుడొకరు శ్మశానంలోని ప్రతి చితివద్దకు వెళ్ళి, ఒక్కో జీవుణ్ణి జాగ్రత్తగా లేవదీసి, చెవిలో తారకబ్రహ్మమంత్రాన్ని ఉపదేశించసాగాడు. చితికి మరోవైపు సర్వశక్తిమంతురాలైన జగదంబ మహాకాళి రూపుదాల్చి, జీవుడి స్థూల సూక్ష్మ కారణ బంధనాలనన్నింటినీ త్రెంచివేసి, స్వయంగా మోక్షద్వారం తెరచి ఆ జీవుణ్ణి కైవల్యధామానికి పంపుతూ ఉంది' అని ఆయన వివరించారు.

ఆ యాత్రలో మథుర్‌తో పాటు వచ్చిన ఉద్దండ పండితులు ఈ వర్ణన విని, గురుదేవుల దివ్యదర్శనం శాస్త్రాలలో నమోదైన విషయాలను నిర్ధారించడమేగాక వాటిని కూడా మించిపోయిందని విస్మయం చెందారు. కాశీక్షేత్ర సందర్శనం తర్వాత శ్రీరామకృష్ణులు బృందావనం వెళ్ళారు. యమునా తీరంలో ఆలమందలను తోలుకువెళుతున్న గోపబాలుర నడుమ నెమలిపింఛధారి అయిన నీలమేఘశ్యాముణ్ణి దర్శించారు.

'ఆవుల కాలిగిట్టల ధూళి (గోధూళి) ఒళ్ళంతా నిండిపోయి సొంపైన వేషంతో వందలకొద్దీ గోపబాలురతో అనుసరింపబడుతూ, సాయంసమయాన పశువులను కట్టడం కోసం ప్రతి ఇంటికీ వెళుతున్న కపటగోప బాలుడైన శ్రీమన్నారాయణునికి నేను నిరంతరం నమ్రతతో నమస్కరిస్తున్నాను' అన్న లీలాశుకుడి మధుర మనోజ్ఞ దృశ్యాన్ని ప్రత్యక్షంగా అనుభూతి చెందారు. నిధువనం, గోవర్ధనగిరి మొదలైన ప్రదేశాలను సందర్శించారు. ఆ అద్భుత అచ్యుత శిశువును, రాధాకృష్ణులను వివిధ రీతులలో దర్శించి తీవ్ర ఆధ్యాత్మిక భావోద్వేగంతో, భగవత్ప్రేమతో పరవశించిపోయారు.

తర్వాత మరో సందర్భంలో ఆయన చైతన్య మహాప్రభువు జన్మస్థానమైన నవద్వీపానికి వెళ్ళారు. శ్రీరామకృష్ణులు చైతన్యులను మొదట అవతారపురుషునిగా విశ్వసించేవారు కాదు. నవద్వీపంలో చైతన్యుల దివ్యత్వ అభివ్యక్తీకరణ తమకు అనుభూతిలోకి వస్తుందేమోనని చాలా ప్రదేశాలకు వెళ్ళారు. కానీ ఎక్కడా అలా జరుగలేదు. తిరిగిరావడానికి పడవలోకి అడుగుపెడుతున్నప్పుడు, బంగారు వర్ణంతో మెరిసిపోతూ, తలల మీద జ్యోతిర్మండలం ప్రకాశిస్తుండగా ఆకాశమార్గం నుంచి ఇద్దరు లలిత సుకుమారులు పరుగెత్తుకుంటూ వచ్చి వారి దేహంలో లీనమైపోయారు. గురుదేవులకు ఇటువంటి ఎన్నో దర్శనాలు కలగడం వలన శ్రీచైతన్యులు అవతారమనీ, భగవదాంశసంభూతులనీ వారికి నమ్మకం కలిగింది.

శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు తమ మేనల్లుడు హృదయ్ స్వగ్రామమైన సిహోర్‌కు వెళ్ళేవారు. అలా ఒకసారి అక్కడకు దగ్గరలోని వనవిష్ణుపూర్‌కు వెళ్ళారు. అక్కడ వెలసివున్న 'మృణ్మయిదేవి' దర్శనానికి వెళుతుండగా దారిలోనే ఆ తల్లి ముఖారవిందాన్ని దర్శించారు. తర్వాత గుడికి వెళ్ళినప్పుడు తాము దర్శించిన దివ్యముఖానికి భిన్నంగా ఉన్న అమ్మవారి వదనాన్ని చూసి ఆశ్చర్యపడి, కారణాలను విచారించగా, ఒక మతిస్తిమితంలేని స్త్రీ ఆ విగ్రహాన్ని పగలగొట్టడం, యాజమాన్యం వేరేమూర్తిని ప్రతిష్ఠించడం... ఇవన్నీ తెలుసుకున్నారు.

దేవతల వంటి శ్రీరామకృష్ణుల పావన మానసం!

'స తు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః' అని పతంజలి మహర్షి చెప్పినట్లు సుదీర్ఘకాలం అపరిమిత శక్త్యుత్సాహాలతో, ఎనలేని భగవత్ప్రీతితో, దృఢదీక్షతో సలిపిన అపూర్వ సాధనలతో కలిగిన దివ్యయోగదృష్టి మహాద్భుతం!! మనకూ అటువంటి ప్రగాఢ సాధనోత్సాహాన్ని, భగవత్ప్రేమను కలుగజేయమని దివ్యపురుషులు, జగద్గురువులు, అవతారవరిష్ఠులు అయిన గురుదేవులు శ్రీరామకృష్ణులను మనసారా ఆర్తితో వేడుకుందాం! ❖



నవభారత నిర్మాణం

ప్రతి సంవత్సరం ఆగస్టు 15 ఉదయం భారతదేశపు దిగంతాలపై ఉదయారుణ కిరణాలు విరాజిల్లుతుండగా, త్యాగం, పోరాటం, ఆశయసాధన, ఆశాభావాల స్మృతులను మోస్తూ జాతీయ పతాకం గర్వంగా రెపరెపలాడుతుంది. నగరాలు, గ్రామాలు, పాఠశాలలు, సంస్థలలో లక్షలాది మంది 'స్వేచ్ఛా భారతాన్ని కలగన్న మహనీయులను, ఆ మహోన్నత ఆదర్శం కోసం జీవితాలను అర్పించిన అమరవీరులను' స్మరించుకుంటారు. అందుచేత స్వాతంత్ర్య దినోత్సవం కృతజ్ఞతాభావానికీ, స్మృతివందనానికీ పవిత్ర సందర్భం. అయితే, ఈ వేడుకల వెనుక ఆలోచించవలసిన లోతైన ప్రశ్న: **నిజమైన స్వాతంత్ర్యం అంటే ఏమిటి?**

రాజకీయ స్వాతంత్ర్యం అమూల్యమే! అయినా, ఒక దేశం బాహ్య స్వాతంత్ర్యాన్ని సాధించినప్పటికీ అంతర్గతంగా బలహీనంగా, విభజితంగా ఉండవచ్చని చరిత్ర గుర్తుచేస్తుంది. ఈ స్వేచ్ఛ శీలస్వాతంత్ర్యంగా, భయరాహిత్యంగా, స్వార్థవిముక్తిగా, అజ్ఞాన నిర్మూలనగా వికసించాలి. అందుకే, స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం చారిత్రక ఘట్టంగా కాక, మానవాత్మ శక్తులను, జాతి వివేకాన్ని మేల్కొలిపే ఆధ్యాత్మిక పిలుపుగా చూడాలని రామకృష్ణ-వివేకానంద సంప్రదాయం ఘోషిస్తోంది.

భారతదేశ జీవశక్తికి ఆధ్యాత్మికతే మూలాధారం. జాతీయ జీవనానికి మతమే కేంద్రబిందువు, ప్రాణస్వరమని స్వామి వివేకానంద పేర్కొన్నారు. దేశంలో జరిగిన ప్రతి పునరుజ్జీవనోద్యమమూ ఆధ్యాత్మిక మేల్కొలుపు నుంచే శక్తి పొందింది. 19, 20వ శతాబ్దాలలో జరిగిన పునరుద్ధరణ సైతం కేవలం రాజకీయం, సామాజికం కాక మూలంగా ఆధ్యాత్మికమైనదే! కీలక సమయంలో రామకృష్ణ-వివేకానందలు అవతరించి, భారతీయ ఆధ్యాత్మిక వారసత్వంపై విశ్వాసాన్ని ప్రజ్వలింపజేశారు. మన సంస్కృతిలోని అమూల్య ఆధ్యాత్మిక సంపదలను గుర్తుచేసి, భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించారు.

నిజమైన స్వేచ్ఛ - ఆధ్యాత్మిక వారసత్వం:

రామకృష్ణ-వివేకానంద సంప్రదాయం ప్రకారం నిజమైన స్వాతంత్ర్యం మన అంతరంగంలోనే ఆరంభమవుతుంది. మానవజీవిత పరమావధి భగవత్సాక్షాత్కారమని, ప్రతి మనిషిలో నిక్షిప్తమైన దివ్యత్వాన్ని వ్యక్తపరచడమని శ్రీరామకృష్ణులు, వివేకానందులు బోధించారు. బంధనం కేవలం బాహ్య అణచివేత కాదు; భయం, కోరికలు, ద్వేషం, పక్షపాతం, బలహీనతలతో మనస్సు బంధించబడటమే బంధనం.

అనుభవించినప్పుడు ప్రభుత్వాలు ప్రసాదించలేని, పరిస్థితులు హరించలేని నూతన స్వాతంత్ర్యం ఉదయిస్తుంది.

శ్రీశారదాదేవి ఈ అంతరంగ స్వాతంత్ర్యానికి సుందర మూర్తీభావం. పవిత్రత, కరుణ, సహనం, సర్వజనాంగీకారం, నిజమైన శక్తి వ్యక్తీకరణలను ఆమె జీవితం చాటిచెప్పింది. ఉన్నత-నిమ్న, విద్యావంతుడు-నిరక్షరాస్యుడు, స్నేహితుడు-పరాయివాడు అనే భేదాలు ఆమె దృష్టిలో లేవు. ఆమె మాతృత్వం అన్ని పరిమితులనూ అధిగమించింది. జాతి, మతం, సిద్ధాంతం, గుర్తింపు అనే విభజనలతో చీలిపోతున్న నేటి ప్రపంచంలో, ఆమె ఆదర్శం సామరస్యానికీ, సమన్వయానికీ, సౌభ్రాతృత్వానికీ ఒక దీపస్తంభంలా నిలుస్తోంది.

ఈ ఆధ్యాత్మిక సత్యాలను జాతీయ పునరుజ్జీవనానికి కార్యాచరణగా మలచినవారు స్వామి వివేకానంద. "బలమే జీవనం; బలహీనతే మరణం" అని ఆయన ఘోషించారు. స్వాతంత్ర్యం అంటే నిర్భయత్వం, ఆత్మవిశ్వాసం, సౌశీల్యం అనే స్తంభాలపై నిలబడిన జీవనవైఖరి. ప్రతి ఆత్మలోనూ దివ్యత్వం నిక్షిప్తమై ఉందని గుర్తుచేస్తూ, తమపై తాము విశ్వాసం పెంపొందించుకోవాలని ప్రబోధించారు. **జాతీయ మహోన్నతి పరాధీనత, అనుకరణ, ఆత్మన్యూనతాభావం అనే ఇసుక పునాదులపై నిర్మించబడదు. అది ఆత్మగౌరవం, ఆత్మసంయమనం, ఆధ్యాత్మిక వారసత్వంపై స్పష్టమైన అవగాహన అనే దృఢమైన పునాదులపై మాత్రమే నిర్మితమవుతుంది.**

నవ సమాజ నిర్మాణం- ఆధ్యాత్మిక విలువలు:

ఈ సందేశం నేటికీ అత్యంత ప్రాసంగికం. ఆధునిక సమాజం విజ్ఞాన, సాంకేతిక, సమాచార, భౌతిక రంగాలలో అసాధారణ

సమస్యలు ఇంకా పరిష్కృతం కాలేదు. సమాచారం అపారంగా పెరిగినా వివేకం మాత్రం అరుదుగానే కనిపిస్తోంది. పరస్పర అనుసంధానం విస్తరించినా, ఒంటరితనం, పరాయితన భావన తీవ్రమయ్యాయి. భౌతిక సౌకర్యాలు పెరిగినా, ఆందోళన, అసంతృప్తి, సామాజిక అసమ్మతి వ్యక్తులనూ, సమాజాలనూ నిరంతరం సవాలు చేస్తూనే ఉన్నాయి.

ఈ సవాళ్ళకు పరిష్కారం కేవలం భౌతిక ప్రగతిలో లభించదు. ఆధునిక నాగరికత సాధించిన విజయాలకూ, భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల శాశ్వత జ్ఞానానికీ మధ్య సృజనాత్మక సమన్వయం అత్యావశ్యకం. బాహ్య నమూనాలను గుడ్డిగా అనుకరించడం ఎంత ప్రమాదకరమో, గత వైభవానికే పరిమితమై జడత్వంలో నిలచిపోవడమూ అంతే ప్రమాదకరం. **వేగంగా మారుతున్న కాలంలో, ఆధ్యాత్మిక మూలాధారాల నుండి శక్తిని పొందుతూ, సమకాలీన అవసరాలకు వివేకంతో స్పందించగలిగినప్పుడే భారతదేశం తన నిజమైన మహత్తును ఆవిష్కరించగలదు. సంప్రదాయానికీ ప్రగతికీ, శాశ్వత విలువలకీ ఆధునిక ఆవిష్కరణలకీ మధ్య సమన్వయమే భవిష్యత్ భారత నిర్మాణానికి కీలకాధారం.**

ఈ సమన్వయం నేటి కాలానికి అత్యవసరం. సాంకేతిక పురోగతికి నైతిక బాధ్యత తోడవ్వాలి. ఆర్థికాభివృద్ధి కరుణ, సామాజిక న్యాయం అనే విలువలచే మార్గనిర్దేశితమవ్వాలి.

ఆధ్యాత్మిక స్ఫూర్తి

– బ్రహ్మచారి సత్యచైతన్య

విద్య వృత్తి నైపుణ్యాన్నే కాకుండా నిజాయితీ, సహానుభూతి, ఆత్మనిగ్రహాలను పెంపొందించాలి. విలువలు లేని ప్రగతి లక్ష్యరహిత శక్తిని సృష్టించగలదు; శీలం లేని సంపద సంతృప్తిలేని సౌకర్యాలనే అందించగలదు.

జాతి నిర్మాణం వ్యక్తి శీలనిర్మాణంతోనే ప్రారంభమవుతుంది. ప్రజల నైతిక నాణ్యతకు ప్రత్యామ్నాయంగా ఏ రాజ్యాంగమూ, సంస్థా, విధానమూ నిలవలేవు. రామకృష్ణ-వివేకానంద సంప్రదాయం ఆత్మశ్రద్ధ(తనపై తనకు విశ్వాసం)కు అత్యంత ప్రాముఖ్యతనిస్తుంది. తనను తాను గౌరవించుకునే పౌరుడు సహజంగానే ఇతరులనూ గౌరవిస్తాడు. స్వార్థాన్ని జయించిన వ్యక్తి నిస్స్వార్థ సేవకు అర్హుడవుతాడు. ఆధ్యాత్మిక ఆదర్శాల వెలుగుతో ప్రకాశించిన మనస్సు సమాజాభ్యుదయానికి దోహదపడుతుంది.

సేవాభావం, జాతీయ ఐక్యత, స్వాతంత్ర్య బాధ్యత

ఈ భావం ప్రతి మానవునిలో భగవంతుణ్ణి దర్శించి ఆరాధించే సేవ ద్వారా వ్యక్తమవుతుంది. శ్రీరామకృష్ణులు సమస్త జీవరాశులలో భగవంతుణ్ణి దర్శించారు. ఆ అనుభూతిని స్వామి వివేకానంద సంఘటిత సేవకు పిలుపుగా మలిచారు. **నిజమైన దేశభక్తి దేశం పట్ల భావోద్వేగపూరిత అనుబంధం కాదు, దేశ ప్రజల శ్రేయస్సు పట్ల చైతన్యపూర్వక, క్రియాశీల శ్రద్ధ.** వృత్తిలో నిజాయితీ, పౌరజీవితంలో బాధ్యతాయుత ప్రవర్తన, బలహీనులు, అణగారినవారి పట్ల కరుణ, సమష్టి మేలు కోసం అంకితభావంతో పనిచేయడం ద్వారా అది వ్యక్తమవుతుంది. సామాజిక సామరస్యం, జాతీయ ఐక్యత భారతదేశ ప్రగతికి అనివార్య పునాదులు. **వైవిధ్యాన్ని ఆదరిస్తూనే, దాని అంతరాలంలో ప్రవహించే ఆధ్యాత్మిక ఏకత్వాన్ని కాపాడగల సామర్థ్యమే భారతదేశ వైశిష్ట్యం.** హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలు, ఇతర సమాజాలవారు కలసి భారతీయ నాగరికత అనే విశాల సంస్కృతి సౌధాన్ని నిర్మించారు. కానీ **జాతి భవిష్యత్తు ఏకరూపతలో కాదు; పరస్పర గౌరవం, అవగాహన, సహకార స్ఫూర్తి, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే దృక్పథంలోనే నిహితమై ఉంది. భారతదేశం ఆధ్యాత్మిక ఏకత్వాన్ని సజీవంగా ఉంచుకున్నంతకాలం, దాని వైవిధ్యం బలహీనతగా కాక మహాశక్తిగా వికసిస్తుంది.** స్వాతంత్ర్య దినోత్సవవేళ, స్వాతంత్ర్యం గతం నుండి సంక్రమించిన వారసత్వమే కాక, వర్తమాన తరానికి అప్పగించిన మహత్తర బాధ్యత అని గుర్తుంచుకుందాం. ప్రతి తరం శీలం, క్రమశిక్షణ, సేవాభావం, ఆధ్యాత్మిక వికాసాల ద్వారా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవాలి. స్వాతంత్ర్యం వైపు సాగుతున్న ఈ అసంపూర్ణ యాత్ర ప్రతి మానవ హృదయంలోనూ ఇంకా కొనసాగుతూనే ఉంది.

స్వామి వివేకానంద భారతదేశాన్ని, ఆధ్యాత్మిక గమ్యాన్ని గ్రహించి మేల్కొన్న జాతిగా దర్శించారు. బలశాలియైనా కరుణామయిగా, ఆధునికమైనా తన మూలాలతో అనుసంధానమైనదిగా, ప్రగతిశీలమైనా మానవీయ విలువలున్న భారతదేశంగా దర్శించారు. మేల్కొంటున్న మాతృభూమి గురించి ఆయన ప్రేరణాత్మక పిలుపులు నేటికీ ఆశాజ్యోతిని వెలిగిస్తూనే ఉన్నాయి. మన ముందున్న పిలుపు స్వాతంత్ర్యాన్ని స్మరించుకోవడానికే కాదు, జీవితాల్లో సాకారం చేసుకోవడానికి కూడా! ఈ స్వాతంత్ర్య దినోత్సవం సత్యనిష్ఠతో కూడిన జీవితాలను నిర్మించడానికి, నిర్భయమైన మనస్సులను పెంపొందించడానికి, కరుణతో నిండిన హృదయాలను వికసింపజేయడానికి, అత్యున్నత ఆదర్శాలకు తగిన జాతిని నిర్మించడానికి మనల్ని ప్రేరేపించుగాక! అప్పుడు రాజకీయ స్వాతంత్ర్యం మరింత ఉన్నత రూపంలో వికసించి, భారతదేశానికే కాక, సమస్త మానవాళికి శ్రేయస్సును చేకూర్చే మహత్తర ఆధ్యాత్మిక పునరుజ్జీవనంగా మారుతుంది. ❖

భారతదేశం నుండి ఆధ్యాత్మికత తొలగిననాడు ఎన్ని రాజకీయాలున్నప్పటికీ, సాంఘిక సంస్కరణలున్నప్పటికీ, ధనం ఎంత కుమ్మరించినప్పటికీ భారతదేశం పతనమైపోతుంది. - స్వామి వివేకానంద

ప్రాణస్నేహితులు

చిత్రాలు : ఇలయ భారతి
ఆధారం : సంగ సాహిత్య కథలు, ఆచార్య మ. సురేంద్రన్
అనుసృజన : స్వామి జ్ఞానదానంద


1
కోప్పరుంచోళన్ అనే రాజు ఉరయూరును రాజధానిగా చేసుకొని రాజ్యపాలన చేస్తూవచ్చాడు. అతడికి మాతృభాష అంటే వల్లమాలిన అభిమానం. అతడి ఆస్థానపండితుడు పోత్తియార్.
2
పండితులారా! మీ నుండి తమిళం రుచిని అనుభవించడం నాకు మహదానందంగా ఉంది.
అవును రాజా! మేమూ ఆనందమూ, గర్వమూ చెందుతున్నాం. మీరు మాతృభాషను అభిమానించే నాయకులు. మీరు అభిమానించి పెంపొందించే తమిళం శాశ్వతంగా వెలుగొందుతుంది.
రాజు, పోత్తియార్ మంచి మిత్రులు.
3
పాండ్య రాజ్యంలో పిసిరి అనే ఊళ్ళో ఆందయార్ అనే పండితుడు చోళుని చూడకనే ఆయనపై అభిమానమూ, ఆయన పట్ల స్నేహభావమూ కలిగివున్నాడు.
రాజుల్లో మహిమ గలవాడు చోళరాజు. ఆయన దాతృత్వం, కరుణ సాటిలేనివి; ఎప్పుడు చూడగలను నా ఉత్తమ స్నేహితుణ్ణి?

4


అటు చోళరాజు కూడా ఆ పండితుణ్ణి ప్రత్యక్షంగా చూడకనే, అతని పట్ల ఎనలేని స్నేహాభిమానాలు పెంచుకున్నాడు.
పెద్దలు స్తుతించే ఆందయార్ పండితుడి కీర్తి విని, ఆయనను కళ్ళారా చూడకుండానే ఆయన పట్ల స్నేహాభిమానాలు పెల్లుబుకుతున్నాయే! పరమేశ్వరుని అనుగ్రహంతో మేము ఎప్పుడో ఒకప్పుడు తప్పక కలుసుకుంటాం!

5


చోళుని ఇద్దరు కుమారులూ రాజ్యాన్ని హస్తగతం చేసుకోదలచి తండ్రిపైనే యుద్ధానికి దిగారు. దాంతో రాజు కూడా వాళ్ళను ప్రతిఘటిస్తూ యుద్ధరంగంలోకి దిగాడు. అప్పుడు ఆస్థానపండితుడు పొత్తియార్ కూడా యుద్ధరంగానికి వచ్చాడు. అక్కడ...
రాజా! యుద్ధం ఆపి, నాతో రండి.
వీళ్ళు నా కొడుకులా? ద్రోహులు. వీళ్ళ కథ ముగించి వస్తాను.
రాజా! వీరు మీ శత్రువులు కారు, పుత్రులు. వీళ్ళను జయించి మీరు సాధించేది ఏమిటి?


6
మీరు రాజ్యాన్ని మరెవరికిస్తారు. వారిని వధిస్తే, మీకు అపనిందే మిగులుతుంది. యుద్ధాన్ని ఆపి, రాచకార్యాలలో నిమగ్నులవ్వండి. అది మీకు ప్రశాంతతను ఇస్తుంది.
యుద్ధాన్ని ఆపుతాను. ఇక నాకు దేనివల్లా ప్రశాంతత రాదు. నేను ప్రాయోపవేశం చేసి ప్రాణం విడుస్తాను.


7
రాజు ప్రాయోపవేశం చేసి ప్రాణం విడుస్తారనే వార్త రాజ్యమంతా వ్యాపించింది.
మన రాజు ప్రాయోపవేశం చేస్తారట కదా!
అంతా ఆ పిల్లల వల్లనే!
వెంటనే వెళ్ళి, ఆయనను బ్రతిమాలి నిర్ణయాన్ని మార్చుకోమని ప్రాధేయపడదాం.


8
రాజా! ప్రజలు ఎంతో బాధపడుతున్నారు; మీరు మళ్ళీ రాజ్యపాలన చేపట్టాలి.
అందరూ నన్ను క్షమించండి. ఎట్టి పరిస్థితుల్లోనూ నా నిర్ణయాన్ని మార్చుకోను.


9
రాజా! నేనూ మిమ్మల్ని అనుసరింప అనుమతివ్వండి. మీరు లేని చోట నాకు ఏం పని?
పండితవర్యా! మీ భార్య గర్భిణి. ఆమె ప్రసవించాక మాత్రమే నా వద్దకు రండి.

10


మిత్రమా! నేను చూడని నా మిత్రుడు నన్ను కలుసుకోవడానికి త్వరలోనే వస్తాడు.
మీరు చూడని మీ మిత్రుడు మిమ్మల్ని కలుసుకోవడానికి వస్తాడని ఎలా చెబుతారు?
నా స్నేహం మీద ఉన్న నమ్మకంతో!

11


అదిగో, ఎవరో కొత్తవారు వస్తున్నారు. మీ మిత్రుడేనా!?
అవును, ఆయనే అయివుంటాడు. నా ప్రాణస్నేహితుడా! వచ్చేశావా!

12


ఆందయార్ పండితా! ఇన్నాళ్ళూ ఎక్కడ ఉన్నారు?

రాజు, ఆందయార్ పండితుడు విలపిస్తూ కౌగిలించుకొన్నారు. పిదప పక్కపక్కనే కూర్చున్నారు.

13 ఈలోపు ఆస్థానపండితుడైన పోత్తియార్‌కు కొడుకు పుట్టాడు. అతణ్ణి చూశాక ఆనందంతో రాజును చూడవచ్చాడు. కానీ అక్కడో... రాజు, ఆందయార్ పండితుడు కూర్చున్న చోట రెండు శిలాఫలకాలు ఉన్నాయి.


ఆ! ఇదేమిటి? రాజుగారు నాకోసం ఎదురుచూడక ప్రాణం విడిచివేశారా? ఈ శిలాఫలకాలను చూడటానికే వచ్చానా?

భోరున విలపిస్తూ పోత్తియార్ కింద పడిపోయి, అక్కడికక్కడే ప్రాణం విడిచాడు. ఈ ముగ్గురు ప్రాణస్నేహితులూ నేటికి నిజమైన స్నేహానికి సజీవ నిదర్శనంగా వెలుగొందుతున్నారు.



నేటి బేతాళ ప్రశ్నలు

- బి. సైదులు

బ్రహ్మదేవుడికి అయిదు ముఖాలా?

విక్రమార్కుడు పట్టు వదలకుండా మళ్ళీ ఆ మాను వద్దకు వెళ్ళాడు. ఆ చెట్టుపై ఉన్న శవాన్ని భుజంపై వేసుకొని మెల్లగా శ్మశానం వైపు నడవసాగాడు. మహారాజును మాట్లాడిస్తే తిరిగి తాను ఆ మానుపైకి ఎక్కేయవచ్చని బేతాళుడు ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఆ బేతాళ బుర్రలో బ్రహ్మదేవుడు మెదిలాడు. ఎప్పటినుంచో ఆ బుర్రను తొలుస్తున్న సందేహాన్ని ఆ మహారాజు ముందు ఉంచుతూ ఇలా ప్రశ్నలను కురిపించసాగాడు:



"విక్రమార్కా! మన దేవతల రూపాలు చాలా విచిత్రంగా ఉంటాయనిపిస్తోంది. ఒకరికి ఏనుగు తల, మరొకరికి గుర్రం తల, మరో స్వామికేమో మృగనర శరీరం... ఇలా ఏమిటో చిత్రవిచిత్ర రూపాలు! ఇక త్రిమూర్తుల్లో బ్రహ్మదేవుడినే తీసుకో! నాలుగు ముఖాలతో చతుర్ముఖ బ్రహ్మగా ప్రసిద్ధుడు. కానీ నేను బతికున్నప్పుడు అనుకోకుండా ఓ పురాణ ప్రవచనానికి వెళ్ళాను. అక్కడ యథాలాపంగా విన్న మాటల్లో ఓ కొత్త విషయం తెలిసింది. బ్రహ్మదేవుడికి అయిదు ముఖాలుండేవని, ఏదో కారణంతో ఒక తల పోగొట్టుకున్నాడని ఆ ప్రవచనకారుడు చెప్పుకొచ్చాడు. మనం ఏదీ పూర్తిగా వినం కదా! కూసే గాడిదొచ్చి మేసే గాడిదని చెడగొట్టినట్లు, పనీపాటా లేకుండా తిరిగే నా మిత్రుడు ఒకడు వచ్చి నన్ను అక్కడి నుంచి లాక్కెళ్ళిపోయాడు. దాంతో బ్రహ్మగారి ఆ అయిదో తల విషయం పూర్తిగా తెలుసుకోలేకపోయాను. ఇంతలో భూమిపై నాకు నూకలు చెల్లి, ఇలా బేతాళుడినై శ్మశానంలో పడి ఏడుస్తున్నాను. అసలు బ్రహ్మదేవుడి ఐదు తలల కథ నిజమేనంటావా? ఊరికే పుక్కిట పురాణంలోని కథేనా? నిజమే అయితే మరి ఆ అయిదో తల ఎటుపోయింది? నాలుగు తలలవాడే ఎందుకయ్యాడు? నా ప్రశ్నలకు జవాబులు తెలిసి కూడా చెప్పకపోయావో ఆ ఐదో తలలా నీ తల కూడా ఊడిపడిపోతుంది".

బేతాళుడు చతుర్ముఖ బ్రహ్మ గురించి అడిగిన ప్రశ్నలకు విక్రమార్కుడు మందహాసం చేస్తూ ఇలా సమాధానం చెప్పసాగాడు: "బేతాళా! సగమే విన్నా నువ్వు ఆ బ్రహ్మదేవుడి గురించి ఆలకించిన కథ నిజమే! నీ మిత్రుడు పిలిచినా వెళ్ళకుండా ఆ ప్రవచనం పూర్తిగా విని ఉంటే అప్పుడే నీ సందేహం తీరిపోయేది. నీకు కాస్త పుణ్యం కూడా దక్కి ఉండేది. నాకూ ఇలాంటి సందేహమే కలిగినప్పుడు మా ఆస్థాన పండితుడు ఆ సంశయాన్ని తీర్చాడు. బ్రహ్మదేవుడికి తొలుత అయిదు ముఖాలు ఉండేవట! అయితే ఒకసారి దేవలోకంలో విచిత్రమైన చర్చ వచ్చిందట! బ్రహ్మ, విష్ణువుల్లో ఎవరు అధికులు? అన్న ప్రశ్న తలెత్తిందని చెబుతారు. అక్కడే ఉన్న శంకరుడిని మధ్యవర్తిగా చేసుకొని అభిప్రాయం చెప్పమన్నారట! అప్పుడు పరమశివుడు వారిరువురికీ ఓ చిన్న పరీక్ష పెట్టాడు. మహాలింగాకారం ధరించి, తన మూలం చూసి రమ్మని విష్ణువును పంపాడు. అలాగే, తన అగ్రభాగాన్ని చూసి రమ్మని బ్రహ్మదేవుడిని ఆదేశించాడు. చూసి వచ్చిన తరువాత తన నిర్ణయం చెబుతానన్నాడు. విష్ణుమూర్తి వరాహరూపం ధరించి శివలింగ మూలం తెలుసుకోవటానికి ప్రయత్నం చేశాడు. కానీ, అది అసాధ్యమని నిర్ధారించుకొని అదే విషయాన్ని నిజాయితీగా పార్వతీశుడికి చెప్పాడు. ఇక బ్రహ్మదేవుడు హంసరూపం దాల్చి పైకి ఎగిరాడు. అగ్రభాగం చూడకున్నా చూశానని అబద్ధం చెప్పాడు. అసత్యం చెప్పిన దోషఫలితంగా బ్రహ్మదేవుడి అయిదు ముఖాల్లో ఒకటి గార్దభ ముఖంగా మారిపోయింది. అధికుడినన్న గర్వం పనికిరాదని మహేశ్వరుడు బ్రహ్మకు హితవు పలికాడు. అయినా, అసత్యమాడినందుకు బ్రహ్మదేవుడు పశ్చాత్తాపపడలేదు. పైగా, ఆగ్రహంతో ఆ సరస్వతీపతి పశుపతినే తూలనాడాడు. శివుడు కాలభైరవుణ్ణి సృష్టించి బ్రహ్మదేవుడికి బుద్ధిచెప్పమన్నాడు. వెంటనే కాలభైరవుడు బ్రహ్మ గార్దభ ముఖాన్ని ఖండించాడు. అలా ఖండించిన బ్రహ్మ శిరస్సుకు చెందిన కపాలాన్ని చేతబట్టి శివుడు భిక్షాటన చేస్తున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. అసత్య భాషణం, అహంకారముల ఫలితాన్ని బ్రహ్మదేవుడైనా అనుభవించక తప్పదని ఈ ఉదంతం వల్ల అర్థమవుతుంది. అందుకే శ్రీరామకృష్ణులు 'సత్యం పలకటం తపస్సుతో సమానం. అహంకారం మనిషి పతనానికి ప్రధాన కారణం' అనేవారు."

ఇలా విక్రమార్కుడికి మౌనభంగం కలగగానే బేతాళుడు తిరిగి చెట్టెక్కాడు. ❖

Printed and published by **Swami Bodhamayananda** owned by Ramakrishna Math Trust and
printed at Kala Jyothi Process Pvt. Ltd., Plot No. CFC-1&2, Survey No.18, E-City, SEZ,
General Industrial Park, Raviryal & Srinagar (V), Maheswaram (M), R.R.Dist, Telangana - 501359
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad -500029. **Editor: Swami Siteshananda**

మాతృదేవి : భగవంతుడు అందరి సొంతం! భావన తీవ్రత మేరకు ఈ సత్యాన్ని గ్రహించవచ్చు.

నేను (స్వామి అరూపానంద) : అమ్మా! భావన అనేది ఒక కల్పన కదా, కల లాంటిది కదా! పదేపదే కల్పన చేసుకొని చివరకు కలలో చూస్తాం. అలాగే కదా!

మాతృదేవి : అవును, కల కాక మరేమిటి? ఈ ప్రపంచమే ఒక కల. ఇది (జాగ్రదవస్థ) కూడా ఒక కలే!

నేను : కాదు, ఇది కల కాదు. కలే అయితే క్షణంలో చెదరిపోయుండాలి. కానీ ఈ స్థితి అనేక జన్మలుగా ఉంటూ వస్తోంది కదా!

మాతృదేవి : కావచ్చు. అయినప్పటికీ ఇది కలే గాని మరేమీ కాదు. రాత్రి నువ్వు కన్న కల ఇప్పుడు లేదు కదా! తన కుమారుణ్ణి కోల్పోయిన ఒక రైతు తాను ఒక మహారాజు అయినట్లు, ఎనిమిది మంది కుమారులకు తండ్రి అయినట్లు కలగన్నాడు. కల చెదరిపోగానే అతడు 'ఆ ఎనిమిది మంది కుమారుల కోసం విలపించాలా? లేక ఈ కుమారుని కోసం విలపించాలా?' అని తన భార్యను అడిగాడు.

నేను : అమ్మా! ఈ విషయాల గురించి నేను తల బద్దలు కొట్టుకోవడం లేదు. నాకు సొంతమంటూ ఒకరు ఉన్నారా లేదా అనే విషయం గురించి మాత్రమే నేను తెలుసుకోగోరుతున్నాను.

మాతృదేవి : లేకేం నాయనా! తప్పక ఉన్నారు.

నేను : మనకు సొంతమైనప్పుడు భగవంతుణ్ణి చూడటానికి ప్రార్థించవలసిన అగత్యమెందుకు? నాకు సొంతమైనవారు నేను పిలువకపోయినా నా వద్దకు రావాలి కదా! తల్లితండ్రులు మనల్ని చూసుకొనేటట్లుగానే భగవంతుడు కూడా చూసుకొంటాడా?

మాతృదేవి : అవును నాయనా! ఆయనే తల్లిగా, తండ్రిగా రూపుదాల్చాడు. ఆయనే తల్లితండ్రుల రూపంలో మనల్ని పెంచుతాడు. ఆయనే మనల్ని పోషిస్తాడు.

నేను : నిజంగానే భగవంతుడు నా సొంతమని నేను గ్రహించగలుగుతానా?

మాతృదేవి : గ్రహిస్తావు, తప్పక గ్రహిస్తావు. సకలమూ నీకు సిద్ధిస్తుంది. నువ్వు కోరినవన్నీ లభిస్తాయి. ❖

SRI RAMAKRISHNA PRABHA YouTube CHANNEL
శ్రీరామకృష్ణ ప్రభ యూట్యూబ్ ఛానల్
QR Code
వీడియోలను చూడండి... అందరితో పంచుకోండి.
❖ నైతిక, ఆధ్యాత్మిక అంశాలు
❖ వ్యక్తిత్వవికాస అంశాలు
❖ సూక్తులు
❖ భక్తికథలు
❖ నీతికథలు
❖ భక్తిగీతాలు

Vol.83 - 8, Sri Ramakrishna Prabha (Telugu Monthly) August 2026. Title Code - TELTEL00400,
Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HCD-1071/2025-27.
Licensed to Post Under WPP: PMG/TS/HQR/HCD-01/WPP/2025-27. Date of Publication: 24th of every month.
Date of Posting: 26th & 27th of every month. Place of posting: Patrika Channel, Nampally, Hyderabad - 500001.

క్రీడాస్ఫూర్తి

క్రీడలు మనల్ని శారీరకంగా దృఢంగా ఉంచడమే కాదు మన మనోవికాసానికీ దోహదపడతాయి. బలహీనమైన దేహం లౌకిక విజయాలకే కాదు, పారలౌకిక సాధనలకు కూడా సహకరించదు. అందుకే స్వామి వివేకానంద.. బలహీనులుగా ఉండి భగవద్గీతను పారాయణం చేయటం కన్నా ఫుట్‌బాల్ ఆడి ముందు శారీరక దారుఢ్యాన్ని సంపాదించుకుంటే, ఆ గ్రంథాన్ని మరింత విశదంగా అర్థం చేసుకోవచ్చన్న భావంతో *'You will be nearer to heaven through football than through the study of the Gita... you will understand the Gita better with your biceps, muscles, a little stronger'* అన్నారు. ఉన్నత జీవన లక్ష్యాల సాధనకు, ధైర్యసాహసాలకు ఇనుప కండరాలు, ఉక్కునరాలు ఎంత అత్యావశ్యకమో నొక్కిచెప్పారు.

క్రీడల్లోని క్రమశిక్షణ, కఠోరదీక్ష, దృఢచిత్తం జీవన సాఫల్యానికి తోడ్పడతాయి. అధ్యయనంతో పాటు ఆటలను కూడా దినచర్యలో భాగంగా చేసుకున్నప్పుడే విద్యార్థులు జీవితంలో రాణిస్తారని సైకాలజిస్టులు చెబుతున్నారు. అందుకే ప్రముఖ గ్రీకు తత్త్వవేత్త ప్లేటో *'You can discover more about a person in an hour of play, than in a year of conversation* - ఒక వ్యక్తితో ఏడాది పాటు మాట్లాడి అతనిని అవగతం చేసుకోవటం కన్నా, ఓ గంట పాటు ఆ వ్యక్తి ఆటతీరును పరిశీలించి అతని వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు' అని అంటారు.

మన నిత్యజీవితంలో ఎదురయ్యే ఎన్నో సవాళ్ళను, సంఘర్షణలను, ఒత్తిళ్ళను, ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కోవడానికి కావలసిన శక్తిసామర్థ్యాలు, మనోబలం క్రీడల ద్వారా అలవడుతాయి. విజయవైఫల్యాలను సమంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తి (స్పోర్ట్స్ స్పిరిట్) వ్యక్తిగత జీవితానికి సహాయపడుతుంది. క్రీడల ద్వారా కేవలం పతకాలు, పురస్కారాలు, కప్పులు, కరతాళ ధ్వనులే కాకుండా క్రీడాకారులకు ఉన్నత ఉద్యోగాల రూపంలో ఉపాధి మార్గాలూ స్వాగతం పలుకుతున్నాయి. 'హాకీ క్రీడతో భారతదేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించిన ప్రముఖ క్రీడాకారుడు 'ధ్యాన్‌చంద్' గౌరవ సూచకంగా, ఆయన జయంతి అయిన 'ఆగష్టు 29'ని ఏటా జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహించటం ఆనవాయితీ! ❖

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ**, డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED
(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)
Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net
Website : www.svisslabss.net

TÜV
TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 4,400 విద్యాసంస్థలకు కానుక చందా చెల్లించారు.

If undelivered please return to :
SRI RAMAKRISHNA PRABHA
RAMAKRISHNA MATH, DOMALGUDA, HYDERABAD - 500 029.
PHONE : 040 - 2766 7799, 88018 49494